RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:17 హైదరాబాద్, గురువారం, 26 జూన్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## అదనపు కలెక్టర్లు వారంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు సందర్శించాలి: సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్: తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని సీఎంకు అధికారులు వివరించారు. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.



ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించాలని, గ్యాస్.. కట్టెల పొయ్యిల బాధ లేకుండా మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు సోలార్ కిచెన్ల ఏర్పాటుపై వెంటనే దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణలవుతున్న విద్యార్థులకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య తేడా ఎందుకు ఎక్కువగా ఉందని అధికారుల్ని ప్రశ్నించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ తర్వాత జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందొచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదు: శ్రీధర్‌బాబు ఆవేదన

దిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు.



హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## పది' పరీక్షలు.. ఇక ఏడాదికి రెండుసార్లు

పదో తరగతి పరీక్షలు ఏడాదికి రెండుసార్లు చేపట్టనున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో నిర్వహించే తొలి విడత పరీక్షలను తప్పనిసరి చేయగా.. మే నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షలను ఆప్షనల్‌గా పెట్టింది. 2026 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపింది. వీటికి సంబంధించి కొత్త నిబంధనలకు సీబీఎస్ఈ తాజాగా ఆమోదం తెలిపింది.

విద్యార్థులపై బోర్డు పరీక్షల ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా నూతన జాతీయ విద్యా విధానం పలు సిఫార్సు చేసింది. ఇందులో భాగంగానే ఫిబ్రవరి, మే నెలల్లో రెండు విడతల్లో పది పరీక్షలు నిర్వహించనున్నామని సీబీఎస్ఈ పరీక్షల విభాగాధిపతి సన్యం భరద్వాజ్ పేర్కొన్నారు. తొలి విడత పరీక్షా ఫలితాలు ఏప్రిల్‌లో, రెండో విడత జూన్‌లో వెల్లడిస్తామన్నారు. వీటివల్ల విద్యార్థులు మార్కులు మెరుగుపరచుకునే వీలు ఉంటుందన్నారు. అయితే, అంతర్గత మదింపు మాత్రం ఏడాదికి ఒకసారి ఉంటుందని చెప్పారు.



ఇదిలాఉంటే, పదోతరగతి పరీక్షలు రెండు దశల్లో నిర్వహణకు సంబంధించి నిబంధనల ముసాయిదాను సీబీఎస్ఈ( గతంలోనే వెలువరించింది. ఈ రెండు పరీక్షలూ పూర్తిస్థాయి సిలబస్‌తోనే నిర్వహిస్తామని అందులో స్పష్టం చేసింది. ఈ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి స్పందనలు స్వీకరించిన బోర్డు వాటి అమలుకు సిద్ధమైంది.

## 'కొందరికి మోదీనే తొలి ప్రాధాన్యం'.. థరూర్‌కు ఖర్గే చురకలు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ . మోదీ సర్కారుకు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పరోక్షంగా థరూర్‌కు చురకలు అంటించారు. ఓ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడుతూ..తమకు దేశమే తొలిప్రాధాన్యమని తర్వాతే పార్టీ అని అన్నారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో బాధితుల వైపు కాంగ్రెస్ నిలబడిందని పేర్కొన్నారు. కానీ కొందరు నేతలకు మాత్రం పార్టీ కంటే ప్రధాని నరేంద్ర మోదీనే ప్రాధాన్యమని మండిపడ్డారు.

శశి థరూర్‌కు ఆంగ్ల భాషపై మంచిపట్టు ఉందని ఖర్గే ప్రశంసించారు. తనకు ఇంగ్లిష్ సరిగ్గా చదవడం రానందున.. థరూర్ భాష బాగుండడం వల్లే ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిని చేశామన్నారు. కొందరు నేతలు పార్టీ పద్ధతులను మరిచి..చేసే పనులు, వ్యాఖ్యలను మనం ఏమి చేయగలమని ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలపై థరూర్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "ఆకాశం ఎవరికీ చెందదు.. రెక్కలు మీవి.. ఎగరడానికి ఎవరినీ అనుమతి అడగొద్దు" అని రాసుకొచ్చారు.

ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీని ప్రశంసిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఓ ఆంగ్ల పత్రికలో వ్యాసం రాశారు. శశిథరూర్ రాసిన వ్యాసాన్ని ప్రధాని కార్యాలయం సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అందులో ప్రపంచవ్యాప్తంగా దేశం ఒంటరిగా ఉందంటూ మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ (%జశీఅస్త్రతీవంం%) చేస్తున్న విమర్శలకు విరుద్ధంగా ఆయన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరిగిన దౌత్యపరమైన కృషి జాతీయ సంకల్పం, ప్రభావవంతమైన వ్యక్తీకరణకు రుజువుగా ఆయన పేర్కొన్నారు. ఇది మన విదేశాంగ విధానానికి కీలక ఘట్టాన్ని అందించిందని వ్యాఖ్యానించారు.

## శుభాంశు రోదసియాత్రపై మోదీ స్పందన ఇదే..

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ( అంతరిక్ష యాత్రకు పయనమయ్యారు. ఆయన



ఈ గ్రూప్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. దీనిపై తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ( ప్రధాని నరేంద్ర మోదీలు స్పందించారు.

'భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో కొత్త మైలురాయిని సృష్టించారు. మీ ప్రయాణంపై దేశం మొత్తం సంతోషంగా, గర్వంగా ఉంది. మీరు, యాక్సియం-4 మిషన్‌లోని ఇతర దేశాల వ్యోమగాములు ప్రపంచమంతా ఒకే కుటుంబమని నిరూపించారు. నాసా, ఇస్రో మధ్య శాశ్వత భాగస్వామ్యాన్ని ప్రతిబింబించే ఈ మిషన్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా. అక్కడ వ్యోమగాములు చేసే విస్తృత ప్రయోగాలు శాస్త్రీయ అధ్యయనాలు, అంతరిక్ష యాత్రలకు ముందడుగుగా మారనున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ఇక, భారత్, హంగేరీ, పోలాండ్, యూఎస్ వ్యోమగాములతో కూడిన అంతరిక్ష మిషన్ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. ఈసందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్రలో నిలిచారన్నారు. కోట్లమంది భారతీయుల కలలు, కోరికలు, ఆకాంక్షలను ఆయన మోసుకెళ్లారని వెల్లడించారు.

ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ ప్రయోగం విజయవంతంగా అంతరిక్షంలోకి వెళ్లింది. కొన్ని నిమిషాల తర్వాత వీరు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విడిపోయి భూకక్ష్యలోకి ప్రవేశించింది. 28 గంటల ప్రయాణం తర్వాత.. గురువారం సాయంత్రం 4.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) వీరి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు బృందం 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడినుంచి ముచ్చటిస్తారు.



## సీఎం రేవంత్ రెడ్డికి టోనీ బ్లెయిర్ లేఖ.. తెలంగాణ రైజింగ్

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ రాశారు. తెలంగాణ రైజింగ్-2047ను ప్రశంసించారు. ఇటీవల దిల్లీ పర్యటన సందర్భంగా టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047గురించి ఆయనకు వివరించిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఐటీ, ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో లక్ష్యాల గురించి ఆయనతో చర్చించారు. ఈ నేపథ్యంలో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్, తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం కుదరగా.. రైజింగ్ విజన్ రూపకల్పన, అమలుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఇరువైపుల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ 2047 తనను ఆకట్టుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించిన టోనీ బ్లెయిర్.. ఈ విజన్‌కు సహకరిస్తామని తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కవిత పేరు

హైదరాబాద్, జూన్ 25

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తెలంగాణలో ఏడాదిగా ప్రకంపనలు రేపుతోన్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో లేటెస్ట్‌గా సిట్ విచారణ స్పీడప్ అయింది. ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత పేరు కూడా తెరమీదకు వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరుపుతున్న సిట్ ముందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ కవిత పేరును ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కవిత ఫోన్ మీద కూడా నిఘా పెట్టిందని ఆయన చెప్పారు. దీంతో ఇన్నాళ్లు వినిపించని కవిత పేరు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి వచ్చింది. కవిత మాత్రం తన ఫోన్ ట్యాపింగ్ అయిందన్న ప్రచారంపై నోరు మెదపడం లేదు. ఇటువంటి సమయంలో సిట్ గనుక కవితను సాక్షిగా పిలిస్తే ఆమె వెళ్తారా? వెళ్తే ఏం చెబుతారన్నది రాజకీయవర్గాల్లో ఆసక్తిరేపుతోంది.కొన్నాళ్లుగా బీఆర్ఎస్ పార్టీతో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు ఎమ్మెల్సీ కవిత. ఆమె రాసిన లేఖ బయటికి రావడం..ఆ తర్వాత చిట్‌చాట్లు, ప్రెస్‌మీట్లు అంటూ కవిత చేసిన వ్యాఖ్యలతో గులాబీ బాస్ ఆగ్రహంగా ఉన్నారన్న టాక్ ఉంది. అందుకు తగ్గట్లే కాళేశ్వరం విచారణ రోజు ఫాంహౌస్‌కు వెళ్లిన కవితతో మాట్లాడేందుకు కూడా కేసీఆర్ ఇష్టపడలేదంటున్నారు. ఈ నేపథ్యంలో కవిత బీఆర్ఎస్‌లో ఉన్నారా? లేరా? అన్నట్లుగా ఉంది ఆమె ప్రజెంట్ సిచ్యువేషన్.సరిగ్గా ఇదే టైమ్‌లో బీఆర్ఎస్ హయాంలో కవిత ఫోన్ కూడా ట్యాప్ అయిందని గోనె ప్రకాశ్ బాంబ్ పేల్చారు. అయితే ఫోన్ ట్యాపింగ్ అంశంపై ముందు నుంచి సైలెంట్‌గా ఉంటూ వస్తున్నారు కవిత. మీ ఫోన్ కూడా ట్యాప్ అయ్యింది కదా అని మీడియా అడిగినా సమాధానం చెప్పేందుకు కవిత ఇష్టపడలేదు. తన ఫోన్ ట్యాప్ అయ్యిందని గాని..లేదని గాని చెప్పలేదు కవిత. కనీసం తన ఫోన్ ట్యాపింగ్ వార్తను కూడా ఖండించలేదు.అయితే బీఆర్ఎస్ పవర్‌లో ఉన్నప్పటి నుంచే కవిత రాజకీయంగా సొంతంగా ఎదిగే ప్రయత్నం చేశారని, ఆ క్రమంలోనే ఆమె ఫోన్ ట్యాప్ చేశారన్న ప్రచారం జరుగుతోంది.




ఇందులో వాస్తవాలేంటో తెలియదు గాని..అదే నిజమైతే మాత్రం కవిత ఫోన్‌ను ట్యాప్ చేయాలని ఆదేశించింది ఎవరన్న దానిపైనే రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.మరోవైపు తన ఫోన్ ట్యాప్ అయిందన్న సమాచారం కవితకు కూడా తెలుసు కాబట్టే ఆమె ఖండించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఈ విషయంలో తాను ఏం మాట్లాడినా అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న తండ్రి కేసీఆర్‌కు ఇబ్బందిగా మారుతుందనే కవిత సైలెంట్ ఉంటున్నారట. దీంతో విచారణ జరుపుతున్న సిట్ అధికారులు బయటపెట్టే పేర్లలో కవిత ఉంటారా లేదా అన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది. కవిత ఫోన్ ట్యాప్ అయ్యిందన్న ప్రచారం నేపథ్యంలో సిట్ ఆమెను కూడా పిలిచి స్టేట్‌మెంట్ రికార్డు చేయొచ్చన్న టాక్ వినిపిస్తోంది. అదే గనుక జరిగితే కవిత సిట్ ముందుకు వస్తారా? రారా అన్నది ఆసక్తి రేపుతోంది.ఒకవేళ సిట్ ముందుకు కవిత వస్తే ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఏం చెబుతారన్నది ఉత్కంఠ రేపుతోంది. ఎందుకంటే కొన్నాళ్లుగా కవిత బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటున్నారు. మరీ ముఖ్యంగా సోదరుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. కవితను తండ్రి కేసీఆర్ కూడా దూరం పెట్టారన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి టైమ్‌లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ పిలిస్తే కవిత ఏం చెబుతారోనని అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు రాజకీయవర్గాల్లో ఆసక్తి నెలకొంది.

భారత శక్తి
VOICE OF INDIAN

## మళ్లీ తెరపైకి వంగ బాబా జోస్యం

రాజకీయాలు, యుద్ధాల మధ్య ప్రపంచం నలిగిపోతుంటే.. కొత్తగా మరో షాకింగ్ విషయం ప్రచారం అవుతోంది. రాబోయేది భయంకరమైన కాలమని ఓ పాపులర్ జోస్యం చెబుతోంది. ఇది అలాంటి ఇలాంటి జోస్యం కాదు. ప్రపంచానికి జోస్యం పవరేంటో చెప్పిన బాబా వంగా లాంటి జపాన్ బాబా వంగ ఊహించిన విషయం. ప్రపంచాన్ని రెండు మూడేళ్లు వణికించిన మహమ్మారి కరోనా మళ్లీ వస్తుందని షాకింగ్ ప్రిడిక్షన్ చెప్పారు ఈ జపాన్ బాబా వంగా! నిజానికి, 2025 సంవత్సరం యుగాంతానికి ఎంట్రీ పాయింట్ అవుతుందని బాబా వంగా చెప్పాగా.. ఇప్పుడు జపాన్‌కు చెందిన భవిష్యత్ దర్శిని, ర్యో టసుకి కూడా ఇలాంటి జోస్యమే చెప్పారు. మరి, ఇవన్నీ ఒట్టి మాటలేనని కొట్టి పారేయగలమా..? ప్రపంచానికి మరోసారి కరోనా కష్టాలు తప్పదా..? జపాన్ బాబా వంగగా ప్రఖ్యాతి చెందిన ర్యో టసుకీ. రాబోయేదంతా వినాశనమేనా..? మనుషులంతా నశించి పోతారా..? భూమి మనుగడ ఇక కష్టమైనా..? ఇప్పటి వరకూ ఊహిస్తున్న డూమ్స్ డేకు రోజులు దగ్గర పడ్డాయా..? ఈ సంవత్సరమే మనుషుల అంతానికి ఎండింగ్ పాయింటా..? ప్రపంచమంతా నమ్ముతున్న ఓ జోస్యం చెబుతున్న మాటలివి. రాబోయే విలయం గురించి ప్రపంచ ప్రఖ్యాత భవిష్యవాణి బాబా వంగా షాకింగ్ జోస్యం చెప్పగా.. ఇప్పుడు.. జపాన్ బాబా వంగగా ప్రఖ్యాతి చెందిన ర్యో టసుకీ జోస్యం కూడా ఇలాంటి భయంకరమైన విషయాన్నే వెల్లడించినట్లు తెలుస్తోంది. 2025 ఘోర కలిని చూపిస్తుందనే కంగారు. నిజానికి, బాబా వంగా చెప్పిన మాటలు తేలికగా కొట్టి పారేయలేం. ఎందుకంటే, 50 ఏళ్ల క్రితమే భవిష్యత్తును ఊహించిన బాబా వంగ చెప్పిన చాలా విషయాలు ఇప్పటికే నిజమై కనిపించాయి. అలాగే, ర్యో టసుకీ ఊహించిన అంశాలను కూడా చాలా మంది నమ్ముతారు. అందుకే, రాబోయే కరోనా దాడి గురించి ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు ప్రపంచాన్ని కలవరానికి గురిచేస్తున్నాయి. 2025 ఘోర కలిని చూపిస్తుందనే కంగారు పుడుతోంది. జపనీస్ మాంగా కళాకారిణిగా పేరున్న ర్యో టసుకీ. కాస్త వింతగా ఉన్నా.. ర్యో టసుకీ అంచనాలకు చాలా ఖ్యాతి ఉందనడంలో సందేహం లేదు. జపనీస్ మాంగా కళాకారిణిగా పేరున్న ర్యో టసుకీ.. అందుకే, మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. కరోనా వైరస్ త్వరలో తిరిగి రావచ్చని ఆమె హెచ్చరికలను లైట్‌గా తీసుకోని పరిస్థితి ఉంది. ర్యో టసుకీ.. 1999లో రాసిన తన కామిక్ పుస్తకంలో.. 2020లో వచ్చిన కరోనా వ్యాప్తిని ముందే ఊహించినట్లు ఉంది. కాగా? ఇది జరిగిన దాదాపు ఒక దశాబ్దం తర్వాత అంటే.. ఇంచుమించుగా.. 2030లో కోవిడ్ వైరస్ మరోసారి ఆవిర్భావం చెందుతుందని ఆమె వెల్లడించినట్లు తెతుస్లోంది. "ది ఫ్యూచర్ యాజ్ ఐ సీ ఇట్" అనే తన కామిక్‌లో.. జపాన్ బాబా వంగా రాసింది గమనిస్తే.. "2020 చుట్టూ తెలియని వైరస్ కనిపిస్తుంది. "ది ఫ్యూచర్ యాజ్ ఐ సీ ఇట్" అనే కామిక్‌లో వెల్లడి. తర్వాత, ఏప్రిల్‌లో అది దాని గరిష్ట స్థాయికి చేరుకుంటుంది." అని రాశారు. అయితే, ఆ ఏప్రిల్‌కు సంబంధించిన ఖచ్చితమైన సంవత్సరాన్ని ఆమె పేర్కొనకపోయినా.. ప్రారంభంలో చెప్పిన 2020 అంచనా కళ్లముందే కనిపించింది. 2019 చివరిలో ప్రారంభమైన కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని ఎలా వణికించిందో అందరికీ అర్థం అయ్యింది. అలాగే, 2021లో దాని మరో విజృంభణ ఎంత ప్రాణాంతక పరిస్థితిని పరిచయం చేసిందో తెలిసింది. అందుకే, జపాన్ బాబా వంగ మాటల్లో.. ఏప్రిల్ నెల, దశాబ్దం తర్వాత అనే పదాలపై ఇప్పుడు భయం నెలకొంది. 2030లో వైరస్ తిరిగి రావచ్చన్న రియల్ బాబా వంగా. నిజానికి, 2030లో వైరస్ తిరిగి రావచ్చని రియల్ బాబా వంగా చెప్పారు. ఆమె రచనల ప్రకారం, "వైరస్ ఒకటి అదృశ్యమవుతుంది కానీ దాదాపు 10 సంవత్సరాల తర్వాత తిరిగి కనిపిస్తుంది" అని సూచించారు. ఇప్పుడు, వీళ్లద్దరి కాలక్రమం నిజమైతే.. అది 2030 సంవత్సరం నాటికి తిరిగి రావచ్చనే అంచనా ఉంది. అయితే, రెండు దశాబ్దాల క్రితం మొదటిసారిగా ప్రచురించబడిన ర్యో టసుకీ కామిక్ పుస్తకంపై.. ఇప్పుడు, ప్రజారోగ్య నిపుణులు చర్చిస్తున్నారు. ఎందుకంటే.. ప్రపంచ నిపుణులు కూడా దాదాపుగా ఇదే అంశాన్ని వెల్లడించిన సందర్భాలు లేకపోలేదు.జపాన్ బాబా వంగా ప్రిడిక్షన్ ఆసక్తిని రేపుతోంది. 15 సంవత్సరాల ప్రవచన చక్రం ప్రకారం.. ర్యో టసుకీ అంచనాల ప్రకారం.. 15 సంవత్సరాల ప్రవచన చక్రం ఉంది. అంటే 2030లో మహమ్మారి తిరిగి రాకపోతే? అది 2045 లో కూడా కార్యరూపం దాల్చవచ్చు. అయితే, దీన్ని ఎవరు నమ్మినా నమ్మకపోయినా.. ఆమె, జూలై 2025లో సునామీతో సహా ఇతర భయంకరమైన పరిణామాలు చూడాల్సి వస్తుందని అంచనా వేసింది. అయితే, గతంలో ఆమె దర్శనాల ఖచ్చితత్వాన్ని నమ్మిన చాలా మంది దీన్ని నమ్ముతున్నారు. ఈ జపనీస్ బాబా వంగా.. గతంలో ప్రిన్సెస్ డయానా మృతి, పాపులర్ సింగర్ ఫ్రెడ్డీ మెర్క్యురీ మరణాలతో సహా అనేక అంచనాలు నిజమయ్యాయి. అయితే, ఇవన్నీ ఆమె తన కలలలో దర్శనాల ద్వారా చెప్పగలుగుతున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కలలను ఆమె వ్రాతపూర్వకంగా కానీ, లేదంటే చిత్రాలు రూపంలో గాని వెల్లడిస్తుంది. ఈ జోస్యంలో నిజానిజాలు ఎంత..? ఇటీవల, మూడో ప్రపంచ యుద్ధం గురించి అంతర్జాతీయంగా ఆందోళనలు వచ్చిన సందర్భంలో.. 2025లో యూరప్ యుద్ధం వస్తుందని బాబా వంగా జోస్యం చెప్పారు. ఇది నిజమైతే పరిస్థితి ఏంటా అనే ఆందోళనను పెంచింది. ఇప్పుడు, జపాన్ బాబా వంగా చెప్పిన మాట కూడా ఇలాంటి చర్చనే లేవదీసింది. ఈ జోస్యంలో నిజానిజాలు ఎంతనే దాని కంటే.. ఆమె రాసిన మంగా పుస్తకంలో వాస్తవాలు స్పష్టంగా ఉన్నాయా లేదా అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

# కూటమి కాన్ఫిడెన్స్ లెక్కంటో...

విజయవాడ, జూన్ 25,

ఏపీ పాలిటిక్స్‌లో మళ్లీ జగన్ వర్సెస్ పవన్ ఎపిసోడ్ ఇంట్రెస్టింగ్‌గా మారుతోంది. ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు ఆ ఇద్దరి మధ్య నెక్స్ట్ లెవల్‌లో మాటల యుద్ధం కొనసాగింది. ఇక ఏడాదిగా చూస్తే జగన్, పవన్ మధ్య అప్పుడప్పుడు డైలాగ్ వార్ నడుస్తున్నా ఇష్యూ బేస్డ్‌గా మాట్లాడి అక్కడితో వదిలేస్తున్నారు. ఇప్పుడు మరోసారి జగన్, వైసీపీపై పవన్ కౌంటర్లు వేస్తుండటంతో రాజకీయం వేడి రాజుకుంటోంది.జగన్ రెంటపాళ్ల పర్యటనలో ప్లకార్డులు, ఆ తర్వాత ఆయన కామెంట్స్‌తో పొలిటికల్ హీట్ పెరిగింది. వైసీపీ, జగన్ టార్గెట్‌గా పవన్ స్ట్రాంగ్ వార్నింగే ఇచ్చారు. తొక్కి నార తీస్తామని, మక్కెలు విరగగొట్టి కూర్చోబెడతామంటున్నారు పవన్. అసాంఘిక శక్తులను ఏరివేస్తామన్నారు. రోడ్లెక్కి పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే అసలు ఊరుకోమంటున్నారు. గొంతు కోస్తామని అంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సరదాగా ఇక్కడ ఎవరూ కూర్చోలేదంటున్న పవన్..అధికారంలో ఉన్నపుడు అరాచకాలు సృష్టించారని ఇపుడు కూడా అలాగే చేద్దామనుకుంటే లైట్ తీసుకునే ముచ్చటే లేదంటున్నారు.అంతే కాదు కూటమి ఐక్యతకు తాను ప్రాధాన్యత ఇస్తానని 20 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగుతుందని క్లారిటీగా చెబుతున్నారు పవన్. మళ్లీ జగన్ ప్రభుత్వం రానే రాదు..తాను మాట ఇస్తున్నానంటున్నారు పవన్. కనీసం పదిహేనేళ్లు కూటమి పవర్‌లో ఉంటుందని భరోసా ఇస్తున్నారు.అటు సీఎం చంద్రబాబు మాట తీరులోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలకు వాస్తవాలు చెప్పాలనే ఆలోచన బాబు ప్రసంగాల్లో స్పష్టమవుతోంది. అన్నీ చేసేశామని చెప్పటం లేదు కానీ..ఊహించిన దానికంటే ఎక్కువగా..చెప్పనివి కూడా చేశామని మాత్రం చెప్పగలను అంటున్నారు చంద్రబాబు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎక్కడ ప్రయాణం మొదలైందో..ఏడాదిలో ఏం సాధించామో ప్రజలే విశ్లేషించుకోవాలని కోరుతున్నారు.అయితే అటు చంద్రబాబు, ఇటు పవన్ మాటల్లో అయితే వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. దీని వెనుక మర్మమేంటన్న దానిపై మాత్రం పెద్దఎత్తున డిస్కషన్ జరుగుతోంది. ఇప్పటికే సూపర్ సిక్స్ స్కీమ్‌లలో చాలావరకు అమలు చేశారు. ఇంకా ఒకటో, రెండో స్కీమ్‌లు పెండింగ్‌లో ఉంటే..వాటిని ఎప్పటి నుంచి ఇంప్లిమెంట్ చేస్తామో షెడ్యూల్ కూడా ప్రకటించేశారు.ఇక రోడ్లు బాగు చేశారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు ఫోకస్ పెడుతున్నారు. పైగా వైసీపీ వ్యవహరిస్తున్న తీరు తమకు ప్లస్ పాయింట్ గా మారుతుందని భావిస్తున్నారట కూటమి పెద్దలు. అపోజిషన్‌లో ఉన్నప్పటికీ అరాచకాలు, అడ్డగోలు మాటలు.. మాట్లాడుతున్నారని..వైసీపీని ప్రజలు ఓడించిందే అందుకని..రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని అంచనా వేస్తున్నారట కూటమి లీడర్లు.ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న స్కీమ్‌లు..ఇప్పటికీ ప్రజల్లో వైసీపీపై వ్యతిరేకత ఉందన్న నమ్మకం..కూటమి ఐక్యతే తమను తిరిగి మళ్లీ మళ్లీ నిలబెడుతుందని నమ్ముతున్నారట కూటమి అగ్రనేతలు. మొన్నటి ఎన్నికలకు ఇప్పటికి కూటమికి మైలేజ్ పెరిగిందని..చంద్రబాబు పాలనపై ప్రజలకు నమ్మకం ఉందని భరోసాగా ఉన్నారట. అందుకే వైసీపీ మళ్లీ రానే రాదన్న గట్టి నమ్మకంతో ఉన్నారట పవన్. పైగా మళ్లీ కూటమిగా వెళ్తామని చెప్పడం ద్వారా పబ్లిక్ మూడ్‌ను మరింతగా తమవైపునకు తిప్పుకునే స్కెచ్ వేస్తున్నారని అంటున్నారు.అయితే పవన్ మాటలను లైట్ తీసుకోలేమని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. సేమ్‌టైమ్ పవన్ అంత నమ్మకంతో చెప్తున్నారంటే కూటమి దగ్గర ఫ్యూచర్ ప్లాన్స్ ఉండే ఉంటాయంటున్నారు. ఎలక్షన్స్ ముందు ఫాలో అయ్యే స్ట్రాటజీ.. స్కీమ్‌ల ఇంప్లిమెంటేషన్ కూడా అంతా పక్కా స్కెచ్ ప్రకారమే చేసుకుంటూ వస్తున్నారని చెప్పుకొస్తున్నారు. పవన్ మాటలు నిజం అవుతాయా? జగన్ ఒంటరి పోరు ఆయన్ను తిరిగి నిలబెడుతుందా? అనేది చూడాలి.

# కాడెద్దులకు మారిన గిరిజనులు

విశాఖపట్టణం, జూన్ 25,

రైతులు పొలం పనులు చేయాలంటే దుక్కి దున్నాలి. దుక్కి దున్నాలంటే ఎద్దులతో పని. కానీ తమ ఎద్దులు, ఆవులను బెంగాల్ టైగర్ చంపడంతో, పరిహారం అందకపోవడంతో రైతు కుటుంబాలే కాడెద్దులుగా మారి దుక్కి దున్నుతూ నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ పరిధిలో ఈ సీన్ కనిపించింది. అన్నదాతల కష్టాలు చూసిన వారు ప్రభుత్వం వారికి అండగా నిలవాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.అల్లూరి జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ బూరిగ. చిన్నకోనిల గ్రామాల్లో గిరిజన ఆదివాసి రైతులు సోముల పైడమ్మ, సోముల చిన్న గంగమ్మ, కోటపర్తి గంగులు, కరాసి లచ్చుమ్మ, బూరిగ గౌరమ్మ లి/0 ధర్మయ్యలకు చెందిన 3 ఆవులు, 4 ఎద్దులు 2023 జనవరి మొదటి వారంలో అడవిలో మేతకు వెళ్లాయి. ఆ సమయంలో బెంగాల్ టైగర్ దాడి చేసి వారి ఆవులు, ఎద్దులను చంపింది. ఈ విషయంపై అనంతగిరి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాక్. ఔసీ. 492/2022/రాం. 8-2-2023 న పులి చంపేసిందని నిర్ధారించారు. పాడేరు డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ కు ఆవుల మృతిపై నివేదిక సైతం పంపించారు. ఫారెస్ట్ అధికారులు వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. నేటికీ మూడు సంవత్సరాలు గడుస్తున్నా చనిపోయిన తమ ఎద్దులకు, ఆవులకు సంబంధించి రావాల్సిన నష్ట పరిహారం రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే తమది వ్యవసాయ ఆధారిత కుటుంబం. ఎద్దులు, ఆవుల ద్వారానే దున్నుతూ పొలం సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎద్దులు కొనుక్కోవాలంటే సంతలకు వెళ్లి కనీసం జత ఎద్దులకు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంత డబ్బులు మా దగ్గర లేవు. దీంతో మా వ్యవసాయ పనులు సాగాలంటే తామే స్వయంగా నాగలి పట్టి కాడెద్దులుగా మారి పొలాన్ని దున్నుతూ నిరసన వ్యక్తం చేశారు. ఐటిడిఏ ఖనీ, అల్లూరి జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పులి చంపేసిన తమ దుక్క ఎద్దులు, ఆవులకు ఫారెస్ట్ అధికారుల ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. రొంపిల్లి బీట్ ఆఫీసర్ కు పలుమార్లు తమకు రావాల్సిన నష్ట పరిహారం కోసం అడిగారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు వస్తే ఇస్తామని వారు చెబుతున్నారు. మూడు ఏళ్లు గడిచినా తమకు నష్ట పరిహారం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో ఎద్దులు లేక, వ్యవసాయం చేయలేకపోతున్నాం.. పూట గడవటం కష్టంగా మారిందని వాపోయారు. తక్షణమే అల్లూరి జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. నెల రోజుల్లో తమకు రావాల్సిన నష్ట పరిహారం ఇవ్వకపోతే కనుక అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ఎదుట నాగళ్లతో తాము కాడెద్దులుగా దుక్కు దున్నుతూ ఆందోళనకు దిగుతామని చెప్పారు. బాధిత గిరిజన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు డిమాండ్ చేశారు.

# విశాఖలోనే భారీగా ఐటీ జాబ్స్..

విశాఖపట్టణం, జూన్ 25

విశాఖపట్టణం మధురవాడ పేరు వినిపిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. సాధారణంగా శాంతంగా ఉండే ఈ ప్రాంతం, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. అక్కడ ఎలాంటి మలుపు తిరిగిందంటే.. పెద్ద ఎత్తున ఉద్యోగాలు, అంతర్జాతీయ కంపెనీ, కోటి రూపాయల పెట్టుబడులు అన్నీ ఒకే వేదికపైకి వచ్చాయి. ఇక్కడి యువతకు ఇదొక భారీ గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు. విశాఖపట్నం జిల్లా మధురవాడ ప్రాంతంలోని సర్వే నంబర్లు 394, 395, 396, 397లలో ఉన్న మొత్తం 22.19 ఎకరాల భూమిని ఎకరానికి ఒక ప్రముఖ ప్రైవేట్ కంపెనీకి అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది మామూలు భూమి కేటాయింపు కాదు దీని వెనక ఉంది భారీ స్థాయిలో ఐటీ పెట్టుబడి, లక్షల రూపాయల రాబడి, వేల మందికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నది ప్రభుత్వ వాదన. ఈ భూమిని పొందబోతున్న సంస్థ పేరు కాగ్నిజెంట్ ఐటీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన కంపెనీ. విశాఖపట్నంలో వారు ఏర్పాటు చేయబోయే కేంద్రం ద్వారా రూ. 1582.98 కోట్లు విలువైన పెట్టుబడి రానుంది. ఇది ఎక్కడినుంచైనా ఒక మేజర్ ఇన్వెస్ట్‌మెంట్ అనే చెప్పాలి. ఈ ప్రాజెక్టు ద్వారా 8000 మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంది. ఉద్యోగాలంటే కేవలం కంప్యూటర్ బేసిక్ జాబ్స్ అనుకోవద్దు.. ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా అనలిస్టులు, టెక్నికల్ సపోర్ట్, మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో అవకాశాలు వస్తాయన్న మాట. అంటే విశాఖ, ఆంధ్రప్రదేశ్ యువతకు ఇది నేరుగా ఉపాధి అవకాశాలను దరికి చేర్చనుంది. ఈ ప్రాజెక్టును 2024-25 కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ పాలసీ ద్వారా పెట్టుబడిదారులకు భూమి, మౌలిక సదుపాయాలు, పన్ను సడలింపులు, విద్యుత్, నీటి సరఫరా వంటి అవసరాల్లో ప్రభుత్వ సహకారం లభిస్తుంది. అంటే ఇందులో ప్రభుత్వ రోల్ కేవలం భూమి ఇవ్వడమే కాదు, పూర్తి ప్రోత్సాహాన్ని అందించడమనే చెప్పాలి. ఈ ప్రతిపాదనకు తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అర్థం ఏంటంటే.. ఇక ఈ ప్రాజెక్ట్ ప్రభుత్వ అధికారిక మద్దతుతో ప్రారంభం కాబోతోంది. ఇది విశాఖపట్నానికి, ముఖ్యంగా మధురవాడకు ఐటీ కేంద్రంగా రూపం తీసుకునే అవకాశం. ఇదే కాకుండా, కంపెనీ ఏర్పాటు చేసిన తర్వాత చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు జోరుగా పెరుగుతాయి. ప్రైవేట్ స్కూల్స్, ట్రైనింగ్ సెంటర్లు, హోటల్స్, ట్రాన్స్‌పోర్ట్, చిన్న వ్యాపారాలు ఇవన్నీ బాగా అభివృద్ధి చెందుతాయి. అంటే ఇది కేవలం ఉద్యోగాలకే కాదు, ప్రాంత అభివృద్ధికీ బీజం వేస్తుందన్నమాట. ఈ ప్రకటనపై ఇప్పటికే విశాఖపట్నంలో యువతలో ఉత్సాహం కనిపిస్తోంది. మనం బెంగుళూరు వెళ్ళకుండా ఇక్కడే జాబ్ దొరకాలంటే ఇదే ఆరంభం అనే భావన కూడా కలుగుతోందని టాక్. ఐటీ స్టూడెంట్స్, ట్రైనింగ్ సెంటర్లు, ఇంజనీరింగ్ కాలేజీలు.. అందరూ ఈ అవకాశాన్ని ఎలా వాడుకోవాలా అనే దిశగా ఆలోచిస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం కూడా ఇటువంటి పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్రంలో యువతను ఉద్యోగ రాహిత్యం నుండి బయటపడేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఎ, ఎమా రంగాల్లో వందలాది కంపెనీలను ఆకర్షించేందుకు పలు మార్గసూచనలు, నూతన పాలసీలను తీసుకువస్తోంది. ఈ ప్రాజెక్ట్ వాటికి ఒక మైలురాయి అవుతుంది. మధురవాడలో మొదలైన ఈ ప్రయోగం కేవలం భూమి కేటాయింపు కాదని, అది రాష్ట్ర భవిష్యత్తు కోసం వేసిన బలమైన బాట అని చెప్పొచ్చు. వేల మందికి ఉద్యోగం, కోట్లాది పెట్టుబడి, ఐటీ రంగానికి కొత్త కేంద్రం అన్నీ కలిపి ఇది ఒక గేమ్ చేంజర్. ఇక మిగతా జిల్లాలు కూడా ఇదే దిశగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వ ఆలోచనగా విశ్లేషకులు భావిస్తున్నారు

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమలతిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి కలిసి దర్శనం చేసుకున్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి వేరువేరుగా స్వామి వారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపం లో అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## బావిని తవ్వి బాలుడి మృతదేహం వెలికితీత

రంగారెడ్డి మైలార్ దేవ్ పల్లి లక్ష్మి గూడా లో విషాద ఛాయలు నెలకొన్నాయి. బావిలో పడ్డ ఐదు ఎండ్ల బాలుడి మృతదేహాన్ని సహాయక బృందాలు బయటకు తీసాయి. 12 గంటలుగా సహాయక బృందాలు శ్రమించాయి.

తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు కుటుంబ సభ్యులు విషాదం లో మునిగిపోయారు. మంగళవారం మధ్యాహ్నం ఐదేళ్ల ప్రిన్స్ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. బావిలో ఉన్న నీటిని తోడి, బుల్డోజర్స్ తో బావిని తొవ్వి మృతదేహాన్ని అధికారులు బయటకు తీసారు. తమ గారాల పట్టి ఇక లేడనే అనే విషయాన్ని తల్లితండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారు.

--------------------

# లోకేష్ పై ప్రధాని పొగడ్తలు.. టీడీపీలో భయం

విజయవాడ, జూన్ 25, (

ఏపీలోతెలుగుదేశం పార్టీ కంటే సీనియర్ భారతీయ జనతా పార్టీ. తెలుగుదేశం పార్టీ ఎంట్రీ సమయంలోనే విశాఖ నగరపాలక సంస్థను బిజెపి గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీని ఢీ కొట్టాలంటే బిజెపి అవసరమని గుర్తించారు నందమూరి తారక రామారావు. అప్పటినుంచి ఇప్పటివరకు బిజెపితో అప్పుడప్పుడు తప్ప మైత్రి కొనసాగుతూనే ఉంది. అయితే ఏపీలో టిడిపి బలమైన శక్తిగా ఎదిగింది. కానీ బిజెపి పరిస్థితి మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. దీనికి కారణం చంద్రబాబు చతురత. చంద్రబాబు ఉన్నంతవరకు బిజెపి ఎంట్రీ అంత ఆషామాషీ కాదు. అదే బిజెపి పూర్తిస్థాయిలో ఎంట్రీ ఇస్తే టిడిపి మనుగడ కష్టం. అందుకే చంద్రబాబు చేతికి టీడీపీ పగ్గాలు వచ్చిన తర్వాత ఆయన ఒక వ్యూహాత్మకంగా వ్యవహరించారు. బిజెపిని నిలువరించారు. అయితే ఇప్పటికిప్పుడు కాకపోయినా.. ఏపీలో మాత్రం బిజెపి బలపడేందుకు తప్పకుండా ప్రయత్నం చేస్తుంది. అది కూడా లోకేష్ ద్వారా వర్కౌట్ చేయాలన్నది ప్లాన్ గా తెలుస్తోంది.గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధాని మోదీ నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రత్యేకంగా సమావేశాల్లో లోకేష్ ప్రస్తావన తీసుకొస్తున్నారు. పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. ఢిల్లీకి ప్రత్యేకంగా ఆహ్వానించి చర్చలు జరుపుతున్నారు. మొన్నటికి మొన్న యోగాంధ్రా వేడుకల్లో లోకేష్ ను ఆశీర్వదించారు. అయితే గతంలో చాలా రాజకీయ పార్టీలు, నేతల విషయంలో ప్రధాని మోదీ ఇలానే వ్యవహరించారు. చాలా చనువు తీసుకున్నారు. అటు తరువాత వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. బిజెపి నుంచి వారికి రాజకీయ ఇబ్బందులు ఎదురయ్యాయి. మహారాష్ట్రలో శివసేన ఠాక్రె ఫ్యామిలీకి, ఉత్తరప్రదేశ్లో బీఎస్పీ మాయావతి, కర్ణాటకలో జేడిఎస్ దేవే గౌడ, తమిళనాడులో అన్న డిఎంకె, ఒడిస్సాలో నవీన్ పట్నాయక్, బీహార్లో నితీష్ కుమార్ వంటి వారిని ఇలానే దగ్గర తీసుకొని దెబ్బేశారు. ఇప్పుడు కూడా లోకేష్ విషయంలో అటువంటి పరిస్థితి ఉంటుందన్న టాక్ ప్రారంభం అయింది.చంద్రబాబు ఉన్నంతవరకు నో డౌట్. ఆయన విషయంలో బిజెపి క్రాష్ చేసే అవకాశం లేదు. ఆ చాన్స్ కూడా ఆయన ఇవ్వరు. ఎందుకంటే చంద్రబాబు గురించి బిజెపికి తెలుసు. అందుకే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా లోకేష్ తో సఖ్యతగా ఉన్నారు బిజెపి పెద్దలు. ఒకవేళ భవిష్యత్తులో బిజెపి గ్రాఫ్ తగ్గినా లోకేష్ సేవలను



వినియోగించుకోవాలని చూస్తున్నారు. ఒకవేళ గ్రాఫ్ పెరిగినా ఏపీలో అదే లోకేష్ ద్వారా.. అధికార పంపకాలు చేయాలని చూస్తున్నారు. భవిష్యత్తులో లోకేష్ ని సీఎంగా చేయడానికి బిజెపి నుంచి అభ్యంతరం రాదు. కానీ అటు తరువాత మాత్రం పెద్ద ఎత్తున ఆ పార్టీ పావులు కదుపుతుంది. మహారాష్ట్ర ఎపిసోడ్లో అదే జరిగింది. త్వరలో లోకేష్ కు టిడిపి పగ్గాలు అప్పగించాలని చంద్రబాబు భావిస్తున్నారు. టిడిపి మొత్తం లోకేష్ కంట్రోల్లోకి వెళ్తుంది. అందుకే కమలనాథులు ముందుగానే జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. మరి వారి ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# అఖండ గోదావరికి శ్రీకారం

రాజమండ్రి, జూన్ 26,

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు జూన్ 26న ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఉదయం 10 గం.లకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరీ చేతుల మీదుగా శంకుస్థాపన జరుగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

అఖండ గోదావరి ప్రాజెక్ట్ - ముఖ్యమైన వివరాలు

శంకుస్థాపన కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పనులన్నీ పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తారు.

ఏటా దాదాపు 15 -20 లక్షల మంది పర్యాటకులు వచ్చే అవకాశముందని ఏపీ సర్కార్ అంచనా వేస్తోంది.

కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కి -2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్) స్కీమ్ ద్వారా దాదాపు రూ.94.44 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్టుతో గోదావరి పరివాహక ప్రాంతాలకు కొత్త సొబగులు రానున్నాయి.

ఈ నిధులతో చారిత్రక నగరంగా పేరొందిన రాజమహేంద్రవరంలో 127 ఏళ్ల చరిత్ర గలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన ప్రతిష్టాత్మక హేవలాక్ వంతెన పునర్నిర్మిస్తారు. చారిత్రక, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు వేదికగా చేయాలని నిర్ణయించారు.

ఇందులో భాగంగా 2.7 కి.మీ ల పొడవైన వంతెనపై 54 స్పాన్‌లు ఉన్నాయి. వీటిలో 25 స్పాన్‌లను అభివృద్ధి చేయాలని ఏపీ సర్కార్ నిర్ణయించినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

హేవలాక్ వంతెన ప్రాంతంలో ఒక్కో స్పాన్ క్రింద ఒక్కో థీమ్ ను ఏర్పాటు చేయనున్నామన్నారు. అందులో రాజమహేంద్రవరం చరిత్ర, ఏపీ చరిత్రను తెలిపే స్పాన్ ఉంటుందన్నారు.

జలపాతాలు, గ్లాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్ హాట్ క్రాఫ్ట్ బజార్, హ్యాంగింగ్ గార్డెన్స్, హోలోగ్రామ్ జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, ఆక్వేరియం టన్నెల్ లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తారు.

ఈ థీమాటిక్ జోన్‌లకు అనుకుని సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను అందించేలా 10 బఫర్ స్పేస్‌లు ఏర్పాటు చేయనున్నారు.

18వ స్పాన్ అనంతరం 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బ్రిడ్జిలంకలో టెంట్ సిటీ ఏర్పాటు చేస్తారు.

గోదావరి నది వెంట ఘాట్ లకు వెళ్లేలా బ్రిడ్జి లంక వద్ద బోటింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి దుర్గేశ్ తెలిపారు. గేమింగ్ జోన్ ఏర్పాటు చేసి పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కల్పిస్తామన్నారు.

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా హేవలాక్ వంతెన పక్కనే ఉన్న పుష్కర్ ఘాట్ల అభివృద్ధికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. తొలుత పుష్కర్ ఘాట్ సుందరీకరణ పనులు ప్రారంభించనున్నారు. అధ్యాత్మిక గమ్యస్థానంగా పుష్కర్ ఘాట్ ను తీర్చిదిద్దుతారు.

హేవలాక్ వంతెన, పుష్కర్ ఘాట్ రెండింటిని అనుసంధానించి డైనమిక్ టూరిస్ట్ డెస్టినేషన్ గా తీర్చిదిద్దాలని ఏపీ సర్కార్



భావిస్తోంది.

ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోన్న కడియం నర్సరీలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చి ఎక్స్ పీరియన్స్ సెంటర్ గా వృద్ధి చేస్తామని మంత్రి దుర్గేశ్ తెలిపారు. కడియపులంక, పొట్టిలంక మరియు చుట్టుపక్కల నర్సరీల చుట్టూ పర్యావరణ అనుకూల పర్యాటక సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

శ్రీ కోట సత్తమ్మ దేవాలయాన్ని అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా అదనపు యాత్రికుల వసతి గృహాలు ఏర్పాటు చేయనున్నారు. ఆలయ రాజగోపురం ఆధునికీకరించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.

రాజమహేంద్రవరానికి జీవనాడి అయిన గోదావరి కాలువను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నామన్నారు. గోదావరి హారతి ఘాట్ ను ఏర్పాటు చేయనున్నామన్నారు.

శాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్) స్కీమ్ ద్వారా రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి, రూ.75.91 కోట్లతో గండికోట ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు

## 42 శాతం బీసీ రిజర్వేన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థ ఎన్నికలు

సికింద్రాబాద్

బిసి రిజర్వేషన్ కు 42 శాతం చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. సనత్ నగర్ నియోజక వర్గం బండి మెట్ ప్రాంతంలో నేడు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులతోంకలసి బస్తీ పర్యటన చేశారు. స్థానిక సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి చేతులు దులుపుకోవడం కాదు, కులగణన తరువాత బీసీ రిజర్వేషన్ అమలు అవుతుందనే నమ్మకంతో ప్రజలు ఉన్నారని తెలిపారు. పార్టీల పరంగా రిజర్వేషన్ ఇస్తామంటే ఊరుకోడానికి మేము అడుక్కు తినే వారిమి కాదని ఘాటుగా విమర్శించారు. పార్లమెంట్ లో ప్రవేశ పెట్టి అన్ని విధాలుగా చట్ట బద్దత కల్పించిన తరువాతనే ఎన్నికలకు పోయి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

## క్వాంటం టెక్నాలజీపై ప్రో. అనిల్ ప్రభాకర్ ప్రజెంటేషన్

విజయవాడ

విజయవాడ- అమరావతి క్వాంటం వ్యాలీ , క్వాంటం టెక్నాలజీ పై ప్రొఫెసర్ అనిల్ ప్రభాకర్ , నేషనల్ క్వాంటం మిషన్ సభ్యుడు, టీసీఎస్ సలహాదారు ప్రజెంటేషన్ ఇచ్చారు.

అయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్లు పరిశోధన సాగిస్తున్నాయి. ఐబీఎం, గూగుల్ లాంటి సంస్థలు క్వాంటం కంప్యూటర్లను రూపొందించి, పరిశోధన సాగిస్తున్నాయి. ఔషధాల పరిశోధన, ఈవీ బ్యాటరీలు , బిన్ ప్యాకింగ్ , కార్గో డెలివరీ, రూట్ ఆప్టిమైజేషన్ , ఇమేజ్ క్లాసిఫికేషన్ లాంటి అంశాల్లో క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీ వినియోగం చేయొచ్చని అన్నారు.

స్టాక్ మార్కెట్ , సైబర్ సెక్యూరిటీ రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీ విస్తృత సేవలు అందిస్తోంది. 1000 క్యూబిట్ కంప్యూటర్ ఇప్పుడు నిన్నటి తరంగా మారిపోయింది. కంప్యూటింగ్ నెట్వర్క్ భద్రత, పాస్ వర్డ్ ల సెక్యూరిటీ కోసం కేంద్రం ఖ్విలా ప్రాజెక్టు అమలు చేస్తోంది. నేషనల్ క్వాంటం మిషన్ లో భాగంగా అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటు అవుతోంది. ఇది విద్య సంస్థలతో పాటు పరిశ్రమలకు ప్రయోజనకారిగా మారుతుంది. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీ సెంటర్ దేశానికి ఓ దిక్సూచిగా మారుతుందని అన్నారు.

## ఎంపి చిన్నిని కలిసిన బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్

విజయవాడ

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ను ఆంధ్రప్రదేశ్ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గా వ్యవహరిస్తున్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ మర్యాద పూర్వకంగా కలిసారు. గారెత్ విన్ ఓవెన్ ను శాలువాతో సత్కరించి కొండపల్లి బొమ్మను ఎంపీ కేశినేని శివనాథ్ బహుకరించారు. ×సైన్స్ అండ్ టెక్నాలజీ , హెల్త్ ఇన్స్యూరెన్స్ , అర్బన్ డెవలప్మెంట్, ఎడ్యుకేషన్ వంటి అంశాలు, ×సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల అంశంపై కూడా చర్చించుకున్నారు.

## ఆవు మెదడును ప్రత్యక్షంగా చూపించిన టీచర్

### హిందూ సంఘాల మండిపాటు

వికారాబాద్

వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రం జెడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఘోరం జరిగింది. టెన్త్ క్లాస్ తరగతి గదిలో ఆవు మెదడు (బ్రెయిన్)ను విద్యార్థులకు సైన్స్ టీచర్ ప్రత్యక్షంగా చూయించడం వివాదం అయింది. తల్లిదండ్రులు, హిందూ వాదులు సైన్స్ టీచర్ వ్యవహారంపై మండిపడ్డారు. సైన్స్ టీచర్ను సస్పెండ్ చేయాలని స్కూల్ ముందు బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ధర్నా, ఆందోళన నిర్వహించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్న పరిస్థితిని సరిదిద్దారు.

## కేజీవి లో డార్మెటరీ గదులకు శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్

మంచిర్యాల

బుధవారం నాడు మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం× లో ×రూ. 82 లక్షల నిధులతో నిర్మించనున్న అదనపు డార్మెటరీ గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన× కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి ×డా. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.శిక్షా రంగ అభివృద్ధిలో బాలికలకు మరింత అనుకూల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమాజంలో బాలికల విద్యాభివృద్ధి ద్వారానే సమానత్వం సాధ్యమవుతుందన్న దృక్పథంతో ఈ ప్రాజెక్టును తీసుకొచ్చామని మంత్రి పేర్కొన్నారు.

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

======================

# రెండు కుటుంబాల కలయిక...

ఒంగోలు, జూన్ 25

రాజకీయాల కోసం కుటుంబాలు అడ్డగోలుగా చీలిపోతుంటాయి. ఇది గతంలో చాలా సార్లు చూశాం కూడా. తాజాగా ఏపీలో సోదరుడు జగన్మోహన్ రెడ్డితో రాజకీయంగా విభేదిస్తున్నారు షర్మిల. తెలంగాణలో సైతం కేసీఆర్ కుమార్తె కవిత తన సోదరుడు కేటీఆర్ ను విభేదించినట్టు కనిపించారు. అయితే రాజకీయాలు అన్నాక కుటుంబాలు విభేదాలు రావడం సర్వసాధారణం. ఈ విషయంలో నందమూరి తారక రామారావు కుటుంబం చక్కటి ఉదాహరణ. ఎన్టీఆర్ అల్లుళ్ళు రాజకీయంగా చాలా విభేదించుకున్నారు. కానీ ఇప్పుడు అంతా కలిసి పోయారు. మొన్నటికి మొన్న తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు పుస్తకావిష్కరణకు హాజరయ్యారు చంద్రబాబు. తమ మధ్య ఉన్న విభేదాలు గతం గతః అన్నట్టు విడిచి పెట్టేశారు. ఇప్పుడు తాజాగా నారా లోకేష్ సైతం దగ్గుబాటి కుటుంబంతో చట్టపట్టాలేసుకొని తిరుగుతుండడం విశేషం. తాజాగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుమారుడు ఏర్పాటుచేసిన నూతన పాఠశాలను తన పెద్దమ్మ పురందేశ్వరి తో కలిసి ప్రారంభించారు నారా లోకేష్.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో పనిచేశారు దగ్గుబాటి వెంకటేశ్వరరావు. ఆ విషయంలో చంద్రబాబు కంటే ఆయనే సీనియర్. 1983 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు చంద్రబాబు. అప్పటివరకు ఉన్న కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టి టిడిపిలోకి వచ్చారు. అంతకు ముందు నుంచే దగ్గుబాటి వెంకటేశ్వరరావు పనిచేస్తూ వస్తున్నారు. అయితే తెలుగుదేశం పార్టీలో ఇద్దరి మధ్య గ్రూపులు నడిచేవి. కానీ 1995లో టిడిపి సంక్షోభ సమయంలో చంద్రబాబుకు అండగా నిలబడ్డారు దగ్గుబాటి వెంకటేశ్వరరావు. టిడిపిని స్వాధీనం చేసుకున్న తర్వాత.. చంద్రబాబు సీఎం అయ్యాక వారి మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయి. దీంతో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోయారు.కాంగ్రెస్ పార్టీ నుంచి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా, పురందేశ్వరి కేంద్రమంత్రిగా పనిచేశారు. అయితే 2014లో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ పతనం అయింది. దీంతో పురందేశ్వరి బిజెపిలో చేరారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయాలకు దూరమయ్యారు. క్రమేపి ఆ రెండు కుటుంబాల మధ్య ఉన్న విభేదాలు తగ్గుముఖం పడుతూ వచ్చాయి. 2019 నుంచి 2024 మధ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో ఈ రెండు కుటుంబాలు రాజకీయంగా ఇబ్బంది పడ్డాయి. దీంతో మరింత దగ్గరయ్యాయి. బిజెపిలో చేరిన పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలయ్యారు. 2024 ఎన్నికల్లో అదే బిజెపితో తెలుగుదేశం పార్టీ పొత్తు వెనుక పురందేశ్వరి కృషి ఉందన్న టాక్ కూడా ఉంది. ఈ పరిణామ క్రమంలో రెండు కుటుంబాల మధ్య సయోధ్య పెరిగింది. దీంతో అంతా రాజకీయంగా కలిసి పనిచేసిన పరిస్థితి కనిపిస్తోంది.ప్రస్తుతం నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ బాధ్యతలు చూస్తున్నారు. త్వరలో ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం తథ్యం. ఇటువంటి పరిస్థితుల్లో దగ్గుబాటి కుమారుడు హితేష్ చెంచురాం సైతం పొలిటికల్ ఎంట్రీ ఇస్తారని ప్రచారం నడుస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఆయన ఒక సైనిక్ స్కూల్ ను ఏర్పాటు చేశారు. ఆ స్కూల్ ను ప్రారంభించారు నారా లోకేష్. వచ్చే ఎన్నికల నాటికి చెంచు రామ్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నారు. అయితే అది తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ ద్వారానా.. లేకుంటే తెలుగుదేశం పార్టీ ద్వారానా అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికైతే ఆ కుటుంబాల మధ్య ఉన్న విభేదాలు తగ్గిపోయాయి. అయితే ఈ విషయంలో చంద్రబాబుతో పాటు లోకేష్ వ్యవహరించిన తీరు మాత్రం అదుర్స్.

## రాజుల కొట్టాడలో వైకాపా కార్యకర్తలపై దాడి

ఏలూరు

ఏలూరు జిల్లాలో కత్తులతో వైసీపీ కార్యకర్తలపై దాడి కలకలం రేపింది. కైకలూరు మండలం రాజుల కొట్టాడలో రెచ్చిపోయిన టీడీపీ నేతలు.. వైసీపీ కార్యకర్తలపై కత్తులు, రాళ్లతో దాడి జరిగింది. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంలో వైసీపీ సర్పంచ్ జోక్యం ఉండకూడదంటూ బెదిరింపులు వచ్చాయి. ఇటీవల సర్పంచ్ కుటుంబంపై రెండుమార్లు దాడి జరిగింది. మంగళవారం మరోమారు సర్పంచ్ కుటుంబంపై దాడి చేసినట్లుగా సర్పంచ్ కుటుంబం వెల్లడించింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వైసీపీ కార్యకర్తలపై కత్తులు, రాళ్లతో దాడి కి దిగారు. ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు.

## మహిళా రైతు హత్య?.

### పొలంలో పని చేస్తుండగా కత్తితో దాడి

### బంగారు ఆభరణాలు అపహరణ

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలో ఘటన

గజ్వేల్, : పొలంలో ఒంటరిగా పని చేసుకుంటున్న మహిళా రైతును హత్య చేసి, ఆమె మెడలోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్ల సత్తమ్మ(70), భర్త కిష్టారెడ్డి చనిపోవడంతో కొడుకుల వద్ద ఉంటూ చేసులో పని చేసేది. రోజూ పొలం వెళ్లి పని చేసుకుని తిరిగి వచ్చేది. పొలం రైల్వే ట్రాక్ పక్కన ఉండడంతో జన సంచారం తక్కువగా ఉంటుంది. మంగళవారం ఆమె పొలంలో పని చేస్తుండగా ఎవరో కత్తితో దాడి చేయగా, ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఆ తరువాత మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు, చెవి కమ్మలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సత్తమ్మను రక్తపు మడుగులో ఉండడాన్ని గమనించి, విషయాన్ని అతని కొడుకులకు తెలియజేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ ఆవు 10 లక్షలు

అనంతపురం, జూన్ 25,

ఐదు వేలు కాదు.. పదివేలు కాదు.. ఓ ఆవు ఏకంగా లక్షల్లో పలికింది. అది కూడా 10 లక్షల రూపాయలు పలికింది. నిజంగా ఆశ్చర్యపోతున్నారు కదా.. ఇది ముమ్మాటికీ నిజం. ఆవు ఏంటి? అంత ధర పలకడం ఏంటి? అనేది కదా మీ ప్రశ్న. ఆ ఆవు చాలా ప్రత్యేకం. రెండు పూటలా ఎక్కువగా పాలిస్తుంది. అందుకే ఆ ఆవుకు అంతటి డిమాండ్. ఇంతకీ ఆ ఆవు ఎక్కడ ఉందంటే శ్రీ సత్య సాయి జిల్లాలోని పెనుగొండలో. అక్కడ అమిత్ కిసాన్ హెబ్బేవ్ గోశాల నిర్వహిస్తున్నారు. ఆయన యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం లో ఉన్న భూమి రామిరెడ్డికి చెందిన ఫామ్ హౌస్ లో అరుదైన జాతి ఆవును కొనుగోలు చేశారు అమిత్ కిషన్.ఈ ఆవు భారీగా పాలు ఇస్తుంది. రోజుకు 16 లీటర్ల పాలు ఇస్తుందని చెబుతున్నారు. ఈ ఆవును యాదాద్రి జిల్లా నుంచి వాహనంలో పెనుగొండకు తీసుకొచ్చారు. రామిరెడ్డి నాలుగున్నర ఏళ్ల కిందట గుజరాత్ లోని రాజ్కోట్ నుంచి గిర్ జాతి ఆవులను రెండింటిని తెప్పించారు. యాదాద్రి జిల్లాలో గో శాలను ప్రారంభించారు. రెండు ఆవులతో ప్రారంభమైన ఆ గోశాలలో ఇప్పుడు 132 గిర్ ఆవులు ఉన్నాయి. ఈ జాతి ఆవులకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆవుల చర్మం ఎరుపు రంగులో ఉంటుంది. కొన్ని ఆవులు నలుపు, తెలుపు, ఓల్డ్ కలర్ లలో కూడా ఉంటాయి. 400 కిలోల వరకు బరువు ఉంటుంది. ఈ ఆవుల చెవులు పొడవుగా ఉంటాయి. రోజుకు 10 నుంచి 20 లీటర్ల వరకు పాలు ఇస్తాయి. మరికొన్ని ఆవులైతే 28 లీటర్ల వరకు పాలు ఇస్తాయి.మరోవైపు ఈ పాలు చాలా శ్రేష్టమైనవన్నీ నిపుణులు చెబుతుంటారు. ఈ ఆవులు అత్యధిక ఉష్ణోగ్రతలను( కూడా తట్టుకుంటాయి. చాలావరకు సాధుస్వభావంతో ఉంటాయి. ఎక్కడి వాతావరణం అయినా తట్టుకోగలవు. అందుకే ఈ ఆవులకు ప్రపంచవ్యాప్తంగా ఎనలేని ఆదరణ ఉంది. ముఖ్యంగా మన రాష్ట్రంలో సంప్రదాయ పశు రైతులుకు ఈ ఆవులు ఎంతో శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సైతం ఈ ఆవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు.

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఐ అండ్ పిఆర్ కమిషనర్

హైదరాబాద్

రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని రాష్ట్ర ఐ అండ్ పిఆర్ కమిషనర్గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సిఎచ్.ప్రియాంక బుధవారం నాడు మంత్రుల నివాస సముదాయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

# కర్నూలు బ్యాంక్ చోరీలో ఇంటిదొంగలు

కర్నూలు, జూన్ 25,

చాలా మంది లక్కీ భాస్కర్ సినిమా చూసే ఉంటారు. అందులో హీరో ఓ బ్యాంక్‌లో పనిచేస్తూ.. తన అవసరాల కోసం బ్యాంక్‌లో డబ్బును అడ్డదారిలో తీసుకెళ్లి, తన అవసరాలును తీర్చుకొని.. మళ్లీ తీసుకొచ్చి బ్యాంక్‌లో పెట్టేస్తాడు. ఇలాంటి స్కామ్‌లు సినిమాల్లోనే కాదు.. రియాల్‌గా కూడా చాలా జరుగుతున్నాయి. అందుకు నంద్యాల జిల్లా ఆత్మకూరు డివిజన్ పరిధిలోని కేంద్ర సహకార బ్యాంకు ప్రత్యక్ష ఉదాహరణ. ఉద్యోగులు అధికారులు ఎవరికి తోచినంత వారు బ్యాంకు డబ్బులు మాయం చేస్తున్నారు. జరిగిన విషయం గోప్యంగా ఉంచుతారు. అంతా పూర్తి చేసుకుని సస్పెండ్ చేసిన తర్వాత బయటకు చెబుతున్నారు. అసలు ఏం జరుగుతుందో కూడా ఎవరికీ అర్థం కావడం లేదు. తాజాగా కొత్తపల్లి మండలం నాగంపల్లి సొసైటీ సీఈవో కోటేశ్వరరావు సస్పెండ్ అయ్యారు. అంతకు ముందు కూడా ఇలాగే జరిగింది.రైతులు పెద్ద ఎత్తున కోట్ల రూపాయల్లో ఈ బ్యాంకులో డిపాజిట్లు చేశారు. అదేవిధంగా మరికొందరు రైతులు పంటల సాగు కోసం రుణాలు తీసుకున్నారు. ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో రూ.3 వేల కోట్ల టర్నవర్ ఉందంటే ఆ బ్యాంక్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంత పెద్ద ఎత్తున రైతులతో మమేకమైన బ్యాంకులో లక్షలకు లక్షలు మాయమవుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం అవుతుంది.ఆత్మకూరు కేంద్ర సహకార బ్యాంకులో గత డిసెంబర్‌లో రూ.90 లక్షల నగదు నిధులు మాయం అయ్యాయి. క్యాషియర్ అల్తాఫ్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ రంగయ్య లను విధుల నుంచి తొలగించారు. వారి నుంచి రికవరీ రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇది రైతులు మరిచిపోక ముందే కొత్తపల్లి మండలం నాగంపల్లి సొసైటీ బ్యాంకులో రైతుల ఖాతాల నుంచి రూ.40 లక్షలు దారి మళ్లించి సీఈవో కోటేశ్వరరావు సొంతానికి వాడుకున్నారు. లెక్క తేలకపోవడంతో అధికారులు నిలదీయడంతో గుట్టురట్టయింది. వెంటనే కోటేశ్వరరావును సస్పెండ్ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి సీఈఓ ల మీద పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో ఒక్కసారిగా కేంద్ర సహకార బ్యాంక్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఎక్కడెక్కడ అవినీతి ఆరోపణలు వచ్చాయో వారందరినీ గుర్తించి వారి విధుల పట్ల కదలికల పట్ల నిఘా పెట్టారు. పోయిన నిధులను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు.

# 6 నెలల్లో 122 అవినీతి అధికారులు

హైదరాబాద్, జూన్ 25,

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు అక్రమార్కులపై దృష్టి సారించారు. ఏసీబీ అధికారులు ఎన్నడూ లేని విధంగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో అక్రమార్కులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. గత 6నెలల్లోనే 122కేసులు నమోదు చేసి, వందలా మందిని కటకటాలపాలు చేశారు ఏసీబీ అధికారులు. లంచగొండి అధికారులపై మరింత దూకుడుగా వ్యవహరిస్తూ వరుస కేసులు, విచారణలతో ముచ్చెమటలు పట్టిస్తున్నారు.తెలంగాణలో ఏసీబీ అధికారులు గత ఏడాది 2024లో మొత్తం 129 ట్రాప్ కేసులు నమోదు చేస్తే, ఈ ఏడాది 6 నెలలు పూర్తికాక ముందే ఈ సంఖ్య 122కు చేరుకోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. రాష్ట్రంలో నగటున ప్రతి 3 రోజులకు 2 కేసుల చొప్పున నమోదవుతున్నాయి. ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేస్తున్న లంచావతారులు ఏమాత్రం జంకడం లేదు. గత కొన్ని రోజులుగా అక్రమార్కులు వరుసబెట్టి ఏసీబీకి పట్టుబడుతున్నారు. తెలంగాణ ఏసీబీ ఈ స్థాయిలో విరుచుకుపడటం ఈ మధ్యకాలంలో ఇదే మొదటిసారి.. అందుకే కేసుల సంఖ్య గణనీయంగా నమోదవుతోంది. ఏసీబీ అధికారుల సత్వర స్పందనతో బాధితుల్లో సైతం నమ్మకం కుదురుతోంది. దీంతో బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయి.అయితే ఏసీబీ అధికారుల అధికారిక టోల్‌ఫ్రీ నంబర్ 1064తోపాటు 94404 46106 వాట్సప్ నంబరు, ఫేస్‌బుక్, ఎక్స్ లాంటి సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్స్ ద్వారా కూడా ఫిర్యాదు చేసే సౌలభ్యం ఉంది. ప్రజల్లో టెక్నాలజీ వినియోగం పెరగడం కూడా ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో రావడానికి కారణంగా మారింది. సమాచారం రాగానే అధికారులు తొలుత అసలైనద కదా బాధితున్ని నిజంగానే లంచం డిమాండ్ చేశారా..! లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అని నిర్ధారించుకుంటారు. ఎందుకంటే తమకు పడని అధికారులపైనా బాధితుల ముసుగులో ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. మరోవైపు చాలా సందర్భాల్లో బాధితులే ఫోన్, వీడియో రికార్డింగులు వంటివి సమర్పిస్తున్నారు. కొంతమంది లంచావతారులైతే యూపీఐ ద్వారానే ఆమ్యామ్యాలు స్వీకరిస్తూ అడ్డంగా దొరికిపోతున్నారు. బాధితులు సమర్పించిన ఇలాంటి ఆధారాలను మరోమారు పునఃపరిశీలించిన తర్వాతే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగుతున్నారు. గతంలో ఒక ఫిర్యాదును నిర్ధారించుకొని లంచం అడిగిన ఉద్యోగిని పట్టుకోవడానికి సగటున వారం నుంచి పది రోజులు పట్టేది. ఇప్పుడది మూడు నాలుగు రోజులకు తగ్గింది.ఏసీబీకి వచ్చే ఫిర్యాదుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో అందుకు తగ్గట్టుగానే స్పందించేందుకు ఏసీబీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉండటంతో మరింత మంది సిబ్బందిని సమకూర్చుకునేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

. ప్రతి పనికి ఓ రేటు

రాష్ట్రంలో ఏసీబీ దాడులు జరుగుతూ అధికారులు పట్టుబడుతున్నా.. అవినీతి అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ప్రతి పనికి ఓ రేటు కట్టి మరి లంచం మా హక్కు అన్నట్లు మితిమీరి వ్యవహరిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో తహసిల్దార్ అయితే వెయ్యి తక్కువ అయ్యాయని రైతును పీడించుకు తిన్నాడు. తహసీల్దార్ రాజారావు వసూళ్ల దందా, అంతా ఇంతా కాదు. తహసిల్దార్ కార్యాలయం కేంద్రంగా లంచం డిమాండ్, తన ఛాంబర్ లో రైతు నుండి ఐదు వేలు లంచం తీసుకుంటున్న వీడియో వైరల్ అవుతోంది. పాస్ బక్ లో పేరు మార్పు కోసం లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్ రాజారావు రైతు వద్ద ఐదు వేలు తీసుకుంటూ ఇంతేనా అంటు రైతుతో సంభాషణ, గుంటకు వెయ్యి చొప్పున ఇవ్వాల్సిందే అంటూ పట్టు బట్టాడు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో తన కార్యాలయమే కేంద్రంగా చేసుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు తహసిల్దార్ రాజారావు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు అందాల్సిన సేవలకు లంచం డిమాండ్ చేస్తూ తమ అవినీతి దాహాన్ని తీర్చుకుంటున్నారు. కొందరు అధికారులు అందుకు ఈ దృశ్యాలే నిదర్శనం. అశ్వాపురం మండలంలోని మల్లెల మడుగు గ్రామానికి చెందిన రైతు పాస్ బుక్ లో పేరు మార్పు కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. అందుకుగాను గత కొన్ని రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే పేరు మార్చాలంటే పైసలు ఇవ్వాల్సిందే అంటూ తాసిల్దార్ రాజారావు డిమాండ్ చేయడంతో రైతు 5000 రూపాయలు తాసిల్దార్ కు లంచం ఇచ్చాడు.అయినా తృప్తి పడని తహసిల్దార్ రాజారావ్ ఇదేంటి ఐదు వేలేనా గుంటకు వెయ్యి చొప్పున ఇవ్వాల్సిందే ఇంకో వెయ్యి కూడా పంపించు అంటూ ఆదేశించారు. దీంతో చేసేదేమీ లేక రైతు సరే పంపిస్తా అంటూ రైతు కార్యాలయం నుండి వెళ్లిపోయాడు. ప్రజలకు ఉచితంగా అందించాల్సిన సేవలకు మండల స్థాయి అధికారే లంచం డిమాండ్ చేయడంతో ఆ రైతు తన సెల్ఫోన్లో ఈ దృశ్యాలను చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారింది. లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు బల్ల కింద చేతులు పెట్టడం మాత్రం మానడం లేదు అనేందుకు అశ్వాపురం తహసిల్దార్ రాజారావు ఘటనే ఓ ఉదాహరణ. తహసీల్దార్ వసూళ్లు దందా పై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వెంటనే బదిలీ చేశారు.

# కరసేవకుడి నుంచి కార్యసాధకుడి దాకా...

కరీంనగర్, జూన్ 25,

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో రాజకీయంగా అనేక విజయాలు సాధించినప్పటికీ, సొంతిల్లు లేని నాయకుడిగా గుర్తింపు పొందారు.బండి సంజయ్.. తెలంగాణలో రాజకీయాలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిన నేత. కరుడుగట్టిన హిందుత్వ వాది. హిందూ టైగర్‌గా కరీంనగర్ పట్టణ ప్రజలు, యువత పిలుచుకునే మాస్ లీడర్. సామాన్య కరసేవకుడిగా ప్రయాణం ప్రారంభించి.. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఎదిగి. కార్య సాధకుడిగా గుర్తింపు పొందాడు. 30 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఎట్టకేలకు సొంత ఇల్లు కొనుగోలు చేశాడు.కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో రాజకీయంగా అనేక విజయాలు సాధించినప్పటికీ, సొంతిల్లు లేని నాయకుడిగా గుర్తింపు పొందారు. ఇటీవల ఆయన చైతన్యపురి కాలనీలో రూ.98 లక్షలతో ఇంటిని కొనుగోలు చేసి, రాజకీయ జీవంతోపాటు వ్యక్తిగత జీవితంలో కూడా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు.బండి సంజయ్ కరీంనగర్‌లో కార్పొరేటర్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచే రెండుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. కానీ రెండుసార్లు ఎంపీగా విజయం సాధించారు. ఇటీవల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులై, ఆయన రాజకీయ ప్రభావం మరింత పెరిగింది. ఈ విజయాలన్నీ కరీంనగర్‌లోని అత్తగారి ఇంటి నుంచే సాధించడం విశేషం. ఈ నేపథ్యం ఆయన సామాన్యత, స్థానికులతో ఉన్న సన్నిహిత సంబంధాన్ని తెలియజేస్తుంది.ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో సొంతిల్లు లేకపోవడం బండి సంజయ్ వ్యక్తిగత జీవితంలో ఒక విశిష్ట అంశం. అయితే, చైతన్యపురిలోని తన కార్యాలయం సమీపంలో రూ.98 లక్షలతో ఇంటిని కొనుగోలు చేయడం ద్వారా ఆయన ఈ లోటును భర్తీ చేశారు. ఈ ఇంటి కొనుగోలుకు ఆయన సతీమణి అపర్ణ పేరిట రూ.85 లక్షల బ్యాంకు రుణం తీసుకోవడం, ఆర్థిక ప్రణాళికలో వారి జాగ్రత్తను సూచిస్తుంది. సోమవారం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకోవడం ఈ ప్రక్రియను పూర్తి చేసిందిబండి సంజయ్ సతీమణి అపర్ణ బ్యాంకు అధికారిగా పనిచేస్తూ, కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతున్నారు. రాజకీయ నాయకుడిగా ఉన్నప్పటికీ, అత్తగారి ఇంట్లో నివసించడం ద్వారా సంజయ్ సామాన్య జీవనశైలిని కొనసాగించారు. సొంతిల్లు కొనుగోలు చేసిన తర్వాత కూడా, బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక బాధ్యతను స్వీకరించడం ఆయన ఆర్థిక సమతుల్యతను ప్రతిబింబిస్తుంది.సొంతిల్లు కొనుగోలు చేయడం బండి సంజయ్ జీవితంలో కేవలం ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదు, ఇది ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితంలో స్థిరత్వానికి సంకేతం. కరీంనగర్‌లోని చైతన్యపురిలో కార్యాలయం సమీపంలో ఇంటిని ఎంచుకోవడం, ఆయన స్థానికులతో సన్నిహితంగా ఉండాలనే సంకల్పాన్ని చాటుతుంది. కేంద్ర మంత్రిగా ఆయన కావాలనుకుంటే ఢిల్లీలో కూడా ఇంటిని కొనుగోలు చేయగలరు. హైదరాబాద్‌లో అయినా కొనుగోలు చేయవచ్చు. కానీ తాను పుట్టిన గడ్డకు, తనకు రాజకీయ భిక్ష పెట్టిన కరీంనగర్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. స్థానికతకు పెద్దపీట వేశారు. ఈ నిర్ణయం ఆయన కుటుంబ జీవితంలో కొత్త దశను సూచిస్తూ, సామాన్య ప్రజలతో ఆయన అనుబంధాన్ని మరింత బలపరుస్తుంది.బండి సంజయ్ రాజకీయ జీవితంలో అనేక విజయాలు సాధించినప్పటికీ, సొంతిల్లు లేని నాయకుడిగా ఉండటం ఆయన సామాన్యతకు నిదర్శనం. చైతన్యపురిలో ఇంటి కొనుగోలు ఆయన వ్యక్తిగత జీవితంలో స్థిరత్వాన్ని, ఆర్థిక బాధ్యతను ప్రతిబింబిస్తుంది. ఈ నిర్ణయం ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యతను సాధించే ప్రయత్నంగా భావించవచ్చు. అదే సమయంలో కరీంనగర్ ప్రజలతో ఆయన అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

# రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్

## -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )




భారతదేశ చరిత్రలో దళిత, బహుజనులను విముక్తి చేయటానికి సైద్ధాంతికంగా, పాలనపరంగా మహాత్మ జ్యోతిబాఫూలే, ఛత్రపతి శివాజీల వారసుడిగా కృషి చేసిన మహనీయుడు రాజర్షి ఛత్రపతి సాహుమహారాజ్. 1874 జూన్ 26న రాధాబాయి, జయసింగ్ అబాసాహెబ్ ఘాట్గేలకు జన్మించిన యశ్వంతరావు ఘాట్గేనే ఆ తర్వాత కాలంలో సాహు మహారాజ్‌గా ప్రసిద్ధి చెందాడు. ఘాట్గేలు మహారాష్ట్రలో వెనుకబడిన తరగతుల (ఓబీసీ)కి చెందిన వారు, వ్యవసాయం చేసుకొని జీవించే "కున్బీ" కాపు కులం వారిది. ఛత్రపతి శివాజీ స్థాపించిన మరాఠ సామ్రాజ్యంలోని కొల్హాపూర్ రాజ్యంలో వారసులు లేకుంటే నాల్గవ శివాజీ భార్య రాణి ఆనందబాయి తన బంధువుల అబ్బాయిని దత్తపుత్రుడిగా స్వీకరించి యశ్వంత్‌రావు ఘాట్గేకి ముద్దుగా 'సాహు' అని పేరు పెట్టుకుంటది. మూడేండ్లకే తల్లిని కోల్పోయిన సాహు, 1886 మార్చి 20న తండ్రి మరణంతో 11 ఏండ్లకే తల్లిదండ్రులిద్దరులేని వాడైనాడు. సాహు చిన్నతనమంతా ఆంగ్లేయ అధ్యాపకుల పర్యవేక్షణలో జరిగినందున ఆధునిక భావాలు పుణికి పుచ్చుకున్నాడు. యుక్తవయసు రాగానే 1894 ఏప్రిల్ 2న సింహాసనం అధిష్టించాడు సాహు. 1900వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఒక రోజు సాహు మహారాజ్ పంచగంగా నదిలో స్నానం చేస్తున్న సమయంలో బ్రాహ్మణ పురోహితుడు స్నానం చేయకుండానే వచ్చి సాహు మహారాజ్ క్షత్రియ వంశస్తుడు కానందున, ఒక వ్యవసాయం చేసుకునే కులానికి చెందిన శూద్రుడైనందున ఈసడింపుతో వేదోక్త మంత్రాల బదులు పౌరాణిక మంత్రాలు చదివి అవమానిస్తాడు. పుట్టుకతోనే మనిషి కులం నిర్ణయించబడుతుందనీ రాజైనంత మాత్రాన, దత్తత వచ్చినంత మాత్రాన క్షత్రియుడిగా మారిపోడని వాదనకు దిగుతాడు. ఈ సంఘటన సాహు మహారాజ్‌ని మహాత్మ జ్యోతిబాఫూలే సత్యశోధక సమాజ్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే వారసత్వాన్ని ఎన్నుకోవడానికి కారణమైంది. బాస్కర్‌రావు జాదవ్ అనే ఉద్యోగిని 'సత్యశోధక్ సమాజ్' నడిపే బాధ్యతలు అప్పచెప్పి 'మరాఠ దీనబంధు' పేరుతో పత్రికని నడిపించి సత్యశోధక సమాజ తాత్విక దక్పథాన్ని ప్రచారం చేయించిండు. బ్రాహ్మణేతరులకి పురోహిత శిక్షణనిచ్చేందుకు సత్యశోధక్ సమాజ్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రారంభమైంది. కొల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో వందలా ది వివాహాలు, వేడుకలు సత్యశోధక్ సమాజ్ పద్ధతిలో జరిగాయి. తను సిం హాసనం అధిష్టించే నాటికి తన రాజ్యం లో మత కర్మలలో మొదలు పరిపాలన లోని అన్ని ఉద్యోగ రంగాలతోపాటు వ్యాపారం, వడ్డీ వ్యాపారంలో కూడా బ్రాహ్మణులే నిండిపోవడం సాహు గమనించాడు. బ్రాహ్మణేతరులని ఉన్న తోద్యోగాల్లోకి తెస్తే తప్ప వారి సామాజిక హోదాలో, జీవితాల్లో మార్పు రాద ని, బ్రాహ్మణ ఆధిపత్యానికి అడ్డుకట్ట పడదని సాహు భావించిండు. వెనుకబడిన కులాల వారందరికీ స్కూల్స్, వసతి గృహాలు ప్రారంభించి విద్యని ఒక ఉద్యమంగా నడిపిండు. కొల్హాపూర్ పట్టణంలో హాస్టల్స్ కాలనీనే నిర్మించిండు. 1901 లో జైన హాస్టల్, విక్టోరియ మరాఠ హా స్టల్, 1906లో ముస్లింలకు, 1907లో వీరశైవ లింగాయత్‌లకు, 1908లో అంటరానివారికి, మరాఠాలకీ 1921లో దర్జీ, నేత కులస్తులకి నామ్ దేవ్ హాస్టల్, విశ్వకర్మలకి సోనార్ హాస్టల్స్ నిర్మించిండు. ప్రతి గ్రామంలో కనీసం ఒక ప్రాథమి క పాఠశాలనేర్పరచి అందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యనందించిండు. పాఠశాలలకు స్వంత భవనాలు ఏర్పడే వరకు గ్రామాల్లోని అన్ని ఆలయాలను, చావడీలను పాఠశాలలుగా వాడాలనీ, ఏ గ్రామంలో ఏ కులస్తులు మెజారిటీగా ఉన్నారో చూసి ఆ కులపు వ్యక్తినే ఉపాధ్యాయుడిగా నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ముస్లింలకు వాళ్ల మాతృ భాషలోనే పాఠశాలలు ప్రారంభమ య్యాయి. ఆ తర్వాత కాలంలో కొంత మార్పు రాగానే కులపరమైన విద్యాసంస్థల ని రద్దు చేస్తూ అన్ని కులాలు, మతాల వారు కలిసిమెలిసి ఏ పాఠశాలలోనైనా, విద్యా సంస్థలోనైనా చదువొచ్చని ప్రకటన ఇచ్చింది సాహు ప్రభుత్వం. వ్యవసాయం ఇతర వత్తులు చేసే వయోజనుల కోసం రాత్రి పాఠశాలలు ఏర్పడ్డాయి. జులై 26, 1902 భారతదేశ చరిత్రలో ఒక చరిత్రాత్మక దినం. ఆ రోజు ఛత్రపతి సాహు మహారాజ్ ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగాలన్నింటిలో వెనుకబడినవర్గాల వారికి 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సంచలనాత్మక ఉత్తర్వులని జారీ చేసింది. వెనుకబడిన వర్గాలు అనగా బ్రాహ్మణ, ప్రభు, షెన్వీ, పార్శీ ఇతర అభివద్ధి చెందిన కులాలు మినహా మిగిలిన అన్ని కులాల వారు అంటరానివారి నుండి అన్ని మతాలలో వెనుకబడినవారు కూడా రిజర్వేషన్ కిందికే వస్తారు. గ్రామ పరిపాలన రంగంలో వంశపారంపర్యంగా వచ్చే ముఖ్యులైన పటేల్ (పాటిల్), పట్వారీ (కులకర్ణి) వ్యవస్థని 1918లో రద్దు చేసిండు. ఉపాధ్యాయులు గా కూడా వారసత్వంగా పని చేయడాన్ని రద్దు చేసిండు. టీచర్ ట్రైనింగ్, పాటిల్ ట్రైనింగ్ స్కూల్స్ పెట్టించిండు. విద్యారంగంలో సాహు కషి కేవలం అక్షరాస్యతకే కాకుండా సంగీత, సాహిత్య, నాటక ప్రక్రియలన్నింటిని ప్రోత్సహించిండు. సాహు కాలంలో నాటక రంగం అభి వృద్ధి చెందింది. కొల్హాపూర్ జ్ఞాన సమాజ్, కిర్లోస్కర్ కం పెనీ, స్వదేశ్ – హితా చింతక్ వంటి నాటక సమాజాల కు ఉదారంగా విరాళాలిచ్చేవాడు. భారత దేశంలో మొట్ట మొదటి మహిళా నాటక సమాజమైన 'శేషశాని స్త్రీ సంగీ త నాటక మండలి' కొల్హాపూర్‌కి చెందినదే. సాహు ఏర్పరిచిన భూమికపై నుండే వి.శాంతారాం, మాస్టర్ వినాయక్ షిండే లాంటి ప్రసిద్ధులైన సినిమా దర్శకులు కొల్హాపూర్ ప్రాంతం నుండి వచ్చారు. 1919 సెప్టెంబర్ 6న అంటరానితనం పాటించడం నేరమని ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. ప్రజలు గానీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర ఉద్యోగులు అగౌరవంగా ప్రవర్తించినట్టు ఫిర్యాదు అందితే నేరస్తుల మీద చర్యలు తీసుకుంటారు. నేరస్తులు ఉద్యోగులైతే ఆరు వారాల్లోగా విచారణ జరిపి నేరస్తులని తేలితే ఉద్యో గం నుండి తొలగింపుతోపాటు పెన్షన్ కూడా రద్దైపో తుంది. 1920 మే 3వ తేదిన వెట్టిచాకిరి వ్యవస్థని రద్దు చేస్తూ చట్టం చేశాడు. గ్రామీణ పరిపాలనలో కింది స్థాయి ముఖ్య ఉద్యోగాలైన 'తలాతీ' ( సుంకరి, గ్రామ రెవెన్యూ సహాయకులు) లు గా అస్పృశ్యులే ఉంటారు కాబట్టి వాళ్లందరికీ ఉద్యోగ నిర్వహణకు అవసరమైన శిక్షణనిచ్చేందుకు ట్రైనింగ్ స్కూల్స్ ప్రారంభించిండు. 1919 నవంబర్ 6న వెలువడిన చట్టం ప్రకారం అన్ని వత్తుల్లోను, ఉద్యోగాల్లోను ఉండే అస్పృశ్యులకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాన్ని కల్పించిండు.ఆదివాసీ తెగలకు, అంటరాని వారికి సంబంధించి బ్రిటీష్ ప్రభుత్వం పెట్టిన 'నేరస్థ కులాల చట్టాన్ని' 1918లో రద్దు చేసింద్రు. మహర్, మాంగ్, రామోషీ, బెరాడ్ లాంటి నేరస్థ కులాలుగా పరిగణింపబడే కులాల ప్రజలు ప్రతి రోజు పోలీస్ స్టేషన్‌లో హాజరై సంతకం చేసే అమానుషం ఈ చర్యతో రద్దైంది. అంబేద్కర్ అస్పృశ్యుల హక్కుల సాధన కోసం ఆ పత్రికకి ఆర్థిక వనరులు సమకూర్చే బాధ్యతను తీసుకొని మొదట రూ.2500 ఇవ్వడంతో 'మూక్ నాయక్' పత్రిక ప్రారంభమైంది.1920 ఏప్రిల్ 15న నాసిక్‌లో అంబేద్కర్ ఆయన మిత్రులు అంటరాని వారి కోసం ఒక హాస్టల్ కట్టాలనుకుంటే ఆ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరై ఐదు వేల రూపాయలు ఇచ్చాడు సాహు. 1920లో అంబేద్కర్ ఇంగ్లాండ్ వెళ్లి చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేశాడు. అంబేద్కర్ విదేశాల్లో ఉన్నంత కాలం 'మూక్ నాయక్' పత్రిక నిర్వహణకి ఆర్థిక సహాయం చేసిండు. పితస్వామ్య, కుల, మత వ్యవస్థల వల్ల స్త్రీల మీద జరుగుతున్న అమానుషాలని గ్రహించిన సాహు మొదట తన భార్య లక్ష్మీబాయికి యూరోపియన్ టీచర్ల ద్వారా ఆధునిక విద్యను చెప్పించిండు. సంగీతంలో, చిత్రలేఖనంలో, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇప్పించిండు. కొల్హాపూర్ సంస్థానంలో బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభం చేసిండు. ఉన్నత విద్యలోకి బాలికలను ప్రోత్సహించేందుకు ఉపకారవేతనాలు, ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేసింద్రు. కొల్హాపూర్ రాజారాం కాలేజీలో బాలికలకు ప్రత్యేక విభాగం ఏర్పరిచింద్రు. వెనుకబడిన ఆడపిల్లలకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించింద్రు. 1919 జూన్‌లో బాల్య వివాహాల రద్దు చట్టం వచ్చింది. 1919 జులై 12న కులాంతర, వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ చట్టం తెచ్చిన 'కొల్హాపూర్ స్పెషల్ మ్యారేజీ యాక్ట్ – 1918' ప్రకారం ఎందరో యువతీ యువకులు తమకు నచ్చిన భాగస్వాములని ఎన్నుకున్నారు. విడాకులు మంజూరు చేయడంలో స్త్రీల నిర్ణయానికే ప్రాధాన్యతనిస్తూ 1919 ఆగస్టు 2న విడాకుల చట్టం, స్పెషల్ మ్యారేజీ యాక్ట్ అప్పుడు దేశంలో సంచలనం సష్టించాయి. 1920 జనవరి 17న జోగిని, దేవదాసీ వ్యస్థను రద్దు చేసిండు. ప్రభుత్వం దేవదాసీల పునరావాసానికి చర్యలు తీసుకుంది. 1919 జులైలో వ్యభిచార వత్తిలో ఉన్న స్త్రీలకు పునరావాసాన్ని కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించిండు. పరిపాలనలో ప్రజలకు అర్థం కాని, ప్రజలకు ఇబ్బంది కల్గించే బ్రాహ్మణ గుమస్తాలు, పట్వారీలు వాడే మోడీ లిపిని పరిపాలన వ్యవహారాల్లో రద్దు చేస్తూ 1917 మార్చిలో నిర్ణయం తీసుకున్నాడు. కరువు వచ్చినపుడు రైతులకు అన్ని రకాల పన్నులను, రుణాలని మాఫీ చేసిండు. అప్పుల కింద రైతుల ఆస్తులని, పనిముట్లనీ, పశువులని బలవంతంగా జప్తు చేసే చర్యలను నిషేధిస్తూ 1894లోనే చట్టం చేసిండు.

# జూబ్లీహిల్స్ బై పోల్ లో నందమూరి వారసురాలు

హైదరాబాద్, జూన్ 25,

తెలుగు రాజకీయాల్లో నందమూరి కుటుంబానికి ప్రత్యేక స్థానం. ఎన్టీఆర్ వారసులుగా నందమూరి హరికృష్ణతో పాటు బాలకృష్ణ రాజకీయం చేశారు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. మరోవైపు టిడిపిలో క్రియాశీలకంగా అవుతామనుకున్న తరుణంలో నందమూరి తారకరత్న మృతి చెందారు. జూనియర్ ఎన్టీఆర్ తో పాటు కళ్యాణ్ రామ్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కానీ వారి సోదరి సుహాసిని మాత్రం యాక్టివ్ గా ఉన్నారు. తెలంగాణలో జరిగే ఉప ఎన్నికల్లో ఆమె పోటీ చేస్తారని ప్రచారం నడుస్తోంది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. ఇప్పటికే అన్ని పార్టీలు సన్నాహాలు ప్రారంభించాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కావడంతో ఆ పార్టీ సెంటిమెంట్ వస్త్రాలను బయటకు తీస్తోంది. మరోవైపు కంటోన్మెంట్ తరహాలోనే ఈ సీట్లో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది.అనుకోని అవకాశంగా తెలుగుదేశం పార్టీభావిస్తోంది. వాస్తవానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి గెలిచిన మాగంటి గోపీనాథ్ తెలుగుదేశం పార్టీకి చెందినవారు. టిడిపి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ లోకి ఫిరాయించారు. అందుకే ఉప ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి పోటీ చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టిడిపికి మిత్రపక్షాలుగా ఉన్న బిజెపి, జనసేనతో తెలుగుదేశం పార్టీ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అక్కడ అభ్యర్థిత్వంపై ఒక అంచనాకు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ స్థానానికి అక్టోబర్లో ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సెప్టెంబర్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.అధికార కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ముందుంది. ఎలాగైనా ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. నియోజకవర్గంలో పరిస్థితుల అధ్యయనం, నిర్ణయాల కోసం పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ తో కూడిన కమిటీని సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. 2009 పునర్విభజనతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పడింది. 2014 నుంచి వరుసగా గెలుస్తూ వచ్చారు మాగంటి గోపీనాథ్. 2014లో టిడిపి నుంచి, 2018, 2023 ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి గెలుపొందారు. ఖైరతాబాద్ నుంచి విడిపోయి జూబ్లీహిల్స్ నియోజకవర్గం గా అవతరించింది. 2009లో మాత్రం కాంగ్రెస్ పార్టీ నుంచి విష్ణువర్ధన్ రెడ్డి గెలిచారు.ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి అజారుద్దీన్, పిజిఆర్ కుమార్తె విజయా రెడ్డి, నవీన్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇక్కడ ముస్లిం మైనారిటీ ఓటింగ్ కీలకం. కాంగ్రెస్ ఎంఐఎం మధ్య ఒప్పందం కుదిరితే మాత్రం ఇక్కడ సమీకరణలు మారడం ఖాయం. మరోవైపు గోపీనాథ్ కుటుంబం నుంచే బిఆర్ఎస్ అభ్యర్థి పోటీ చేసే అవకాశం ఉంది. సాధ్యం కాకుంటే మాత్రం మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి సీటు కేటాయించే పరిస్థితి కనిపిస్తోంది. అయితే తెలుగుదేశం పార్టీ మాత్రం మిగతా రెండు మిత్రపక్షాలతో కలిపి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. అటు మాగంటి గోపీనాథ్ చంద్రబాబుకు కావలసిన మనిషి. అందుకే ఆయన మరణ సమయంలో లోకేష్ ప్రత్యేకంగా పరామర్శించారు వారి కుటుంబ సభ్యులను.

తెలంగాణలో టిడిపి విస్తరణ దిశగా చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. త్వరలో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. అంతకుముందే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రూపంలో అవకాశం వచ్చింది. టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిని రంగంలో దించే పరిస్థితి కనిపిస్తోంది. టిడిపి నుంచి నందమూరి సుహాసిని బరిలోకి దించితే మంచి ఫలితం ఉంటుందని భావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో కమ్మ ప్రాబల్యం అధికం. సామాజిక సమీకరణల దృష్ట్యా సుహాసిని అభ్యర్థిత్వం కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# హాట్ కేక్ లా కొనేసిన పోటీదారులు

హైదరాబాద్, జూన్ 25,

దేశంలో అత్యంత డిమాండ్ ఉన్న నగరాలలో హైదరాబాద్ ఒకటి. కోకాపేట పేరు చెబితే ఏకరం వంద కోట్లు ధర పలుకుతుందని రికార్డు ఉంది. దక్షిణాదిన బెంగళూరు, చెన్నై నగరాలకు రియల్ ఎస్టేట్లో హైదరాబాద్ పోటీ ఇస్తోంది. ఈ క్రమంలో గజం భూమి ధర ఏకంగా రూ.2.22 లక్షలు పలికి రికార్డు సృష్టించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలోని ఓ కమర్షియల్ స్థలం గజం ధర రెండు లక్షల పైగా పలకడం నగరవాసులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. హైదరాబాద్ పరిధిలోని హౌసింగ్ బోర్డు స్థలాల వేలం ప్రక్రియను కేపీహెచ్బీనిర్వహించారు. కమర్షియల్ స్థలాల వేలంలో 53 మంది వరకు పోటీదారులు పాల్గొన్నారు. నగరంలోని చింతల్, గచ్చిబౌలి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్లాట్లకు సోమవారం నాడు హౌజింగ్ బోర్డు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు, గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లు వీటిలో ఉన్నాయి. కూకట్పల్లి కెపీహెచ్‌బీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వించిన ఈ స్థలాల వేలం పాటలో 55 మంది పాల్గొన్నారని హౌజింగ్ కమిషనర్ పేర్కొన్నారుగచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్లు బోర్డుకు ఆదాయంగా వచ్చిందిగచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ ల్యాండ్ ను గజానికి రూ.2.22 లక్షలు చొప్పున సుమారు రూ. 33 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ భూములకు చదరపు గజానికి 1.20 లక్షలను ఆఫ్ సెట్ ధరగా నిర్ధారించగా వేలం పాటలో అది 2.22 లక్షలు పలికింది. అట్లాగే ఇదే ప్రాంతంలోని 1200 గజాల పాఠశాల భూములకు ఆఫ్ సెట్ ధర చదరపు గజానికి 80 వేలుగా నిర్ధారించగా, వేలంలో ఆ భూములకు రూ 1.12 లక్షలకు కొనుగోలు చేశారు. ఇక్కడి రెండు ఎంఐజి ప్లాట్లు చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ. 1.32 లక్షల ధరలు పలికాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల ద్వారానే 55 కోట్ల 56 లక్షల 84 వేల మేర ఆదాయం హౌజింగ్ బోర్డుకు సమకూరింది.కుత్బుల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలోని హౌజింగ్ బోర్డు ఎంఐజీ ప్లాట్లు కూడా అత్యధిక ధరలతో బహిరంగ వేలంలో అమ్ముడు పోయాయి. ఈ ప్రాంతంలో మొత్తం పది ప్లాట్లను వేలం వేయగా వీటిలో ప్లాట్ నెం.113,114,115ల ద్వారానే సుమారు 8.11 కోట్ల మేర ఆదాయం వచ్చింది. నిజాంపేట- బాచుపల్లిలోని నాలుగు ప్లాట్లను సుమారు రూ.70 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేశారు.గచ్చిబౌలిలో 4 స్థలాలను వేలం వేయగా హాట్ కేక్ లా అన్నీ కొనేశారు. కుక్కలపార్కును ఆనుకుని ఉన్న 1,487 చదరపు గజాల స్థలం వేలం వేయగా, గజానికి రూ.1.20 లక్షలుగా ధర నిర్ణయించారు. వేలంలో పోటీ పడి మరి ఒక్క గజం రూ.2.22 లక్షల చొప్పున రూ.33 కోట్లకు ఒక పోటీదారు దక్కించుకున్నారు.మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం చింతల్ లోని ఎంఐజీ 10 స్థలాలు వేలంలోకి రాగా, 3 స్థలాలు అమ్ముడుపోయాయి. వీటి వేలం ద్వారా సుమారు రూ.8 కోట్ల ఆదాయం సమకూరింది. బాచుపల్లిలో 8 ప్లాట్లను వేలం వేస్తే 4 కొన్నారు. బీ-1 బ్లాక్ లోని ఎఫ్17 ప్లాటు అత్యధికంగా రూ.18.21 లక్షల ధరకు అమ్ముడుపోయింది. వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మొత్తం రూ.65 కోట్ల ఆదాయం సమకూరగా, గచ్చిబౌలి భూముల వేలం ద్వారా 55 కోట్ల రూపాయలు వచ్చాయని హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతమ్ వేలం వివరాలు తెలిపారు.

# మత్తుతో యువత బంగారు భవిష్యత్తు చిత్తు

## -నేడు అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

అనేక కారణాల వల్ల మాదక ద్రవ్యాల వినియోగం విద్యార్థుల్లో, యువతలో చాప కింద నీరులా విస్తరిస్తోంది. చాలామంది మద్యం, సిగరెట్లు, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. తద్వారా తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఆ మత్తులో చెడుమార్గంలో పయనిస్తూ ఇటు కుటుంబానికి, అటు సభ్య సమాజానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నారు. చిన్న వయస్సులోనే మత్తు పదార్థాలకు అలవాటుపడి చదువును పాటు చేసుకుంటున్నారు. ఉత్సాహంతో




ఉరకలెత్తాల్సిన యువ జవసత్వాలు సన్నగిల్లి యవ్వనంలోనే శారీరకంగా, మానసికంగా నిర్వీర్యమైపోతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా జూన్ 26న అంతర్జాతీయ అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటారు.

మత్తు పదార్థాల వినియోగం వల్ల ఏర్పడు దుష్ఫలితాలు గురించి, అక్రమ రవాణాను అరికట్టడం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్యోద్దేశ్యం.

ప్రపంచవ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడిసి) ఈ రోజున మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 7, 1987న చేసిన తీర్మానం 42/112 ద్వారా ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఈ తీర్మానం 1987 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ నివేదిక ఇతర అంశాల పై మరికొన్ని చర్యల కోసం సిఫార్సు చేసింది.

1987 నుంచి ఐక్యరాజ్యసమితి ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దేశ దేశాల ప్రభుత్వాలను ఈ మహమ్మారి వ్యాప్తి గురించి హెచ్చరిస్తోంది. మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా ప్రపంచమంతటా కార్యక్రమాలు జరుపుకోడానికి జూన్26వ తేదీన ఐరాస సర్వప్రతినిధి సభ 1987లో మొట్టమొదటిసారిగా తీర్మానించింది. మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా మానవాళిని రక్షించేందుకు, మాదకద్రవ్యాల వాడకం లేని సమాజాన్ని సృష్టించేందుకు గాను ప్రమాణం చేసే లక్ష్యంతో జూన్26ను అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినంగా ఐరాస ప్రకటించింది. ప్రతి ఏటా జూన్26న ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాలను స్వాధీనపర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది..

టీనేజ్ పిల్లలు డ్రగ్స్ వైపు మొగ్గు చూపటంలో ప్రధానంగా నెగెటివ్ కుటుంబ వాతావరణం కూడా ఒక ముఖ్యకారణం. తల్లిదండ్రులు ఘర్షణతో ఉన్నా, పిల్లలతో మంచి అనుబంధం ఏర్పర్చుకోకపోయినా, ఆత్మీయంగా వారితో సమయం గడపకపోయినా 'మనం పట్టని తల్లిదండ్రుల' కంటే 'మనకు కిక్ ఇచ్చే డ్రగ్స్ మేలు' అనే భావనలో భ్రష్ట సాంగత్యాల్లోకి పిల్లలు వెళ్తుంటారు. చదువుతోపాటు క్రీడలు, కుటుంబ సభ్యుల మధ్య అన్యోన్యత, బంధుమిత్రులు, క్రమశిక్షణల ఆర్థిక పరిస్థితి, భావోద్వేగాలకు అయిన వారు ఉన్నారన్న భరోసా, విలువలు ఏదో ఒక ఆత్మీయ ఆలంబన వంటివి టీనేజ్ పిల్లల రోజువారీ జీవనంలో ఉంటే వారు డ్రగ్స్ బారిన ఏమాత్రం పడరు. సరదా షికార్లు, స్లీప్ ఓవర్‌ల సమయంలో సరదా కొద్దీ సీనియర్లో, స్నేహితులో డ్రగ్స్ ఇస్తుంటారు. ఇవి తీసుకున్నాక ఇంకా ఎన్ని రకాల డ్రగ్స్ ఉన్నాయో వెతుకులాట సాగిస్తారు. ఇక అంతటితో వారి చదువు, ఆరోగ్యం, ఏకాగ్రత, వ్యక్తిత్వం మొత్తం ధ్వంసమైపోతాయి. తల్లిదండ్రులు మందలిస్తే 'మీరిలా తిడితే ఇల్లు విడిచివెళ్లిపోతాం' అంటూ బ్లాక్‌మెయిల్ కూడా చేస్తుంటారు. వీరిని చాలా ఓర్పుతో థెరపీల ద్వారా తిరిగి మామూలు మనుషులుగా చేయాల్సి వుంది.

# ఇందిరమ్మ ఇళ్లపై ఆసక్తి చూపని గ్రామస్తులు

అదిలాబాద్, జూన్ 25,

ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. లబ్ధిదారులను ఎంపిక చేసి ఐదు నెలలు గడిచినా, ఆర్థిక స్థోమత లేక, వర్షాకాలంలో ఎక్కడ ఉండాలనే భయంతో చాలామంది నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇల్లు కట్టుకోని వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు, అయితే పాత లబ్ధిదారులు ఎప్పుడైనా ముందుకొస్తే వారికి మంజూరు చేస్తామని చెప్పారు.ఇల్లు లేని నిరుపేదలకు సొంతిళ్లు నిర్మించి ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకం ఆదిలాబాద్ జిల్లాలో అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసి 5 నెలలు గడిచినా.. చాలా మంది నిర్మాణ పనులను ప్రారంభించలేదు. మరీ ముఖ్యంగా సొంత ఖర్చులతో ఇళ్లను నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడం, వర్షాకాలంలో ప్రస్తుతం నివాసం ఉంటున్న పాకలను తొలగిస్తే ఎక్కడ ఉండాలనే భయం వంటి కారణాలతో చాలా మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఇలాంటి వారికి ఐకేపీ ద్వారా రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు లోన్ ఇచ్చేందుకు కూడా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ రుణం తీసుకునేందుకు చాలా మంది లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం నివసిస్తున్న పాకలను తొలగిస్తే.. ఇప్పుడు వర్షాకాలంలో ఎక్కడ నివసించాలనే బెంగతో అక్కడి జనం ఆసక్తి చూపడం లేదని పలుచోట్ల అధికారుల దృష్టికి వచ్చింది. మరోవైపు గ్రామాల్లో ఇళ్లు అద్దెకు దొరకడం చాలా కష్టంగా మారిందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఆదిలాబాద్ జిల్లాలో మొదటి విడతలో 17 మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. జనవరి 26వ తేదీన మండలానికి ఒక గ్రామం చొప్పున ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు మంజూరు పత్రాలు అందించారు. ఇప్పటికీ లబ్ధిదారులు పనులు ప్రారంభించకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు వారితో తరచూ సంప్రదింపులు జరుపుతునే ఉన్నారు. వారు మాత్రం రేపు, మాపు అంటూ వాయిదా వేస్తూ కాలం గడిపేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే



ఉన్నతాధికారుల ఆదేశంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి ఆసక్తి లేని లబ్ధిదారుల పేర్ల జాబితాను ఎంపీడీఓల నుంచి సేకరించారు. జిల్లాలోని ఏజెన్సీ పరిధిలోకి వచ్చే నార్నూర్, ఉట్నూర్, గాదిగూడ, సిరికొండ మండలాల్లో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవటం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. భోరజ్ మండలం పిప్పర్‌వాడలో 46 మంది.. మావల మండలం వాఘాపూర్‌లో 45 మంది.. తాంసి మండలం హస్నాపూర్‌లో 26 మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ఆసక్తి లేనట్లు అధికారులు గుర్తించారు.ఇక బేల మండలం డోప్టాలో 83 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. అందులో సగం మంది ఇంకా నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు. వారిలో 30 మందికి అసలు ఇల్లు నిర్మించుకునేందుకు.. ఆసక్తి లేదని అధికారులు గుర్తించారు. బోథ్ మండలం కుచులాపూర్‌లో 232 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. సగానికంటే ఎక్కువ ఇళ్ల పనులు ఇంకా ప్రారంభించనే లేదు. ఇక్కడ 142 మంది వరకు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదని అధికారుల పరిశీలనలో వెల్లడైంది.ఇక ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై జడ్పీ సీఈఓ (ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేకాధికారి) జితేందర్‌రెడ్డి స్పందించారు. ఇళ్లు నిర్మించుకోని వారికి రద్దు చేయడం అంటూ ఏమీ ఉండదని.. ఎంపీడీఓ లాగిన్‌లో వారి పేర్లు యథావిధిగా ఉంటాయని తెలిపారు. ఎప్పుడైనా ఆసక్తి ఉంటే ముందుకొస్తే జిల్లా కలెక్టర్ లాగిన్‌కు పంపించి ఇల్లు మంజూరు చేస్తామని తేల్చి చెప్పారు. ఆలోగా అదే స్థానంలో కొత్తవారిని ఎంపిక చేస్తామని వెల్లడించారు.

# కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే 30% అప్పులు చేసింది : మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

అమరావతి

గత ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం అప్పుల మయం అయిపోయిందని, రాష్ట్రం శ్రీలంక అయిపోతోందని కూటమి నేతలు దుష్ప్రచారం చేశారని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర రెడ్డి విమర్శించారు. ఒకసారి 10 లక్షల కోట్లు అని, మరోసారి 15 లక్షల కోట్లని నోటికొచ్చినట్టు చంద్రబాబు అండ్ కో మాట్లాడారని అయితే కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంలోనే 30% అప్పులు చేశారని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు.మా హయాంలో 13% అప్పులు చేస్తే చంద్రబాబు హయాంలో 27% అప్పులు చేశారని బుగ్గన విమర్శించారు. మరి అప్పుడు మాట్లాడిన వారంతా ఇప్పుడు ఏమయ్యారు?, చేసిన అప్పులన్నీ ఏమవుతున్నాయి?, పోలవరం నిర్మాణానికి వచ్చిన రూ.5,052 కోట్లు ఏం చేశారు?, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైఎస్ఆర్, వైఎస్ జగన్ ఎంతో కృషి చేశారు. పర్యావరణ అనుమతులు సహా అనేక క్లియరెన్సులు మా ప్రభుత్వంలోనే తెచ్చామని కానీ చంద్రబాబు మాత్రం ఆ క్రెడిట్ తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని బుగ్గన ఆరోపించారు.

# అనధికార ప్రెస్, పోలీసు స్టిక్కర్లపై పోలీసుల కొరడా

తిరుపతిజిల్లా వ్యాప్తంగా పోలీసులు అనధికారికంగా ప్రెస్, పోలీసు స్టిక్కర్ వేసుకున్న వాహనదారుల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

అనధికారికంగా కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్ వేసుకుంటే అలాంటి వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చింరారు.అనధికారికంగా ప్రెస్, పోలీసు స్టిక్కర్లు వేసుకున్న ప్రెస్ 2 వాహనాలు, పోలీసు 9 మంది వాహనదారులకు మొదటి తప్పు గా పరిగణలోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు.తిరుపతి జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై ప్రెస్, పోలీస్ అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. ప్రెస్, పోలీస్ విధులతో సంబంధం లేనివారు వాహనాలపై స్టిక్కర్లను అతికించుకోవడం చట్టపరపరంగా నేరం. ఇక నుండి ఎవరైన ప్రెస్, పోలీసు స్టిక్కర్స్ గుర్తింపు కార్డులు లేకుండా వేసుకుని తిరిగే అలాంటి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు వారు నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు.

# రాజధాని నిర్మాణానికి బంగారు గాజులు విరాళం

అమరావతిఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి మంగళవారం ఇద్దరు మహిళలు విరాళం ఇచ్చారు. తెనాలికి చెందిన నన్నపనేని ఉదయలక్ష్మి 36 గ్రాముల 546 మిల్లీగ్రాముల బంగారు గాజులతో పాటు రూ.1 లక్ష చెక్కును విరాళంగా సీఎం చంద్రబాబుకు అందించారు. అదేవిధంగా విజయవాడకు చెందిన వెలగపూడి చంద్రావతి రూ.50 వేల విరాళం ఇచ్చారు. వృద్ధులైన ఆ ఇద్దరు మహిళలు రాష్ట్రానికి మంచి రాజధాని ఉండాలని ఆకాంక్షతో విరాళం ఇవ్వడం గొప్ప విషయమని సీఎం అభినందించారు.

# రాయదుర్గంలోని ఓయో హోటల్లో యువతి ఆత్మహత్య

హైదరాబాద్రాయదుర్గంలోని ఓయో హోటల్లో యువతి ఆత్మహత్య ఆత్మహత్య చేసుకుంది. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనూష (26) బ్యూటిషన్ గా పనిచేస్తూ నల్లగండ్లలో ఉంటుంది. భర్తతో విభేదాల కారణంగా విడిపోయి తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది. ఈనెల 22వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు స్నేహితుల వద్దకు వెళుతున్నాను అని చెప్పి ఇంట్లో నుండి వెళ్లింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్ఉలు ఫోన్ చేసిన అనూష స్పందించలేదు. రాయదుర్గంలోని క్యాబిన్ ఓయూ లాడ్జ్ లో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఓయో లాడ్జ్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అనూష ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అనూష ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు.

# వరంగల్ కాంగ్రెస్ లో ఆగని మంటలు

వరంగల్ జూన్ 25,

ఓరుగల్లు కాంగ్రెస్ లొల్లి నెక్స్ట్ లెవల్‌కు చేరింది. ఏ స్థాయికి అంటే పార్టీలో ఉంటే కొండా దంపతులన్నా ఉండాలి. లేకపోతే మేమైనా ఉండాలన్నట్లుగా పట్టుబడుతున్నారట ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. కొండా సురేఖ దంపతుల ఆధిపత్యాన్ని కంట్రోల్ చేయకపోతే తాము పార్టీలో ఉండలేమని తేల్చి చెప్పారట. పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసిన నేతలు..కొండా దంపతులు కావాలో లేక తాము కావాలో తేల్చాలని కోరారట.ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, నాగరాజు, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి గంపగుత్తగా..మీనాక్షికి ఫిర్యాదు చేశారట. కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తలదూరుస్తూ, అడ్డగోలుగా మాట్లాడుతూ వివాదాలు సృష్టిస్తున్నారని కంప్లైంట్ ఇచ్చారట. కొండా దంపతులతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా..రాతపూర్వకంగా రాసిచ్చారటఆ తర్వాత వరంగల్ కాంగ్రెస్ పంచాయితీపై పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లురవితో డిస్కస్ చేశారట మీనాక్షి. వరంగల్ నేతల మధ్య విభేదాలపై విచారణ జరిపి రిపోర్ట్ ఇవ్వాలని సూచించారట. వరంగల్‌కే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో నేతల మధ్య ఎక్కువగా విభేదాలున్నాయనే అంశంపైనా ఆమె వివరాలు అడిగినట్లు తెలుస్తోందివరంగల్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీతో పాటు పలువురు నేతలు మీనాక్షి నటరాజన్‌కు, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లురవికి తమపై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో..తగిన సమాధానం ఇచ్చేందుకు కొండా దంపతులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తనపై ఎమ్మెల్యేలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెవిలో వేసినట్లు సమాచారం. అవసరమైతే మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసే యోచనలో ఉన్నారట కొండా దంపతులు.పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లురవికి కూడా లిఖిత పూర్వకంగా తమ వెర్షన్ తెలియజేసేందుకు రెడీ అవుతున్నారట. లేటెస్ట్ ఇష్యూకు సంబంధించి కొండా దంపతులు..పార్టీలోని సీనియర్ లీడర్లతో టచ్‌లో ఉన్నట్లు టాక్. కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేతలు..తమ సాయంతో ఎమ్మెల్యేలుగా గెలిచి తమపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని పార్టీలోకి కీలక నేతలకు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇస్తున్నారట కొండా దంపతులు. సేమ్‌టైమ్ కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పిస్తే..ఆ స్థానంలో జిల్లా నుంచి సీనియర్లలో ఎవరో ఒకరికి అవకాశం వస్తుందని కుట్ర చేస్తున్నారని కూడా కొండా దంపతులు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లబోతున్నారట.గతంలో టీడీపీలో పని చేసి..ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా కంటిన్యూ అవుతున్న వారంతా టీమ్‌గా ఏర్పడి తమపై కుట్ర చేస్తున్నారనేది కొండా దంపతుల వాదన. సీఎం కోటరీతో కలిసి కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేస్తున్న మంత్రాంగమంతా తమకు తెలుసని అంటున్నారట. ఈ విషయాలను ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు లాంటి నేతలకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారట కొండా దంపతులు. ముందు నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్లతో సంప్రదింపులు జరుపుతూనే..పార్టీ అధిష్టానం పెద్దల దగ్గర తమ వాదనను బలంగా వినిపించేందుకు రెడీ అవుతున్నారట. కొండా వర్సెస్ ఎమ్మెల్యేల ఇష్యూలో ఎవరు పైచేయి సాధించబోతున్నారు? ఈ పంచాయితీని కాంగ్రెస్ పెద్దలు ఎలా తెంచబోతున్నారో చూడాలి.

# గుడివాడ ఎమ్మెల్యే రాముకు మంత్రి లోకేష్ ఆత్మీయ పలకరింపు

మచిలీపట్నం

మచిలీపట్నం పర్యటనకు వెళ్తున్న నారా లోకేష్ కు నిమ్మకూరులో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము,వర్ల కుమార్ రాజా, తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ స్వగృహం నిమ్మకూరులో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తో కలిసి, పుష్పగుచ్చాలు అందిస్తూ లోకేష్ కు ఎమ్మెల్యే రాము స్వాగతం పలికారు. గజ మాలలతో సత్కరించారు. నిమ్మకూరు ఆడపడుచులు మంగళ హారతులిచచారు. అందరూ బాగున్నారా అంటూ నిమ్మకూరు గ్రామస్తులు, టిడిపి శ్రేణులను లోకేష్ కుశల ప్రశ్నలడిగారు. చెయ్యి పట్టుకుంటూ, భుజం తడుతూ ఎమ్మెల్యే రాము, కుమార్ రాజా, నిమ్మకూరు గ్రామస్తులను ఆత్మీయంగా పలకరించారు. లోకేష్ వెంట ర్యాలీగా మచిలీపట్నం ఎమ్మెల్యేలు తెలుగు తమ్ముళు తరలివెళ్లారు.

# అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు: మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు

## నగరంలో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), జూన్ 25:అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో టి.యు.ఎఫ్. ఐ.డి.సి. నిధులు 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో అవసరమైన విద్యుత్ లైన్లు వేసేందుకు నిధులు చెల్లించామని, స్థానిక అధికారులు దగ్గరుండి సరిగ్గా పని చేయించుకోవాలని అన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. 6వ డివిజన్ లో ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులు వానలు రాకముందే పూర్తి చేయాలని, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ అన్ని డివిజన్ లలో అమలు చేయాలని, వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లో అధిక శ్రద్దతో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. నగరంలో పెండింగ్ అంతర్గత రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వర్షాకాలం ముగిసిన తర్వాత వాటిని మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.డివిజన్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచడం బాధ్యతగా చేయాలని, ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకొని పోకుండా చూడాలని, ప్రైవేట్ ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్, గ్రౌండ్ లెవెలింగ్ వంటి పనులు చేపట్టాలని భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ డివిజన్ లో అంతర్గత రోడ్లు, డ్రైయిన్ నాణ్యతతో నిర్మించుకోవాలని అన్నారు. మన ఇంటి ముందు చెత్త వేయవద్దని, కార్పోరేషన్ అధికారులకు సహకరించాలని అన్నారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు తమ వంతు బాధ్యత నెరవేర్చాలని అన్నారు.నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ 580 మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు 50 లక్షల రూపాయలతో నేడు శంకుస్థాపన చేశామని అన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రోడ్డు విస్తరణ పనులు, పేయింటింగ్ పనులు, పారిశుధ్య నిర్వహణ కోసం నూతన వాహనాలను కొనుగోలు చేశామని అన్నారు. నగరంలో ప్రజలకు ప్రాథమిక వసతుల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, పబ్లిక్ హెల్త్ ఇఇ వి.రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం. ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ సైదులు, కార్పొరేటర్ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# షాపుర్‌నగర్ మహిళ హత్య కేసులో నిందితుల అరెస్టు



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25:సైబరాబాద్ షాపుర్‌నగర్‌లోని న్యూ ఎల్‌బి నగర్‌లో నివసిస్తున్న 39 ఏళ్ల శ్రీమతి సట్ల అంజలి హత్యకు పాల్పడిన నిందితులను జీడిమెట్ల పోలీసులు విజయవంతంగా గుర్తించి పట్టుకున్నారు. ఈ నేరాన్ని ఆమె సొంత కుమార్తె, చట్ట విరుద్ధ బాలుడు (సిసిఎల్)-1, ఆమె ప్రియుడు ఎ-1: పగిల్లా శివ కుమార్ మరియు మరొక సిసిఎల్-2 బాలుడితో కలిసి కుట్ర పన్ని అమలు చేసింది. పోలీసులు ఈ కేసును సమగ్ర దర్యాప్తు మరియు వేగవంతమైన చర్యతో ఛేదించారు, ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేశారు.కేసు వివరాలు:24-06-2025న మధ్యాహ్నం 01:55 గంటలకు, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కొంపల్లి, గుండ్లపోచంపల్లికి చెందిన శ్రీమతి తంగెల్లపల్లి శోభ, తన చెల్లెలు శ్రీమతి సట్ల అంజలి, షాపూర్‌నగర్‌లోని న్యూ ఎల్‌బి నగర్‌లోని తన నివాసంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని ఫిర్యాదు చేశారు. ఆమె శరీరం వంటగదిలో వెక్కిరిసిన స్థితిలో పడి ఉందని, మెడ చుట్టూ లిగేచర్ గుర్తులు ఉన్నాయని, ఇది గొంతు కోసినట్లు సూచిస్తుంది.మృతుడి చిన్న కుమార్తెతో ప్రాథమిక విచారణలో వాస్తవాలు వెల్లడయ్యాయి, మృతుడి పెద్ద కుమార్తె (సిసిఎల్-1), 16 సంవత్సరాలు, ఎ -1: ??పగిల్లా శివ కుమార్ (డీజే ఆపరేటర్) తో సంబంధం కలిగి ఉంది, దీనిని మృతుడు వ్యతిరేకించాడు. దీని ఫలితంగా తరచుగా గొడవలు మరియు హెచ్చరికలు జరిగాయి, ఫలితంగా బాలుడు ఎ -1 మరియు సిసిఎల్-2 లతో కలిసి తన తల్లిని చంపడానికి కుట్ర పన్నాడు.23-06-2025 సాయంత్రం, సిసిఎల్ -1 వ్యూహాత్మకంగా తన చెల్లెలిని బయటకు పంపించి, ఎ -1 మరియు సిసిఎల్-2 లను ఇంట్లోకి పిలిపించింది. నిందితుడు తెల్లటి నైలాన్ చున్నీని ఉపయోగించి మృతుడి గొంతు కోసి చంపి, మరణాన్ని నిర్ధారించేందుకు తలకు గాయం చేశాడు. హత్య తర్వాత సి సి ఎల్ -1, ఇంటికి తాళం వేసి, ఆమె చెల్లెలిని మాట్లాడవద్దని హెచ్చరించింది. అయితే, ఆ చిన్నారి ఫిర్యాదుదారు అయిన తన అత్తకు సమాచారం అందించడంతో నేరం బయటపడింది.విశ్వసనీయ సమాచారం మరియు ఇన్‌స్పెక్టర్ జీడిమెట్ల జి. మల్లేష్ నేతృత్వంలోని పోలీసు బృందం చేసిన నిరంతర ప్రయత్నాల ఆధారంగా, నిందితులను గుర్తించి 24-06-2025న అరెస్టు చేశారు. విచారణ సమయంలో, వారు ఈ దారుణమైన చర్యలో తమ పాత్రలను అంగీకరించారు. జ్యుడీషియల్ కస్టడీకి పంపడానికి నిందితులను సమర్థ అధికారుల ముందు హాజరుపరిచారు.

అరెస్టు చేయబడిన నిందితుల వివరాలు:

1. ఎ -1: ??పగిళ్ల శివ కుమార్ అలియాస్ శివ, వయస్సు 19 సంవత్సరాలు, నివాసం. నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థి.
2. సి సి ఎల్ -1: బాధితురాలు/మరణించిన కుమార్తె.
3. సి సి ఎల్ -2: ఎ 1-బ్రదర్.బాధితురాలు తన కుమార్తె సంబంధానికి వ్యతిరేకత వ్యక్తం చేయడం వల్లే ఈ హత్య ముందస్తు ప్రణాళికతో జరిగిందని, ప్రేరేపించబడిందని దర్యాప్తులో తేలింది. బాలానగర్ డివిజన్‌కు చెందిన క్లూస్ టీం నేరం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. ఫోరెన్సిక్ నమూనాలను సేకరించి, నేర దృశ్యాన్ని ఛాయాచిత్రాల ద్వారా నమోదు చేసింది. శవపరీక్ష కోసం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు, ఇది గొంతు కోసి చంపడం వల్ల మరణించినట్లు నిర్ధారించింది.

బాలానగర్ డిసిపి కె. సురేష్ కుమార్, ఐపిఎస్., ప్రత్యక్ష పర్యవేక్షణలో మరియు వీరి నిరంతర ప్రయత్నాలతో ఈ కేసును గుర్తించారు:

నరేష్ రెడ్డి, బాలానగర్ డివిజన్ ఏసీపీ,జి. మల్లేష్, పోలీస్ ఇన్స్పెక్టర్, జీడిమెట్ల పిఎస్,ఎస్.కనకయ్య, డీఐ, జీడిమెట్ల పీఎస్. కె. నాయుడు ఎం. సత్యనారాయణ ఎస్ ఐ, జీడిమెట్ల పి ఎస్. కానిస్టేబుళ్లు నరేష్, రవి నాయక్, వెంకటేష్, జీడిమెట్ల పి.ఎస్.ఈ అధికారులు మరియు సిబ్బంది కీలకమైన ఆధారాలను సేకరించడం, డిజిటల్ ఆధారాలను విశ్లేషించడం మరియు ఒప్పుకోలు రాబట్టడం ద్వారా ఆదర్శప్రాయమైన దర్యాప్తు నైపుణ్యాలను ప్రదర్శించారు, తద్వారా హత్యను గంటల్లోనే ఛేదించి, తదుపరి పరిణామాలను నిరోధించారని బాలానగర్ జోన్ డిసిపి కె. సురేష్ కుమార్, ఐపిఎస్ తెలిపారు.

# రిపోర్టర్ పై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండించిన బిఆర్ఎస్ మాజీ జడ్పీ చైర్పర్సన్ బడే నాగజ్యోతి



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 25 (భారత శక్తి) : ఇందిరమ్మ ఇండ్ల మంజూరిలో అవకతవకల గురించి ఆంధ్రజ్యోతి పత్రికలో వార్త రాసినందుకు కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీకాంత్ పై దాడి చేయడం జరిగిందని ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బడే నాగజ్యోతి అన్నారు.అధికారంలో ఉండి ప్రతిపక్షాలను గొంతు నొక్కాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకులు, సమాజంలో జరుగుతున్న అవకతవకలను, లోపాలను వెలికి తీసే జర్నలిస్టులపై సైతం దాడులు చేయడం హేయమైన చర్యఅని మండిపడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోవు రోజులలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. విధి నిర్వహణలో ఉండే జర్నలిస్టులపై దాడులు చేయడం అప్రజాస్వామ్యక చర్య అని దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. సమాజంలో ఎవరు తప్పు చేసినా పొరపాట్లు చేసిన పత్రికలలో రాసే బాధ్యత ఉంటుందని అన్నారు. ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని, దాడి చేసిన కాంగ్రెస్ నాయకులు అరెస్టు చేయాలని, ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులకే స్వేచ్ఛ లేకపోతే మరెవరికి స్వేచ్ఛ ఉంటుందని అన్నారు.

# అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉంచాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## -మైనింగ్ శాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), జూన్ 25:జిల్లాలో అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉంచాలని, ఎక్కడా కొరత రావడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లో బుధవారం మైనింగ్, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి, ప్రాధాన్యత కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో ఇసుక కొరతరాకుండా టిజిఎండిసి చూసుకోవాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన ఇసుక వివరాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు టి.జి.ఎం.డి.సి. కు అందించాలని, నేరుగా వర్క్ సైట్ వద్ద అవసరమైన మేర ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు.టి.జి.ఎం.డి.సి. ఖమ్మం క్రొత్త బస్టాండ్ దగ్గర డిగ్రీ కళాశాల ఎదురుగా సాండ్ బజార్ ఏర్పాటు చేసిందని, అదే రీతిలో డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు మధిర మార్కెట్ యార్డు, పాలేరు తహసిల్దార్, కూసుమంచి ఎంపిడిఓ కార్యాలయం, సత్తుపల్లి మార్కెట్ యార్డు వద్ద సాండ్ బజార్ల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సాండ్ బజార్ ల నిర్వహణ స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించడం వల్ల, నెలలో ఇసుక అమ్మకం ఎంత, నెలకు ఎంత ఆదాయం వారికి సమకూరుతుందో నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు నిబంధనల ప్రకారం జీరో పర్మిట్ విధానం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు ఈ సమావేశంలో మైన్స్ ఏడి సాయినాథ్, టిజిఎడిసి పీవో జి. శంకర్ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇ వాణిశ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బొల్లి మచ్చలు” అంటు వ్యాధి కాదు !



కడప, జూన్ 25(భారత శక్తి): బొల్లి మచ్చలు అనేవి ఒకరినుండి ఒకరికి సంక్రమించే అంటూ వ్యాధి కాదని జిజిహెచ్ (రిమ్స్) డెర్మటాలజి విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు.ప్రపంచ విటిలిగో డే (బొల్లి మచ్చ దినోత్సవం) సందర్భంగా బుధవారం కడప జిజిహెచ్ లోని చర్మ వ్యాధుల (డెర్మటాలజీ) విభాగంలో సంబంధిత హెచ్.ఓ.డి. డా. పెంచలయ్య ఆధ్వర్యంలో.. బొల్లి మచ్చలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొల్లి మచ్చలు అనేవి ఒకరినుండి ఇంకొకరికి సంక్రమించే జబ్బు కాదని, వంశపారపర్యంగా కూడా వచ్చే వ్యాధి రాదని, వివాహానికి బొల్లి వ్యాధి ఎలాంటి అడ్డుకాదని వివరించారు. బొల్లి మచ్చల వలన ఒక వ్యక్తి శారీరక, మానసిక సౌరర్థ్యంపై ఎలాంటి ప్రభావం ఉంటోబోదన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే చర్మవ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. కావట్టి తెల్ల మచ్చలు, బొల్లితో ఉన్న వారి పట్ల వివక్షతను చూపకుండా.. సమాజంలో అందరితో సమానంగా ఆధరించాలన్నారు. వారిని అందరితో కలివిడిగా ఉండేలా మానసిక ధైర్యాన్నిచ్చి చికిత్స చేయించేందుకు సహకరించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో డెర్మటాలజీ విభాగం వైద్యులు డా. సుభాషిణి, డా. నరోత్తమరెడ్డి, డా. విజయ కుమారి, డా.షాలిని, పిజి వైద్యులు, మిగతా వైదులు తదితరులు పాల్గొని ప్రజాల్లో అవగాహన పెంపొందించారు.

# విలేకరి పై కత్తితో కాంగ్రెస్ నాయకులు హత్యాయత్నం

## - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్ రెడ్డి



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 25 (భారత శక్తి): ములుగు జిల్లా తాడ్వాయి మండల విలేకరి చల్లకొండ శ్రీకాంత్ రెడ్డి పై కత్తితో కొందరు కాంగ్రెస్ నాయకులు హత్యాయత్నం చేశారు. ‘ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరిగా యని వార్తలు రాస్తావా.. ఎంత ధైర్యం నీకు ?’ అంటూ తమ కారులోకి లాగి దుర్భాషలాడుతూ పిడిగుద్దులు కురిపించారు. ఆపై కత్తి తో పొడిచేందుకు యత్నించారు. వారి నుంచి తప్పించుకున్న శ్రీకాంత్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ములుగు జిల్లా నార్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి వార్తల సేకరణ సాయంత్రం తిరిగి వస్తూ.. కొమురం సారమ్మ గుడి దాటిన తర్వాత ఓ చోట ఆగి ఫోన్ మాట్లాడుతున్నాడు. కారులో అక్కడికి వచ్చిన ములుగు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి తాండాల శ్రీనివాస్, నార్లాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మొక్క శ్రీనివాస్, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కమిటీ సభ్యులు బొప్ప వినోద్, ఎనగంటి సాయికృష్ణ, పార్టీ కార్యకర్త శంకె శ్రావణ్ దాడికి దిగారు. శ్రీకాంత్రెడ్డిని తమ కారులోకి లాగి పిడిగుద్దులు కురిపిస్తూ.. కాళ్లతో తన్ని కత్తితో పొడిచేందుకు యత్నించారు.

గట్టిగా అరుస్తూ వారిని వదిలించుకుని బయటికొచ్చిన శ్రీకాంత్రెడ్డి రోడ్డు పైకి పరుగెత్తగా.. అటుగా వచ్చేవారిని చూసి కాంగ్రెస్ నేతలు పరార య్యారు. ఈ దాడిలో గాయపడిన శ్రీకాంత్ రెడ్డి ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ ప్రాంత వాసురాలైన గ్రామీణ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బాధ్యులపై కఠిన చర్య తీసుకోకపోతే జర్నలిస్టులు పరిణామం వేరే విధంగా ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటివరకు ములుగు నియోజకవర్గం అయినప్పటికీ తదనంతరం జిల్లా ఏర్పాటు అయినప్పటినుండి ఇప్పటివరకు జర్నలిస్టులపై ఎలాంటి దాడులు జరగలేదని, మొదటిసారిగా ఒక విప్లవ ఉద్యమారాలు సీతక్క అన్ని తెలిసినప్పటికీ ఇలాంటి సంఘటనలు జరగడం ఇదే మొదటిసారి. ఇలాంటి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మంత్రి సీతక్కపై బాధ్యత ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.శ్రీకాంత్ రెడ్డి పై జరిగిన దాడికి నిరసనగా జర్నలిస్టులు యూనియన్లకు అతీతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

# జూన్ 26 న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,వాల్ పోస్టర్స్ విడుదల

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 25: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా గురించి ఆశిష్ సంగ్వాన్ బుధవారం కలెక్టరేట్ లో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గురువారం 26 వ తేదీ ఉదయం 9:30 గంటలకు జిల్లా కేంద్రంలోని సిఎస్ఐ చర్చ్ నుండి కళాభారతి వరకు ర్యాలీ గా వెల్లి అక్కడ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువత పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఎక్సైజ్ సూపరిండెంట్ హనుమంతరావు పాల్గొన్నారు.



# బోనకల్ షైన్ హై స్కూల్ నందు మాదక ద్రవ్యాల పై పోలీస్ వారి ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు: పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ పోదిలి వెంకన్న



ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి ), జూన్ 25:మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలని, ఇందులో విద్యార్థుల పాత్ర ఎంతయినా ఉందని బోనకల్ ఎస్సై పి. వెంకన్న పిలుపునిచ్చారు. అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని బోనకల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో స్థానిక షైన్ హై స్కూల్ లో మంగళవారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేసారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల వ్యక్తిగతం గా మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం దేశం కూడా చాలా నష్టాన్ని పొందుతుందని చెప్పారు.కరెస్పాండంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ పిల్లలు అందరు నైతిక విలువలు కలిగి ఉండాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికాకూడదు అని చెప్పారు. ఈ కార్యక్రమం లో షైన్ హై స్కూల్ విద్యార్థులు డ్రాయింగ్ కాంపిటీషన్ లో పోస్టర్లను తయారు చేసి అందరిని అశ్చర్య పరిచారు. ఈ కార్యక్రమం లో బోనకల్ పోదిలి వెంకన్న ,పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా, డైరెక్టర్ లాల్ మియా, ప్రిన్సిపాల్ శ్వేత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ, పాఠాలు బోధించాలి:జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



వేములవాడ, జూన్ 25 ( భారత శక్తి ): అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు.


పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో తరగతులను పరిశీలించారు. స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు విధులకు హాజరు కాకపోవడంతో పరిశీలించి, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.

# కాంగ్రెస్ నాయకుడి పైనా చర్యలు తీసుకోవాలి:బిఆర్ఎస్ నాయకుల డిమాండ్



మందమర్రి, జూన్ 25 (భారత శక్తి):మందమర్రి లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో  ఏర్పాటు చేసినా పాత్రికేయుల సమావేశం లో ఇటీవల పాత్రికేయుని పైన అనుచిత వాక్యాలు చేసిన కాంగ్రెస్ నాయకుడు పైడిమల్ల నర్సింగ్ బేషరతుగా క్షమాపణ లు చెప్పాలని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జె. రవీందర్ ఆరోపించారు.ప్రజలకి రాజకీయ నాయకుల మధ్యలో వారధి గా వ్యవహరిస్తున విలేఖరులకి రక్షణ లేకుంటే సామాన్యుడి పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. మందమర్రి లోని జర్నలిస్ట్ లు అందరూ కలిసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం అన్నారు . పోలీస్ వ్యవస్థ పైన మాకు నమ్మకం ఉంది అధికారం లో ఉన్న నాయకుల కోసం కాకుండా ప్రజల గురించి వారి సమస్యల పైన విధులు నిర్వహించాలని కోరారు . ఇప్పటికైనా చెన్నూరు ఎమ్మెల్యే కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి వివేక్ స్పందించి తక్షణమే కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిబిజికెస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ సీనియర్ నాయకులు ఓ.రాజశేఖర్,మద్ది శంకర్ ,ఎండీ అబ్బాస్, బండారి సూరిబాబు, మల్లేష్, తోట సురేందర్,కనకం రవీందర్, అందే శ్రీకాంత్,ఎం.డి ముస్తఫా ముల్కల్ల రమేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అత్యాచార పర్వం ఎమర్జెన్సీ



న్యూఢిల్లీ, ప్రత్యేక ప్రతినిధి, జూన్ 25:ఎమర్జెన్సీ అంటే ఇరవై ఒక్క మాసాల నిర్బంధం మాత్రమే కాదు, నిర్బంధపు పిడికిలిలో కొన్ని తరాలవరకూ వినిపించే మనోరోదన ఉంది. అత్యాచారాలకి ఎమర్జెన్సీ కేరాఫ్ అయిందంటే అతిశయోక్తి కాబోదు. అత్యవసర పరిస్థితి అంటే %-% అక్షరాలా పోలీసు రాజ్యమే. మీసా, డీఐఆర్‌ల కింద లక్షమందిని అరెస్టు చేశారు. 25,000 మంది కేవలం ప్రభుత్యోద్యోగులకే బలవంతంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిపించారు. ఎంపీ, యు.పి, ఢిల్లీ, పంజాబ్, హరియాణా, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో పోలీస్ లాకప్‌లు నాజీల క్యాంప్‌లుగా మారిపోయాయి. ఒక్క ఆంధ్రలోనే వేయిమంది పోలీసుల చేతిలో జీవితాంతం గుర్తుండే చేదు అనుభవాలు చవిచూశారు. ఇవన్నీ బయటకు తెలిసినా పత్రికలు ప్రచురించే అవకాశం లేకపో యింది. కొన్ని 'క్రమశిక్షణ' ఇనపతెర వెనకే ఉ ండి పోయాయి. 1977 జనవరిలో సెన్సార్‌షిప్ ఎత్తివేసిన తరువాత ఒక్కొక్కటీ దారుణాలు వెలుగు చూశాయి. మొదట ఒక తెలుగు దినపత్రిక భారతదేశంలో పరిస్థితి గురించి ఆమ్నెస్టీ తయారుచేసిన నివేదికను ప్రచురించింది. 1977 మార్చి1న జనతా పార్టీ ప్రచురించిన ఒక పత్రాన్ని పత్రికలు ప్రధానంగా ప్రచురించాయి. ఎమర్జెన్సీ నీడలో జరిగిన ఘాతుకాలు అందులో జనతాపార్టీ వివరించింది. తరువాత క్రమంగా టర్క్‌మన్ గేట్ (ఢిల్లీ) ఉదంతం, స్నేహలత, లారెన్స్ (కర్ణాటక) నిర్బంధం, రాజన్ అదృశ్యం (కేరళ) ఒక్కొక్కటీ వెలుగులోకి వచ్చాయి. ఎమర్జెన్సీలో అరెస్టయిన ప్రముఖ జర్నలిస్టు జి.కె.రెడ్డి వ్రాసిన "ఈ అత్యాచారాలను క్షమించగలమా?" అనే వ్యాసం పాఠకులను కదిలించి వేసింది.ఢిల్లీ అందాల కోసం అక్కడి మురికివాడ టర్క్‌మన్ గేట్ ప్రాంతాన్ని అతి దారుణంగా ప్రభుత్వం తొలగించింది. 1976 ఏప్రిల్‌లో జరిగిన ఈ సంఘటనలో ఆఖరికి పోలీసు కాల్పులలో మరణిం చిన వారి సంగతిని కూడా ప్రభుత్వం సెన్సార్ చేసింది. బలవంతంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయబోయిన అధికారులపై మూకుమ్మడిగా ప్రజలు తిరగబడడం, పోలీసులు కాల్పులు జరపడం వంటి సంఘటనలు ఉత్తరప్రదేశ్‌లో జరిగాయి. కాని, వార్త ఏదీ ప్రచురణకు నోచుకోలేదు.సంస్కార చిత్రంతో జాతీయ ఖ్యాతి గాంచిన నటి స్నేహలతారెడ్డిని 1976 మే 1న పోలీసులు తీసుకువెళ్లారు. 1977 జనవరిలో విడిచిపెట్టారు. జైలు నుంచి వచ్చిన కొన్ని రోజులకు ఆమె కన్ను మూసింది. కార్మిక నేత జార్జి ఫెర్నాండెజ్ ఆచూకీ ఆమెకు తెలిసి ఉంటుందని పోలీసుల అనుమానం అంతే. లారెన్స్ ఫెర్నాండెజ్ ఉదంతం ఇంకో విషాదం. జార్జి ఫెర్నాండెజ్ తమ్ముడైనందుకు ఆయన జీవితాంతం జీవచ్ఛవంలా బతకవలసిన స్థాయిలో చిత్రహింసలకు గురయ్యాడు. కేరళలో రాజన్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. అయితే రాజన్ తండ్రి ప్రొఫెసర్ వారియర్ వేసిన కేసుతో డొంకంతా కదిలింది. రాజన్‌ను లాకప్‌లో చంపేసిన పోలీసులు అతడి శవం కనిపించకుండా చేశారు. దీనిపై కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కరుణాకరన్ ప్రభుత్వం రాజీనామా చేసింది.సంజయ్‌గాంధీ ఇందిర రెండవ కుమారుడు. రాజ్యాంగేతర శక్తి అన్న పదానికి మూలపురుషుడు ఇతడేనన్న నమ్మకం ఉండేది. ఇతడు దేశం మీదకు తెచ్చినదే కుటుంబ నియంత్రణ ఉద్యమం (నాస్‌బంది). ఇందిర 20 సూత్రాల ఆర్థిక ప్రణాళిక పేరుతో అత్యాచారాల మీద ముసుగు వేస్తే, సంజయ్ గాంధీ నాలుగు సూత్రాల పథకంతో నేరుగానే ఘోర సంక్షోభానికి కారకుడయ్యాడు. దీనికి ప్రధాని కార్యాలయ ఆమోదం ఉంది గాని, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు సంబంధం లేకుండానే జరిగింది. ఢిల్లీలో మొదలయిన ఈ దుశ్చర్యను తరువాత దేశ వ్యాప్తంగా అమలు చేశారు. జ్ఞానపీఠ్ గ్రహీత మహాశ్వేతదేవి కథ 'మకర సవర' గిరిజన సమాజంలో బలవంతపు కుటుంబ నియంత్రణ ఎంతటి విధ్వంసానికి దారి తీసిందో చెబుతుంది.ఎనభయ్ సంవత్సరాల వృద్ధులు మొదలుకొని పదిహేనేళ్ల బాలురను సైతం పోలీసులు, ఆరోగ్య కార్యకర్తలు విడిచిపెట్టలేదు. ఈ అంశంపై 'విశా లాంధ్ర' ఫిబ్రవరి 10, 1977న రాసిన సంపాద కీయం ఒళ్లు గగుర్పొడిచే రీతిలో సాగింది. గుంటూరులో 42మంది మగపిల్లలకు బలవంతంగా శస్త్ర చికిత్స జరిపారని, అందులో 15 సంవత్సరాల రత్నాకరం అనే బాలుడు ఖమ్మంలోని తన తల్లిదండ్రు లకు సంగతి తెలియజేయడంతో అక్కడ కేసు నమోద యింది. ఈ వార్తను కూడా ఆ పత్రిక ప్రచురించింది.నిజానికి అది బలవంతపు కుటుంబ నియంత్రణ. ఒక కోటి పదకొండు లక్షల మందికి(ఇండియా టుడే, అక్టోబర్ 25, 2024. డిసెంబర్ 9, 2021 హిందుస్తాన్ టైమ్స్ కూడా ఈ విషయం వెల్లడిరచింది) ఆ పేరుతో శస్త్ర చికిత్సలు చేసినప్పటికీ అసలు ఆ పథకానికి అధికార ముద్ర లేనేలేదు. ఎమర్జెన్సీపై నియమించిన షా కమిషన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. చిత్రం ఏమిటంటే నాజీలు నాలుగు న్నర లక్షల మందికి మాత్రమే కు.ని, ఆపరేషన్‌లు నిర్వహించారు. కు.ని. శస్త్ర చికిత్సలు పేరుతో జరిగిన ఈ అకృత్యంలో సంజయ్, ఇందిర, రాష్ట్రాల నాటి ముఖ్యమంత్రులు కూడా భాగస్వాములే. శస్త్ర చికిత్సలకు దూరంగా ఉంటే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు జీతాలలో కోత విధించాయి. పొలాలకు నీటిని నిలిపివేశాయి. ఉద్యోగులకు శస్త్రచికిత్సల లక్ష్యాలు నిర్దేశించి, దానికి చేరకుంటే ఉద్యోగాలు ఊడిపోతాయని కూడా చెప్పేశారు. ప్రభుత్వ బారిన పడకుండా తప్పించుకున్న వారి ఇళ్ల మీద అర్ధరాత్రి దాడులు చేసి, ఈడ్చుకు వెళ్లారు. ఇలాంటి ఆపరేషన్‌ల కారణంగా కొందరు చనిపోయారు కూడా. డబ్బు సరే, కొన్ని చోట్ల స్థలాలు కూడా ఇస్తామని ప్రమాణం చేసి శస్త్ర చికిత్సలు చేశారు. కొందరు ప్రభుత్వో ద్యోగులు పైవారి మెప్పు కోసం కోయించుకున్నారు. జూలై 20, 1976న ఢిల్లీ పోలీసు శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం 1100 మంది వారి సిబ్బంది స్వచ్ఛందంగా శస్త్ర చికిత్సలు చేయించు కున్నారు. ఆగస్ట్ 2న విడుదలైన బులెటిన్‌లో ఆ సంఖ్య 2000కి చేరింది. ఫలితం %-% జాతీయ జనాభా విధానం 2000లో అధిక సంతానం అవసరమన్న వాదన చేర్చవలసి వచ్చింది. 1960-70 మధ్య కొన్ని పాశ్చాత్య దేశాలు జనాభా పెరిగితే ఆహార సమస్య ఎదురవుతుందనే పిచ్చి వాదనకు లొంగిపోయి బలవంతపు కుటుంబ నియంత్రణను అమలులోకి తెచ్చారు. ఆయా దేశాలలో బలవంతంగా శస్త్ర చికిత్సలు చేశారు. దాంతో జనాభా సమీకరణలలో తీవ్రమైన అంతరాలు వస్తాయన్న ఇంగితం వారికి లేకపోయింది. నిజానికి ఆ వాదన నమ్మి భారత్ కూడా 1970లలోనే మొదలుపెట్టింది. ఇందుకు ప్రపంచ బ్యాంక్, యూఎన్ పాప్యులేషన్ ఫండ్ వంటి మార్గాల ద్వారా కోట్లాది డాలర్ల నిధులు తీసుకుంది.ఎమర్జెన్సీ కాలం నాటి అరాచకాలు జాబితా చిన్నదేమీ కాదు. అక్రమ అరెస్టులు, జైలు సరేసరి. ఆంధీ అనే సినిమాను నిషేధించారు. కిస్సా కుర్సికా అనే చిత్రం రీళ్లు ముక్కలు ముక్కలు చేసేశారు. వీటికి పరాకాష్ట మారుతీ కారు తయారు ఉ దంతం.

# కామారెడ్డి పట్టణ బీజేపీ కార్యాలయంలో బిజెపి నాయకుల సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నిక



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 25: కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో కామారెడ్డి పట్టణ బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి పట్టణ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.పట్టణ ఉ పాధ్యక్షులుగా చిన్నోళ్ల రజిని కాంత్, చిన్నోజి శ్రీనివాస్, గుణేందర్, గంగాధర్, ప్రవీణ్, విజయ్ పాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిలుగా రఘు, రాజ గోపాల్, కార్యదర్శులుగా భుమేష్ యాదవ్, ముల్కా శ్రీనివాస్, రంజిత్, గురుమూర్తి, రాజు, గోవర్ధన్, కోశాధికారిగా మల్లేష్, ఓబిసి మోర్చా అధ్యక్షులుగా ఉప్పు లక్ష్మీపతి, ఎస్సీ మోర్చ అధ్యక్షుడుగా రాజేందర్, గిరిజన మోర్చ అధ్యక్షుడుగా వినోద్, బిజెవైఎం అధ్యక్షులుగా బాలే భరత్, మహిళా మోర్చా అధ్యక్షులుగా బాలమని, కిషన్ మోర్చా అధ్యక్షులుగా రాజు, మైనారిటీ మోర్చా అధ్యక్షులుగా లతీఫ్ లను నియమిస్తున్నట్టు తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని, బీజేపీ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ, పట్టణంలో పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని అన్నారు.

# ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన చల్మెడ



వేములవాడ,జూన్ 25 (భారత శక్తి) : వేములవాడ పట్టణంలో ముద్ర కోల వెంకన్న ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ స్థానిక ఐబి గ్యాస్ గోదాం మైదానంలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా క్రీడాకారులతో మాట్లాడి టోర్నమెంట్ ను విజయవంతం చేయాలని కోరారు.అలాగే యువత క్రీడల్లో రాణించాలని అన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల్లో రాణించి వారి ప్రతిభ చాటుకోవాలన్నారు. యువతను ప్రోత్సహించి ఇలాంటి టోర్నమెంట్ ను నిర్వహిస్తున్న నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకటేశంను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం చల్మెడను నిర్వాహకులు,క్రీడాకారులు శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు.మూడు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్ లో 17వ వార్డు నుండి నాలుగు జట్లు పాల్గొంటున్నాయని, శుక్రవారం రోజున ఫైనల్ మ్యాచ్ జరుగనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్ లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందు, గోలి మహేష్,నాయకులు కొండ కనుకయ్య, అంజద్ పాషా, సందీప్, పర్వేజ్, గణేష్, రాకేష్, గోసుకుల రవి, మల్లేశం, రఫిక్ శ్రీనివాస్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు వడ్లూరి విష్ణు, మిరియాల సంతోష్, తదితరులు ఉన్నారు.

# రాజన్న కోడెలకు నిత్యం పచ్చిగడ్డి అందించేలా ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



వేములవాడ,జూన్ 25 (భారత శక్తి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలోని కోడెల దాణ కోసం పచ్చి గడ్డిని సాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గోశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా గోశాల ఆవరణ, కోడెలు, గడ్డిని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ గోశాల ఆవరణలో మట్టిని చదును చేయించాలని, నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోడెలకు నిత్యం పచ్చిగడ్డి అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేములవాడ పరిధిలోని  హనుమక్కపల్లిలో 22 ఎకరాలు, మర్రిపల్లిలో 40 ఎకరాలు, మూధపల్లిలోని 20 ఎకరాలు మొత్తం 82 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పచ్చి గడ్డి పెంపకానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డిని ఆదేశించారు.

అలాగే గోశాలలో పనిచేసేందుకు ఇటీవల నియమించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని, వారికి డ్రెస్ కోడ్ ,ఐడి కార్డ్ అందించాలని సూచించారు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై శిక్షణ అందజేయాలని, అలాగే సైలేజ్ బేరింగ్ మిషన్ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ రాజన్న ఆలయ ఇన్చార్జి ఈవో రాధాభాయ్, పశు సంవర్ధక అధికారి రవీందర్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో , జూన్ 25: స్థానికంగా గల జిజేసి భైంసా లో విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరంజని స్వయంగా పాల్గొని పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా అధ్యాపకులు భూషణ్ పాండే, సందీప్ కులకర్ణి, బాలానంద్, సతీష్, హరి ప్రసాద్, సంతోష్, రజనీకాంత్, గంగయ్య, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా ప్రతి సంవత్సరం ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం ఒక మంచి సంప్రదాయంగా మారిందని అధికారులు తెలిపారు.ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచడమే కాకుండా, వారిపై భవిష్యత్తులో ఉన్న భాద్యతను గుర్తు చేసేలా ఉ ంటాయని పాల్గొన్న ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# నేటి నుండి శ్రీ భద్రకాళి శాకంబరీ మహోత్సవములు



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూన్25:ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భక్తుల కొంగు బంగారామ్ శ్రీ భద్రకాళి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆషాడశుద్ధ ప్రతిపద్ 26వ తేదీ నుంచి ఆషాడ శుద్ధ పౌర్ణమి గురువారం జులై 10 వరకు నిరంతర ఉత్సవాలు జరగనున్నాయి. గత ఏడాది ఉత్సవాలను 16 రోజులపాటు నిర్వహించినప్పటికీ ఈ ఏడాది 15 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ ప్రధాన పూజారి శేషు,అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణ అధికారి కే. శేషు భారతి, ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ బి.శివ సుబ్రహ్మణ్యం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. చివరి రోజు పౌర్ణమి రోజున సంపూర్ణ శాఖాంబరిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వరున్నారు. ఈ క్రమంలో అమ్మవారిని ప్రకృతిలో లభించే అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు,పండ్లతో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలలో భాగంగా అమ్మవారి దర్శనం సకల కోరికలు నెరవేరుతాయి అని భక్తుల ప్రగాఢ విశ్వాసం.లిఅమ్మవారి ఆశీస్సులతోనే ఓరగల్లు శాంతియుతంలి అమ్మవారి ఆశీస్సులతోనే ఓరుగల్లు మహానగరం శాంతియుతంగా ఉందని ఆలయ ప్రధాన అర్చకులు బి. శేషు అమ్మవారి మహత్యాన్ని వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నిత్య అన్నదాన సత్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం శ్రీ భద్రకాళి ఆలయ ధర్మకర్తల మండల మండలి చైర్మన్ డాక్టర్ బి.శివ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేషు మాట్లాడుతూ అమ్మవారికి నిర్వహించే ఉత్సవాలలో భాగంగా 15 రోజులపాటు నిత్య పూజలు జరుగుతాయన్నారు.చివరి రోజు పౌర్ణమి రోజున అమ్మవారిని శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తుందనీ పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో అమ్మవారిని దర్శి దర్శించుకున్న భక్తులకు అమితమైన పుణ్యఫల ప్రాప్తిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అమ్మవారీ ఆలయాల్లో వసంత శరన్నవ రాత్రులు విధిగా జరుపుతారని కానీ నవరాత్రి చతుష్టయం ఓరుగల్లు శ్రీ భద్రకాళి దేవాలయంలో మాత్రమే అతి వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృతార్థులు కావాలని ఆయన ఆకాంక్షించారు.సమావేశంలో మండలి సభ్యులు తోనుపూరి వీరన్న, కటకం రాములు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి,ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోత్కూరు మయూరి, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు జారతి వెంకటేశ్వర్లు,అనంతల శ్రీనివాసరావు, పార్నంది నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంపై అమెరికా ఆధిపత్య ధోరణి వ్యతిరేకించండి:వామపక్ష పార్టీల నాయకులు

**-ఉద్ధరించే వ్యాఖ్యలు చేస్తూ, ఆయిల్, గ్యాస్, గనులు దోపిడి చేస్తున్న అమెరికా.**

**- అమెరికా మిలిటరీ ఆయుధ వ్యాపార లాభాల కోసం యుద్ధాలు ప్రేరేపిస్తుంది.**



కడప, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25:2025 జూన్ 25వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు, కడప స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్ నందు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) సిపిఎం,. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ),. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లైనిస్ట్ )లిబరేషన్,. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట-లినినిస్ట్)న్యూ డెమోక్రసీ,. ఆర్.సి.పి., ఆర్.ఎం.పి.ఐ., ఫార్వర్డ్ బ్లాక్ సంయుక్తంగా "ప్రపంచ శాంతి"ని కాంక్షిస్తూ, అమెరికా,ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ "నిరసన" కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... అమెరికా ప్రపంచంపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోందని, ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన 104 యుద్ధాలు అమెరికా ఆర్మీ మారునాయుదాల వ్యాపార లాభాల కోసం ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించినవేనని వారు విమర్శించారు. ఒకవైపు ప్రపంచాన్ని ఉద్ధరించే వ్యాఖ్యలు చెప్పుతూ, మరోవైపు ప్రపంచంలో అనేక దేశాలలోని అత్యంత అరుదైన, విలువైన, నిక్షేపాలను, గనులను, ఆయిల్ ను, గ్యాస్ ను, దోపిడీ చేస్తోందన్నారు. నేడు ప్రపంచంలో జరుగుతున్న పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఏకపక్ష యుద్ధం, ఇరాన్ పై ఇజ్రాయిల్,అమెరికా చేస్తున్న దాడులు, రష్యాపై ఉక్రెను ఉసిగొలుపుతున్న యుద్ధం, చైనాపై తైవాన్ ను రెచ్చగొడుతున్న ఉద్రిక్తతలు, ఉత్తర కొరియా దక్షిణ కొరియాల మధ్య ప్రేరేపిస్తున్న యుద్ధమేఘాలు అమెరికా ప్రేరేపితాలేనని వారు గుర్తు చేశారు. అమెరికా స్వార్థపూరిత ఆయుధ వ్యాపార సైనిక కుట్రలను ప్రపంచం ముందు బహిర్గతం చేస్తున్న కమ్యూనిస్టు దేశాలను, అమెరికా తన మిత్ర దేశాలతో కలిసి అష్టదిగ్బంధం చేయటానికి ప్రయత్నిస్తోందని, ప్రజా అనుకూల ప్రభుత్వాలైన కమ్యూనిస్టు దేశాలు పోరాడుతున్నాయని వారు గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాదుల్లా మాట్లాడుతూ... అమెరికా దుర్మార్గాలకు, ఇజ్రాయిల్ దురాక్రమణలకు హద్దు పద్దు లేకుండా పోయిందని, వారిని ప్రశ్నించే దేశాలపై ఉగ్రవాదం ప్రేరేపిస్తున్నాయని తప్పుడు నిందలు వేసి, వారి వద్ద అనువాయుధాలు తయారీ చేస్తున్నారని నెపం మోపి ఆ దేశాల ప్రజలను చంపుతున్నారని, భౌగోళికంగా అక్కడ అభివృద్ధిని నాశనం చేస్తున్నారని వీరిపై ప్రపంచవ్యాప్తంగా ప్రజా నిరసనలు వస్తున్నాయని గుర్తు చేశారు. సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి బి.ఓబయ్య మాట్లాడుతూ... అమెరికా దుశ్చర్యలను అమెరికా ప్రజలు అమెరికా సైన్యం హర్షించడం లేదని అయినా అమెరికా పాలకుల వైఖరిలో మార్పు రావడం లేదన్నారు. అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా అంతర్జాతీయ పోలీసుగా తన్ను తాను ప్రకటించుకొని దుర్మార్గాలకు పాల్పడుతోందని ప్రశ్నించారు. ఆర్. ఎస్.పి. జిల్లా కార్యదర్శి కె.సుబ్బరాయుడు మాట్లాడుతూ... నరేంద్ర మోడీ దేశ అలీన విదేశాంగ విధానాన్ని విస్మరించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జపం చేస్తున్నారని మన దేశ దీర్ఘకాలిక మిత్రుడైన రష్యాపై ఉక్రెయిన్ ను అమెరికా రెచ్చగొట్టి యుద్ధం చేపిస్తూ ఉంటే అమెరికా శకుని నీతిని ప్రశ్నించకుండా దాటవేస్తోందన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ.రాము, ఆర్.ఎం.పి.ఐ. జిల్లా కార్యదర్శి జి.రమణయ్య మాట్లాడుతూ... పాలస్తీనా ఇరాన్లపై అమెరికా ఇజ్రాయిల్ దాడులు మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్, ఆర్.ఎస్.పి., ఆర్.ఎం.పి.ఐ., ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్ ఎ.అన్వేష్, కే.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, సావన్ సుధాకర్ , గోపి, నరసింహ, నాగరాజు, కమ్యూనిస్టు అభిమానులు డాక్టర్ గోపాల్, శివారెడ్డి, వామపక్ష ప్రజాసంఘాల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో నగర అభివృద్ధి కోసం పనిచేయాలి:జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.

**పారిశుధ్యానికి ప్రథమ ప్రాధాన్యత**

**ఫైళ్ళ కదలికలో వేగం పెంచాలి**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో సయ్యద్ అలీ**






జూన్ 25 (భారత శక్తి) : నగరపాలక సంస్థ లోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ నగర సమగ్ర అభివృద్ధి కోసం పనిచేయాలని కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.బుధవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. నాళాల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి వరద నీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా చూడాలని అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేసే వారిపై నిఘా ఉంచి జరిమానా విధించాలని సూచించారు. అవసరమైన చోట పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూడళ్ళలో అభివృద్ధి పనులు, డివైడర్ల నిర్మాణం, మొక్కల పెంపకం, వాటి నిర్వహణ వాటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నగరంలోని పార్కులు, వాకింగ్ ట్రాక్స్ సమగ్ర నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజలు నడిచేందుకు ఏర్పాటుచేసిన ఫుట్ పాత్ లపై ఆక్రమణలు లేకుండా చూడాలని తెలిపారు. కాంట్రాక్టర్లకు షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా చెల్లింపులు జరగాలని అన్నారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుండి హెల్ప్ లైన్ నంబర్లకు వచ్చే సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి విభాగంలో ఫైళ్ల కదలికలో వేగం పెంచాలని, అధికారులు జవాబుదారితనంతో విధులు నిర్వహించాలని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ కాల పరిమితి ముగిసిన పలు నిర్వహణ పనులకు టెండర్ల ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్యకలాపాలు కొనసాగించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్సులు పొందని వారు సుమారు 9500 మంది ఉన్నట్లుగా సమాచారం ఉందని, వీరంతా ట్రేడ్ లైసెన్స్ పొందే విధంగా చూడాలని అన్నారు. నగరంలో ఎక్కడా అనధికార హోర్డింగ్ ఉండకూడదని అన్నారు. భవనాల నిర్మాణ సమయంలో మెటీరియల్ రోడ్ల పైన వేయకుండా చూడాలని తెలిపారు. అనుమతి లేకుండా రోడ్లను కటింగ్ చేస్తే జరిమానా విధించాలని అన్నారు. నివాసయోగ్యమైన భవనాలకు అనుమతి పొంది వాణిజ్యపరమైన అవసరాలకు ఉపయోగిస్తే వాటిని కమర్షియల్ గా మార్చాలని అన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు వేణుమాధవ్,ఖాదర్ మొహినుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ సువార్త, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యాదగిరి, సంజీవ్ పాల్గొన్నారు.

# మొక్కలు పెంచడంలో ఖమ్మం జిల్లాని ఆదర్శంగా నిలుపాలి:జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**-వన మహోత్సవానికి నర్సరీలలో మొక్కలు సిద్ధం చేయండి.**

**-మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యచరణ.**






ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి న్యూస్ ), జూన్ 25:పచ్చదనం పెంపొందించేందుకు నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలు సిద్ధం చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ చింతకాని మండలంలో బుధవారం పర్యటించారు. వందనం గ్రామంలోని నర్సరీ ని సందర్శించి, నర్సరీ అంతా కలియతిరిగి మొక్కలను పరిశీలించారు. జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని, మొక్కల సంరక్షణకు చేయాల్సిన కార్యచరణ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మొక్కలు పెంచడంలో ఖమ్మం జిల్లాకు ఆదర్శంగా నిలపాలన్నారు. గతం కంటే స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద జిల్లాలో ప్రతి శాఖ, వారికి కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన ట్రీ గార్డ్ మొదలైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రతి శాఖ ఏ మొక్కలు నాటుతున్నామో స్పష్టమైన రికార్డు నిర్వహించాలన్నారు. 2 మీటర్ల ఎత్తు కంటే చిన్న మొక్కలు పెట్టడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటే స్థలం ట్యాగ్ చేసి పెట్టుకోవాలని అన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో లక్ష్యం చేరుకునేందుకు అవసరమైన మేర గుంతల తవ్వకం పనులు ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద సర్వైవల్ రేట్ అధికంగా ఉండే మొక్కలు నాటడానికి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని అన్నారు.

వార్డు అధికారులు తమ వార్డు పరిధిలో మొక్కలు నాటడం వాటి సంరక్షణకు బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇళ్లకు పంపిణి చేసే మొక్కల పెంపకం సైతం అధికారులు పరిశీలించాలని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్ష ణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.అనంతరం కలెక్టర్, వందనం గ్రామంలోని స్వయంభు శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఆశీర్వాదం ఇచ్చి స్వామివారి శేషవస్త్రం, తీర్థాప్రసాదాలు కలెక్టర్ కు అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, చింతకాని ఎంపీడివో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంగుపేట వ్యవసాయ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25:సంగుపేటలోని వ్యవసాయ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు వివరాలు సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు.కళాశాలలో తరగతి గదులను హాస్టల్ రూములను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలో కల సౌకర్యాలను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వివరించారు . ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో పాండు, కళాశాల ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ




భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 25: నిర్మల్ జిల్లా లో జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌక్ నుండి ఎన్టీఆర్ స్టేడియం వరకు సాగిన ఈ ర్యాలీలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలపై వ్యతిరేక నినాదాలతో ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.ఎ. రజాక్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాల వైపు ఆకర్షితమవకుండా వారిలో చైతన్యం కల్గించాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుందని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అబ్కారీ శాఖ సిబ్బంది, పలువురు అధికారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంగారెడ్డి మెడికల్ కళాశాలను సందర్శించిన వైద్య కళాశాల పర్యవేక్షణ కమిటీ

### ఆసుపత్రిలో మౌలిక వసతుల పరిశీలన

### మెడికల్ కళాశాల, బోధన్ ఆసుపత్రులలో మౌలిక వసతుల కల్పన కోసం పర్యవేక్షణ కమిటీల ఏర్పాటు

### విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న కమిటీ సభ్యులు



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25: ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, బోధన్ ఆసుపత్రులలో మౌలిక వసతులు మెరుగు కోసం నాణ్యమైన వైద్య విద్యను విద్యార్థులకు అందించేందుకు అవసరమైన అధునాతన సౌకర్యాలను కల్పించడం కోసం ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలో వైద్య కళాశాల పర్యవేక్షణ కమిటీలను నియమించింది. సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల పర్యవేక్షణ కమిటీ లో డ్రగ్ కంట్రోల్ అడ్మిన్ డీజీ %డ% ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ షా నవాజ్ ఖాసిం, డైరెక్టర్ జనరల్ డి సి ఏ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ,డిఎంఈ నుండి విమల థామస్, అసిస్టెంట్ డీఎంఈ డాక్టర్ వాణి ,మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.సుధా మాధురి, సభ్యులుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల పర్యవేక్షణ కమిటీ (ఎంసీఎంసీ) సభ్యులు బుధవారం సంగారెడ్డి మెడికల్ కళాశాలను, బోధన ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వార్డులను బ్లడ్ బ్యాంకు ను, ఐసీయును విద్యార్థుల తరగతి గదులను, ల్యాబ్ లను , హాస్టల్ గదులను పరిశీలించారు. జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ నిబంధనల మేరకు ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఇంకా కావలసిన సౌకర్యాలు కు ప్రతిపాదనలు రూపొందించారు. ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులకు అవసరమైన అధునాతన సౌకర్యాల కల్పన కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కళాశాల ప్రిన్సిపల్, ఆస్పత్రి సూపరిండెంట్లను ఈ సందర్భంగా ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనాలను వెంటనే నిర్మాణం పూర్తయ్యేలా చేసి వినియోగంలోకి తేవాలని అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు, విద్యార్థులకు రవాణా కోసం బస్సుల ఏర్పాటు, ఆసుపత్రిలో మెడికల్ కళాశాలలో భద్రత చర్యలు చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ అనిల్ కుమార్, ఆర్ %డ%బి డి ఈ రవీందర్ రెడ్డి , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# పటాన్‌చెరు నియోజకవర్గం జిన్నారంలో రైతుల సంబరాలు.

### -ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గ రైతులకు రైతు భరోసా అందింది

### -భారీ ర్యాలీ, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాట శ్రీనివాస్ గౌడ్





పటాన్‌చెరు, జూన్ 25 (భారత శక్తి): పటాన్‌చెరు నియోజకవర్గంలోని అర్హులైన రైతులకు రైతు భరోసా నిధులు విజయవంతంగా జమ కావడాన్ని పురస్కరించుకుని, జిన్నారం గ్రామంలో రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాలభిషేకం చేశారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ "రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమణి, ఇచ్చిన మాట ప్రకారం పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి అర్హులైన రైతుకు రైతు భరోసా నిధులు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే నిలబెట్టుకుంటుందన్నారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, %KSG% యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# జూలై 30 వరకు ఎస్సీ ఎస్టీ కేసులు, భూముల సమస్యలు పరిష్కరించాలి: ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25: జులై 30వ తేదీ వరకు ఎస్సీ ఎస్టీ కేసులో భూముల సమస్యలు పరిష్కరించాలని లక్ష్యంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ నిర్వహించినట్లు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధ్యక్షతన జిల్లాలోని ఎస్సీ ఎస్టీ కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులతో జరిగిన సమీక్ష సమావేశానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారుల నిర్దేశించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ కేసులు జూలై 30వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి నెల అన్ని మండలాలలో పౌర హక్కుల దినోత్సవం కచ్చితంగా నిర్వహించాలన్నారు .ఈ కార్యక్రమానికి తహసీల్దారులు ,ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు . అలా హాజరుకాని అధికారులకు శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఎస్ నుండి వచ్చే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసమే వినియోగించాలన్నారు. ఎస్సీ ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ పథకంపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఈ పథకాన్ని వినియోగించుకొని లబ్ధి పొందేల చూడాలని అధికారులకు ఆదేశించారు.

సంక్షేమ హాస్టల్ లో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు ఎస్సీ ఎస్టీ లకు 41 శాతం కేటాయించినందుకు జిల్లా యంత్రాంగాన్నీ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీల సంక్షేమం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎస్సీ ఎస్టీ భూ సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుకూలంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం రమేష్, రాంబాబు నాయక్, శంకర్, నీలాదేవి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ కార్యాలయంలో సదస్సు



గుమ్మడిదల , భారత శక్తి ప్రతినిధి, జూన్ 25:సంగారెడ్డి జిల్లా కేంద్ర పార్టీ కార్యాలయంలో సదస్సు కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి 50 సంవత్సరాలు అయినా అందున జిల్లా పార్టీ కార్యాలయ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి,జిల్లా రథసారధి, గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల, మున్సిపాలిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. గుమ్మడిదల మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కావలి ఐలేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పలుగు గోవర్ధన్ రెడ్డి,గుమ్మడిదల మండల కమిటీ సెక్రెటరీ కోఆర్డినేటర్ సరిగారి వీరారెడ్డి, జిల్లా కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు సామల అంజిరెడ్డి, అసెంబ్లీ కిసాన్ మోర్చా అధ్యక్షులు రాఘవరెడ్డి,మాజీ మండల అధ్యక్షులు చింతల యాదగిరి, మాజీ ప్రధాన కార్యదర్శి, భూచ్చగారి రాంరెడ్డి,మండల పదాధికారుల కార్యవర్గ సభ్యులు ముత్యాల గౌడ్, భూత్ అధ్యక్షులు ఆకుల నాగరాజు,దాయి రాజశేఖర్ రెడ్డి,గుమ్మడిదల మండల శాఖ కార్యకర్తలు తదిరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసిన గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్



పటాన్‌చెరు, జూన్ 25 (భారత శక్తి):ఇటీవల జరిగిన బదిలీలలో గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్గా బదిలీపై వచ్చిన దశరథ్ బుధవారం పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపల్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.

# మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిర్మూలనకు విడతల వారీగా చర్యలు

### - సంగారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25 :సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో గల సమస్యలు అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన విడుతలుగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వార్డు ఆఫీసర్లకు దిశా నిర్దేశం, నోటీసులు జారీ చేయడం,ప్రజాప్రతినిధులతో పర్యటించి ముమ్మర చర్యలు చేపడతామని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. మహబూబ్ సాగర్ చెరువులో మురికి నీరుని శుద్ధి చేసే యంత్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగిందని త్వరలోనే మురికి నీరు శుద్ధి చేసి ఆ నీటిని చెరువులోకి వదలడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

# రైతు ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు, జూన్ 25 (భారత శక్తి ):పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి రైతు ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని.. అర్హులైన ప్రతి రైతుకి రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రైతులకు రైతు భరోసా నిధులు అందించడంలో కీలక పాత్ర పోషించిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా నిధులు విడుదలైన సందర్భంలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రైతులకు నిధులు విడుదల కాకపోవడంతో వెంటనే స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకుని వెళ్లి.. నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రైతు భరోసాతో పాటు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించేలా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ రైతాంగానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. రైతు భరోసా నిధులు విడుదల చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, మతిన్, మల్లేష్ యాదవ్, విఠల్ రెడ్డి, మాధవ రెడ్డి, బిక్షపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చటి గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చే నిర్ణయం పై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి

### -నవ భారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్



పటాన్‌చెరు, జూన్ 25 (భారత శక్తి):సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో పలు మండలాలను మున్సిపాలిటీ పేరిట రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టే పరిస్థితి నెలకొందని పచ్చటి గ్రామాలను మున్సిపాలీటీలుగా మార్చే నిర్ణయం పై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలనినవ భారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ డిమాండ్ చేయడం జరిగింది. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం సరికాదని ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటే బావుండేదని మెట్టుశ్రీధర్ అభిప్రాయపడటం జరిగింది. గ్రామాలల్లో చిన్న సన్నకారు రైతులు రైతు కూలీలి వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారని గ్రామ పంచాయతీ హెూదాను కొల్పోతే గ్రామీణ ఉపాధి హామీ పథకాలు వర్తించవని గ్రామ కంఠం భూములలో ఇంటి నిర్మాణం చేపట్టాలన్న వ్యవసాయ రుణాల విషయంలో వెసులుబాట్లు కోల్పోయే ప్రమాదం ఉందని కాబట్టి ప్రజల అభిప్రాయలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగాలని మెట్టుశ్రీధర్ కోరడం జరిగింది.

# అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు: 'కన్నప్ప' టీమ్ హెచ్చరిక

హైదరాబాద్: మంచు విష్ణు (ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప' మరో రెండు రోజుల్లో ఇది విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. తమ సినిమా లేదా దాని వాటాదారుల పరువుకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

"24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మితమైన 'కన్నప్ప' జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నటీనటుల అపారమైన కృషి, భారీ బడ్జెట్‌తో అద్భుతమైన చిత్రంగా ఇది రూపొందింది. అన్నిరకాల చట్టపరమైన అనుమతులతో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. ప్రేక్షకులకు చేరువయ్యేలా బాధ్యతాయుతంగా దీనిని సిద్ధం చేశాం. విమర్శకులందరూ ముందుగా ఈ చిత్రాన్ని వీక్షించి.. అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని, ఎలాంటి పక్షపాతాలకు లొంగకుండా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరుతున్నాం. భారత రాజ్యాంగంలోని వాక్ స్వాతంత్రాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను మేము గౌరవిస్తున్నప్పటికీ.. సినిమాను కించపరిచేలా వ్యవహరిస్తే మాత్రం తప్పకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. 'కన్నప్ప'కు సంబంధించిన ఇద్దరు కీలక భాగస్వాములు, ప్రధాన నటులు మోహన్‌బాబు, మంచు విష్ణు వ్యక్తిత్వానికి, ప్రచార హక్కులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఇప్పటికే దిల్లీ హైకోర్టు వారికి రక్షణ కల్పిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

# రైలు ప్రయాణంలో అసౌకర్యమా? టికెట్ డబ్బులు రీఫండ్ పొందండిలా..



: వారణాసి– దిల్లీ వందేభారత్ రైలులో దర్శిల్ మిశ్రా అనే వ్యక్తికి ప్రయాణంలో తీవ్ర అసౌకర్యం ఎదురైంది. ఏసీ పనిచేయలేదని, రైలు పైకప్పు నుంచి నీరు లీకైందని పేర్కొంటూ ఓ వీడియో 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తన ప్రయాణమంతా నిలబడే ప్రయాణించాల్సి వచ్చిందని, టికెట్ సొమ్మును పూర్తిగా రీఫండ్ చేయాలని కోరారు. రైలు ప్రయాణంలో ఇలాంటి సందర్భాలు మనకూ అప్పుడప్పుడు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు మనమేం చేయాలి? టికెట్ మొత్తాన్ని రీఫండ్ ఎలా పొందాలి? ఎలాంటి అసౌకర్యానికి రీఫండ్ ఇస్తారో ఇప్పుడు తెలుసుకుందాం..

రైలు ఆలస్యం కావడం, ఏసీ పనిచేయకపోవడం, రైలును ఇతర మార్గాలకు మళ్లించడం వంటి సందర్భాల్లో ప్రయాణికుడికి కలిగిన అసౌకర్యానికి గానూ రైల్వే శాఖ నుంచి రీఫండ్ కోరొచ్చు. ఇందుకోసం TDR (టికెట్ డిపాజిట్ రిసిప్ట్)ను ఫైల్ చేయాల్సి ఉంటుంది. నిర్దేశిత సమయంలోగా %ఙ=% ఫైల్ చేస్తే మీకు టికెట్ సొమ్ము మొత్తం లేదా పాక్షికంగా రీఫండ్ చేస్తారు. IRCTC వెబ్‌సైట్ లేదా యాప్‌లో టీడీఆర్ ప్రక్రియను పూర్తి చేయొచ్చు. టీడీఆర్ ఫైల్ చేయగానే ఆ వినతి సంబంధిత రైల్వే జోనల్ కార్యాలయానికి చేరుతుంది. తగిన విచారణ అనంతరం సంబంధిత మొత్తాన్ని మీ ఖాతాలో ఐఆర్‌సీటీసీ జమ చేస్తుంది.

ఏయే సందర్భాల్లో..

మీరు ప్రయాణించాల్సిన రైలు మూడు గంటల కంటే ఎక్కువ ఆలస్యంగా నడుస్తున్నట్లు గుర్తిస్తే అందులో మీరు ప్రయాణించే అవకాశం లేకపోతే మీరు రీఫండ్ కోసం దరఖాస్తు చేయొచ్చు. పూర్తి రీఫండ్ కావాలంటే రైలు బయల్దేరే వాస్తవ సమయానికంటే ముందే TDR ఫైల్ చేయాలి.

ఏసీ తరగతిలో ప్రయాణానికి టికెట్ బుక్ చేసుకున్నారు. ప్రయాణంలో ఎక్కడా ఏసీ పనిచేయకపోతే మీరు రీఫండ్ అడగవచ్చు. మీరు గమ్యస్థానానికి చేరుకున్న 20 గంటల్లో టీడీఆర్ ఫైల్ చేయాల్సి ఉంటుంది.

మీరు ప్రయాణించాల్సిన బోగీ కాకుండా వేరే బోగీలో ప్రయాణించిన సందర్భంలో అంటే బుక్ చేసిన తరగతి కాకుండా దిగువ తరగతిలో ప్రయాణించినప్పుడు రెండ్రోజుల్లోపు టీడీఆర్ ఫైల్ చేయాలి.

ఏదైనా కారణంతో మీరు ప్రయాణించాల్సిన రైలు మార్గం మళ్లించడం వల్ల ట్రైన్ అందుకోలేకపోతే 72 గంటల్లో టీడీఆర్ ఫైల్ చేసి రీఫండ్ పొందొచ్చు. మార్గం మళ్లించడం వల్ల దిగాల్సిన స్టేషన్‌ను చేరుకోకపోయిన సందర్భంలోనూ ఇది వర్తిస్తుంది.

ఎలా చేయాలి?

IRCTC వెబ్‌సైట్/ యాప్‌లోకి మీ వివరాలతో లాగిన్ అవ్వాలి.

మై అకౌంట్ సెక్షన్‌లోని మై ట్రాన్సాక్షన్స్‌లోకి వెళ్లాలి. అక్కడ ఫైల్ టీడీఆర్ ఆప్షన్ కనిపిస్తుంది.

TDR ఫైల్ చేసుకోవాలనుకున్న PNR నంబర్‌ను, పేరును ఎంపిక చేసుకోవాలి.

ఫైల్ TDR ఆప్షన్‌ను ఎంచుకోవాలి. TDR ఫైల్ చేసేందుకు కావాల్సిన కారణాన్ని ఎంపిక చేసుకుని ప్రక్రియను పూర్తి చేయాలి.

రీఫండ్ ఎప్పుడు?

టీడీఆర్ కారణాన్ని బట్టి రీఫండ్ అనేది ఆధారపడి ఉంటుంది. రైలు రద్దు, ఆలస్యం వంటి కారణాలకు 5–7 రోజుల్లో రీఫండ్ రుసుం క్రెడిట్ అవుతుంది. ఇతర కారణాలకు 30–60 రోజుల సమయం పట్టొచ్చు. టీడీఆర్ ఫైల్ చేశాక దానిపై రైల్వే అధికారులు విచారించి నిర్ణయం తీసుకోవడం వల్ల ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుంది.

# 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్: పీయూష్ గోయల్

దిల్లీ: 2027 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో

Published : 25 Jun 2025 12:18 IST



భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని సాధించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం, వ్యాపార సంఘాలు, పరిశ్రమలు సహా 140 కోట్ల మంది భారతీయులు.. ప్రధాని మోదీ వికసిత్ భారత్ దార్శనికతతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. శక్తివంతమైన ఆర్థికవ్యవస్థగా మారేందుకు భారత్ సున్నితమైన సమస్యలు ఉన్న ప్రతిచోటా.. ప్రపంచదేశాలతో పోటీపడగలిగేలా తనను తాను మలుచుకుందని గోయల్ అన్నారు. నేడు భారత్ అంతర్జాతీయంగా అత్యున్నతస్థాయిలో ఉందని పేర్కొన్నారు. విదేశాలలో భారతీయ పౌరుల భద్రతకు ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు ఇటీవల కేంద్రప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ సింధు' ఉదాహరణ అని తెలిపారు. ఆపరేషన్ సింధు ద్వారా ఇరాన్, ఇజ్రాయెల్‌లలో చిక్కుకున్న భారతీయులను మోదీ ప్రభుత్వం సురక్షితంగా తమ స్వస్థలాలకు తీసుకువచ్చిందని అన్నారు.

బలమైన స్థూల ఆర్థిక పునాదితో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందని గోయల్ అన్నారు. ఇప్పటివరకు లేనివిధంగా దేశంలో ద్రవ్యోల్బణం అత్యల్పంగా 3 శాతానికి తగ్గిందని తెలిపారు. భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని అందుకోవడం కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టిసారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్దకాలంలో భారత్‌కు చాలా కీలకమన్నారు.

ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించిందని ఇటీవల నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4.19 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.356 లక్షల కోట్ల)కు చేరుకుందని.. జపాన్ కంటే 4.187 బిలియన్ డాలర్లు (సుమారు రూ.35,600 కోట్లు) అధికంగా మన ఆర్థికవ్యవస్థ ఉందన్న అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా గణాంకాలను ఆయన ఉదహరించారు. అమెరికా, చైనా, జర్మనీ తరవాత స్థానంలో మన దేశం ఉందని వివరించారు. ఇలాగే మనం ముందుకుసాగితే మరో మూడేళ్లలో భారత్ జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు.




# వచ్చేవారం మైక్రోసాఫ్ట్‌లో భారీ లేఆఫ్‌ల ప్రకటన..

: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వచ్చేవారం భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని బ్లూమ్‌బెర్గ్ పత్రిక కథనంలో పేర్కొంది. ఈసారి ఎక్స్‌బాక్స్ విభాగంలోని ఉద్యోగులను ఆ సంస్థ లక్ష్యంగా చేసుకొన్నట్లు పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు సంస్థను పునర్ వ్యవస్థీకరించడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టనున్నట్లు ఆ కథనంలో వెల్లడించారు. గత 18 నెలల్లో ఆ సంస్థ ప్రకటించిన నాలుగో అతిపెద్ద లేఆఫ్ కానుందని పేర్కొంది. ముఖ్యంగా 69 బిలియన్ డాలర్లు వెచ్చించి యాక్టివిజన్ బ్లిజార్డ్‌ను కొనుగోలు చేశాక.. లాభదాయకతపై దృష్టిసారించాలని ఒత్తిళ్లు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది.

రానున్న లేఆఫ్‌లో ఎక్స్‌బాక్స్ గ్రూప్‌లోని చాలా బృందాలు ప్రభావితం కానున్నట్లు బ్లూమ్‌బెర్గ్ వెల్లడించింది. గత కొంతకాలంగా మైక్రోసాఫ్ట్ చేపట్టిన లేఆఫ్‌ల వల్ల సంస్థ గ్లోబల్ ఆపరేషన్స్‌లో చాలామంది ఉద్యోగాలపై ప్రభావం పడింది. జూన్ 30తో మైక్రోసాఫ్ట్ ఆర్థిక సంవత్సరం పూర్తికానుండటంతో.. వచ్చేవారం మొదట్లోనే ఆ సంస్థ తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనుంది. కాకపోతే.. గేమింగ్‌తోపాటు మిగిలిన విభాగాలకు కూడా దీనిని వర్తింపజేసే అవకాశాలున్నాయి. మేలో 6,000 మంది ఉద్యోగులను సాగనంపింది. దీనిలో అత్యధికంగా ఇంజినీరింగ్, ప్రొడక్ట్ టీమ్‌లే ఉన్నాయి.

ఇక ఎక్స్‌బాక్స్ డివిజన్ మైక్రోసాఫ్ట్ గేమింగ్ కన్సోల్స్, గేమ్ డెవలప్‌మెంట్ స్టూడియోలు, గేమ్‌పాస్ వంటి డిజిటల్ సర్వీసులను నిర్వహిస్తోంది. ఇప్పటికే ఈ విభాగంలో పెద్దసంఖ్యలో ఉద్యోగులను తొలగించింది. చాలా సబ్సిడరీలను మూసివేసింది. ఇక యాక్టివిజన్ బ్లిజార్డ్ కొనుగోలు తర్వాత వ్యయ నియంత్రణల వ్యూహాన్ని పునః సమీక్షిస్తోంది.

ఇక కృత్రిమ మేధ, క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌పై మైక్రోసాఫ్ట్ దృష్టిపెట్టడం కూడా ఉద్యోగుల తగ్గింపునకు కారణంగా నిలిచింది. చిన్న, మధ్యశ్రేణి సంస్థలకు సాఫ్ట్‌వేర్ సేల్స్‌ను ఇటీవలే సంస్థ ఔట్ సోర్సింగ్‌కు ఇచ్చి.. తమ ఇన్ హౌస్ ఉద్యోగులను తప్పించింది. సంస్థ కార్యకలాపాల వ్యయాలను తగ్గించుకోవడంపై దృష్టిపెట్టిందనడానికి ఇదే అతిపెద్ద నిదర్శనం. జూన్ 2024 నాటికి మైక్రోసాఫ్ట్‌కు ప్రపంచవ్యాప్తంగా 2.28 లక్షల మంది ఉన్నారు. వీరిలో 45 వేల మంది మార్కెటింగ్, సేల్స్ విభాగాల్లో పని చేస్తున్నారు.

# ఈపీఎఫ్ఓ గుడ్‌న్యూస్.. ఆటో సెటిల్‌మెంట్ లిమిట్ 5 లక్షలకు పెంపు

ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (చందాదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ముందస్తు ఉపసంహరణలకు సంబంధించి ఆటో సెటిల్‌మెంట్ పరిధిని ఈపీఎఫ్ఓ సవరించింది. ప్రస్తుతం రూ.లక్షగా ఉన్న మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచింది. అంటే రూ.5 లక్షల వరకు క్లెయిమ్‌లు త్వరితగతిన సెటిల్ కానున్నాయన్నమాట. అత్యవసర సమయాల్లో క్లెయిమ్స్ చేసే ఈపీఎఫ్ఓ సభ్యులకు దీనివల్ల లబ్ధి చేకూరనుందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రకటించారు. కొవిడ్ సమయంలో ఆటోసెటిల్‌మెంట్ విధానాన్ని తొలిసారి ఈపీఎఫ్ఓ తీసుకొచ్చింది.

ఏమిటీ ఆటో సెటిల్‌మెంట్?

సాధారణ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు ఆటో ప్రాసెసింగ్‌ను ఈపీఎఫ్ఓ తీసుకొచ్చింది. మానవ ప్రమేయం లేకుండా క్లెయిమ్‌లను పరిష్కరించడమే ఈ ఆటో సెటిల్‌మెంట్ ముఖ్య ఉద్దేశం. వివాహం, ఉన్నత విద్య, ఇంటి కొనుగోలు చేయడం కోసం ఈపీఎఫ్ ఆటో– సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. దీని సాయంతో ఇకపై రూ.5 లక్షల వరకు మానవ ప్రమేయం లేకుండా వేగంగా క్లెయిమ్ పొందొచ్చు.

3–4 రోజుల్లోనే ఖాతాల్లోకి..

ఆటో సెటిల్‌మెంట్‌లో మానవ ప్రమేయం ఉండదు కాబట్టి రూ.5 లక్ష వరకు ఎలాంటి క్లెయిమ్స్ అయినా ఇట్టే పరిష్కారం అవుతాయి. ఆటో సెటిల్‌మెంట్ అనేది ఐటీ వ్యవస్థతో పని చేస్తుంది. అర్హత ఉండి.. కేవైసీ, బ్యాంక్ వ్యాలిడేషన్ పూర్తయినట్లయితే ఐటీ టూల్స్ పేమెంట్‌ను ఆటోమేటిక్‌గా ప్రాసెస్ చేస్తాయి. దీనివల్ల క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమయం అనేది 10 రోజుల నుంచి 3–4 రోజులకు తగ్గుతుంది. ఆటో సెటిల్‌మెంట్ల కారణంగా క్లెయిమ్ సెటిల్‌మెంట్లలో వేగం పుంజుకుంటుంది.




ఏయే కారణాలకు?

వైద్య ఖర్చుల కోసం: ఈపీఎఫ్ చందాదారులు తమ వ్యక్తిగత లేదా కుటుంబసభ్యుల వైద్య ఖర్చుల నిమిత్తం రూల్ 68జె కింద ఈపీఎఫ్‌లో కొంత భాగాన్ని విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు ఉంది. ఇందుకోసం అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. రూల్ 68జె కింద కచ్చితంగా ఇన్ని సంవత్సరాల తర్వాతనే నగదు ఉపసంహరించుకోవాలనే నియమేమీ లేదు. ఉద్యోగి ఆరు నెలల బేసిక్ ప్లస్ డీఏ లేదా జమ అయిన మొత్తంలో ఉద్యోగి వాటా (వడ్డీ సహా).. ఈ రెండింటిలో ఏది తక్కువైతే అంతవరకు మాత్రమే విత్‌డ్రా చేసుకోవడానికి వీలుంటుంది. ఈపీఎఫ్ ఉపసంహరణ దరఖాస్తు కోసం డాక్టర్ సంతకం చేసిన సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. పెళ్లి, విద్య: రూల్ 68కె నియమం ప్రకారం.. ఉద్యోగి తన/ కుటుంబసభ్యుల పెళ్లి, పిల్లల విద్య కోసం పీఎఫ్‌లో నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే ఈపీఎఫ్ఓలో చేరి 7 సంవత్సరాలు పూర్తయిన తర్వాత మాత్రమే విత్‌డ్రా చేయాల్సి ఉంటుంది. ఈ అవసరాల కోసం కేవలం మూడుసార్లు మాత్రమే తన పీఎఫ్ బ్యాలెన్స్‌లో 50 శాతం వరకు గరిష్ఠంగా తీసుకోవచ్చు. వివాహం కోసం డబ్బు ఉపసంహరించుకోవాలంటే ఈపీఎఫ్ సభ్యుడు ఆన్‌లైన్‌లో డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. అదే పిల్లల చదువు కోసం అయితే సంబంధిత సర్టిఫికెట్ ఇవ్వాలి.

ఇంటి నిర్మాణం: ఇక రూల్ 68బి ప్రకారం చందాదారులు స్థలం కొనుగోలు/ ఇంటి నిర్మాణం కోసం, ఇంటి రిపేర్ కోసం పీఎఫ్ బ్యాలెన్స్‌లో పరిమితి మేరకు డబ్బు ఉపసంహరించుకోవచ్చు. ఈపీఎఫ్‌లో చేరి కనీసం ఐదేళ్లు పూర్తయి ఉండాలి. రెండుసార్లు మాత్రమే ఈ కారణంతో విత్‌డ్రా చేసుకోవచ్చు. మీ అవసరంపై ఉపసంహరించుకొనే మొత్తం ఆధారపడి ఉంటుంది. క్లెయిమ్‌ను ఫైల్ చేయడానికి ఫారం 31ని ఆన్‌లైన్‌లో సమర్పించాలి.

గమనిక: ఈనాడు.నెట్‌లో కనిపించే వ్యాపార ప్రకటనలు వివిధ దేశాల్లోని వ్యాపారస్తులు, సంస్థల నుంచి వస్తాయి. కొన్ని ప్రకటనలు పాఠకుల అభిరుచిననుసరించి కృత్రిమ మేధస్సుతో పంపబడతాయి. పాఠకులు తగిన జాగ్రత్త వహించి, ఉత్పత్తులు లేదా సేవల గురించి సముచిత విచారణ చేసి కొనుగోలు చేయాలి. ఆయా ఉత్పత్తులు / సేవల నాణ్యత లేదా లోపాలకు ఈనాడు యాజమాన్యం బాధ్యత వహించదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావు లేదు.

# మెదడులో పెను విపత్తు

పక్షవాతం చెట్టంత మనిషిని హఠాత్తుగా కుప్పకూలేలా చేస్తుంది. కాలూ చేయి చచ్చుబడేలా చేసి, మంచాన పడేస్తుంది. అవయవాలు స్వాధీనంలోకి వచ్చినా ఎంతోకొంత వైకల్యం వేధిస్తూనే ఉంటుంది. పక్షవాతం బాధితుల్లో 30% మంది ఇలాంటివారే. రోజువారీ పనులకు ఇతరుల మీద ఆధారపడుతున్నవారే. కేవలం నూటికి 30 మందే మునుపటి స్థితికి చేరుకుంటున్నారు. మరో 30% మంది మృత్యువాత పడుతున్నారు. నిజానికి పక్షవాతాన్ని చాలావరకూ నివారించుకోవచ్చు. లక్షణాలను ముందే గుర్తిస్తే సమస్య తీవ్రం కాకుండానూ చూసుకోవచ్చు. ఇటీవల రామోజీ ఫిల్మ్‌సిటీలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ నిర్వహించిన కార్యశాలకు విచ్చేసిన వైద్య నిపుణులు ముక్తకంఠంగా చెబుతున్న విషయమిదే.



సత్వర స్పందన కీలకం

పక్షవాతం కేసులు రోజురోజుకీ పెరుగుతుండటం ఆందోళనకరం. 25 ఏళ్లు దాటినవారిలో ప్రతి నలుగురిలో ఒకరు దీని బారినపడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా 60 ఏళ్లు దాటినవారిలో దీన్ని చూస్తుంటాం. కానీ ఇప్పుడు 30ల్లో, 40ల్లోనూ ఎంతోమంది దీని బారినపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కాబట్టి ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగుండటం తప్పనిసరి.

రెండు రకాలు: పక్షవాతం రెండు రకాలు. ఒకటి– మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో రక్తం గడ్డలు ఏర్పడటం వల్ల వచ్చేది (ఇస్కీమిక్). పక్షవాతం కేసుల్లో ఇదే ఎక్కువ. సుమారు 85% మందిలో ఇలాంటి రకం కనిపిస్తుంటుంది. రెండు– మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి రక్తస్రావం కావటం వల్ల తలెత్తేది (హెమరేజిక్). పక్షవాతం బారినపడుతున్న దాదాపు 15% మంది దీనికి గురవుతున్నారు.

ప్రధాన ముప్పు కారకాలు: పక్షవాతానికి అధిక రక్తపోటు, మధుమేహం, పొగ తాగటం.. జర్దా, గుట్కా, ఖైనీ నమలటం.. అతిగా మద్యం తాగటం, కుటుంబంలో ఇంతకుముందు ఎవరికైనా పక్షవాతం వచ్చి ఉండటం ప్రధాన ముప్పు కారకాలు. గుండె లయ తప్పటం వంటి కొన్ని గుండెజబ్బులూ కారణం కావొచ్చు. ఇలాంటివారికి రక్తం గడ్డలు ఏర్పడే ముప్పు ఎక్కువ. ఇవి మెదడు రక్తనాళాలకు చేరుకొని పక్షవాతం సంభవించొచ్చు. మరోవైపు జన్యు స్వభావమూ మన భారతీయులకు ముప్పు తెచ్చిపెడుతోంది. పాశ్చాత్యదేశాల కన్నా మనదేశంలో పదేళ్ల ముందే పక్షవాతం దాడి చేస్తోంది.

వీలైనంత త్వరగా చికిత్స: ఇస్కీమిక్, హెమరేజిక్ పక్షవాతాలకు చికిత్సలు రెండూ వేర్వేరే. ఒకదానికి చేసే చికిత్స మరోదానికి భిన్నం. కాబట్టి వీటి మధ్య తేడా తెలుసుకోవటం ముఖ్యం. ఇందుకు సీటీ స్కాన్ ఉపయోగపడుతుంది. సమస్యను నిర్ధరించి ఎంత త్వరగా చికిత్స చేస్తే అంత మంచి ఫలితం కనిపిస్తుంది. మెదడుకు రక్త సరఫరా ఆగిపోతే ప్రతి నిమిషానికి 20 లక్షల నాడీ కణాలు చనిపోతాయి. ఇవి తిరిగి కుదురుకోవు. అందుకే ప్రతి నిమిషమూ అమూల్యమే. వీలైనంత త్వరగా చికిత్స ఆరంభించి, మెదడుకు తిరిగి రక్త సరఫరా చేయగలిగితే నాడీ కణాలు చనిపోకుండా, మెదడు మరీ ఎక్కువగా దెబ్బతినకుండా చూడొచ్చు. ఫలితంగా త్వరగా కోలుకోవటానికి వీలుంటుంది. ఆలస్యమైనకొద్దీ నాడీ కణాలు దెబ్బతింటూనే వస్తుంటాయి. ప్రాణాపాయమూ సంభవించొచ్చు. ముఖ్యంగా అధిక రక్తపోటు మందులు క్రమం తప్పకుండా వేసుకోకపోయినా, హైబీపీ ఉన్న సంగతి తెలియక పోయినా, తెలిసి నిర్లక్ష్యం చేసినా పక్షవాతం తీవ్రంగా దాడి చేస్తుంది. తీవ్రమైన తలనొప్పి, వాంతులతో కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదముంది. నాలుగున్నర గంటల్లోపు గడువును అమూల్య సమయం (గోల్డెన్ అవర్)గా భావిస్తారు. ఈ గడువు లోపు చికిత్స ఆరంభిస్తే మెదడు మరీ ఎక్కువగా దెబ్బతినకుండా చూసుకోవచ్చు. ఇప్పుడు రక్తం గడ్డలను కరిగించే మంచి మందులు ఉన్నాయి. వీటిని సమయానికి ఇస్తే చాలామందిని మంచాన పడకుండా, ప్రాణాపాయం సంభవించకుండా కాపాడుకోవచ్చు. హెమరేజిక్ పక్షవాతానికి చికిత్స కష్టమనే చెప్పుకోవాలి. ఎందుకంటే నేరుగా మెదడులో రక్తస్రావాన్ని ఆపలేం. రక్తం గడ్డకట్టే ప్రక్రియలను ఉత్తేజితం చేయటం ద్వారా రక్తస్రావాన్ని తగ్గించటమో లేదా ఆపటమో చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ప్రయోగాత్మకంగా రక్తస్రావాన్ని ఆపే ట్రానిగ్జామిక్ యాసిడ్ వంటి కొత్త మందులనూ ప్రయత్నిస్తున్నారు. కొందరికి రక్తస్రావమైన చోట చుట్టుపక్కల లేదా మెదడులో వాపు తలెత్తి తలలో ఒత్తిడి బాగా పెరుగుతుంది. వీరికి వాపు తగ్గించే మందులు అవసరం. కొన్నిసార్లు ఒత్తిడిని తగ్గించటానికి సర్జరీతో పుర్రెలో కొంత భాగాన్ని తొలగించాల్సి వస్తుంది. గుండెజబ్బులు గలవారిలో కొందరు రక్తాన్ని పలుచగా ఉంచే మందులు వేసుకుంటుంటారు. ఇలాంటివారికి పక్షవాతం వస్తే విరుగుడు మందులు ఇవ్వాల్సి ఉంటుంది.

స్వల్ప పక్షవాతం విభిన్నం: కొందరిలో పక్షవాతం స్వల్పంగా (ట్రాన్సియెంట్ ఇస్కీమిక్ ఎటాక్) వస్తుంటుంది. ఇందులో లక్షణాలు కొద్దిసేపే ఉండి, వాటంతటవే పోతాయి. దీన్ని చాలామంది తేలికగా తీసుకుంటారు. ఇది ముమ్మందు నిజంగా పక్షవాతం రాబోతోంది అనటానికి హెచ్చరిక. స్వల్ప పక్షవాతం వచ్చిన తొలి మూడు రోజుల్లో లేదా వారంలో పెద్ద పక్షవాతం వచ్చే ముప్పు చాలా ఎక్కువ. కాబట్టి నిర్లక్ష్యం చేయొద్దు.

టైమ్ ఈజ్ బ్రెయిన్

ప్రస్తుతం చిన్నా పెద్దా తేడా లేకుండా చాలామంది పక్షవాతం బారినపడుతున్నారు. దీని మూలంగా ఎంతోమంది జీవనోపాధి కోల్పోతున్నారు. గుండె జబ్బుల్లో టైమ్ ఈజ్ మజిల్ అనే నానుడి ప్రచారంలో ఉంది. అంటే ఎంత త్వరగా చికిత్స మొదలెడితే గుండె కణజాలాన్ని అంత ఎక్కువగా కాపాడుకోవచ్చని. పక్షవాతం విషయంలోనూ టైమ్ ఈజ్ బ్రెయిన్ అని చెప్పుకోవాలి. ఎంత త్వరగా చికిత్స చేస్తే అంత త్వరగా కోలుకుంటారు. చికిత్స మూడు గంటలు ఆలస్యమైతే 30 ఏళ్ల ముందే వృద్ధాప్యంలోకి జారిపోతారు. తమ పనులు తాము చేసుకోలేరు. కుటుంబానికి భారంగా మారతారు. 30, 40 ఏళ్లలోనే పక్షవాతం బారినపడితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుంది. కాబట్టి అంతా జాగ్రత్తగా ఉండాలి. జబ్బు వచ్చాక బాధపడే కన్నా ముందు నుంచే నివారణ చర్యలు తీసుకోవాలి. జీవనశైలిని మార్చుకోవటం, అధిక రక్తపోటు సమస్య ఉంటే ముందే గుర్తించి మందులు వాడటం చాలా ముఖ్యం. తెల్ల బియ్యానికి బదులు దంపుడు బియ్యం తినాలి. అదీ మితంగానే. అలాగే పప్పులు, కూరగాయలు విధిగా తీసుకోవాలి. నెయ్యి, నూనె పదార్థాలు మితంగా తీసుకోవాలి. యోగా.. ముఖ్యంగా సూర్య నమస్కారాలు చేయటం ఉత్తమం.

# రొమ్ముక్యాన్సర్‌కు తేనె చికిత్స

రొమ్ముక్యాన్సర్‌కు సహజ చికిత్స ఉంటే? అదీ తీయని తేనెలాంటిదైతే? అంతకన్నా కావాల్సిందేముంది? యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెలిస్ (యూసీఎల్ఏ) శాస్త్రవేత్తలు అలాంటి తీపి కబురే అందించారు. మనుకా తేనె రొమ్ముక్యాన్సర్ కణాల వృద్ధిని 84% వరకూ తగ్గిస్తున్నట్టు గుర్తించారు. అదీ ఆరోగ్యకర కణాలకు ఎలాంటి హాని చేయకుండా, మరీ పెద్ద దుష్ప్రభావాలేవీ లేకుండా. అందుకే రొమ్ముక్యాన్సర్.. ముఖ్యంగా ఈస్ట్రోజన్ గ్రాహక (ఈఆర్) పాజిటివ్ రొమ్ముక్యాన్సర్ నివారణ, చికిత్సలో ఇది ప్రత్యామ్నాయ, సహజ పద్ధతి కాగలదని ఆశిస్తున్నారు.

అటు పోషకాహారంగా ఇటు ఔషధంగా ఉపయోగపడే న్యూట్రాస్యూటికల్స్ రోజురోజుకీ ప్రాచుర్యం పొందుతున్నాయి. గ్రీన్ టీ, ఒమేగా 3 కొవ్వులు, అశ్వగంధ జిన్‌సెంగ్ వంటివి వీటి కోవలోకి వచ్చేవే. ఇలాంటి పోషణ ఔషధాల్లో మనుకా తేనె గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. మామూలుగా తేనెటీగలు రకరకాల పూల నుంచి మకరందాన్ని సేకరించి తేనెను తయారుచేస్తాయి. కానీ



మనుకా తేనె అలాంటిది కాదు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ఆగ్నేయాసియా ప్రాంతంలో పెరిగే ఒక టీ ట్రీ (లెప్టోస్పెర్మమ్ స్కోపేరియం) పువ్వుల మకరందాన్ని మాత్రమే తేనేటీగలు సంగ్రహించేలా చేసి, దీన్ని తయారుచేస్తారు. ఇది కాస్త జిడ్డుగా ఉంటుంది. దీనికి చాలా ఔషధ గుణాలున్నాయి. మనుకా తేనె యాంటీబ్యాక్టీరియా, యాంటీఆక్సిడెంట్ గుణాలను కలిగున్నట్టు అధ్యయనాల్లో తేలింది. అంటే బ్యాక్టీరియాను నిర్మూలించటంతో పాటు వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)నూ తగ్గిస్తుందన్నమాట. క్యాన్సర్ వంటి జబ్బులకు వాపు ప్రక్రియే బీజం వేస్తుండటం గమనార్హం. తాజాగా మనుకా తేనె రొమ్ముక్యాన్సర్ నివారణ, చికిత్సకు తోడ్పడగలదని యూసీఎల్ఏ ప్రాథమిక అధ్యయనంలో తేలటం ఆసక్తి కలిగిస్తోంది. సంప్రదాయ కీమోథెరపీకి సహజ, తక్కువ విషతుల్యమైన ప్రత్యామ్నాయ చికిత్స రూపకల్పన దిశగా ఇది ఆశలు రేకెత్తిస్తోందని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ దయానా మార్వ్యెజ్ గర్బన్ చెబుతున్నారు. క్యాన్సర్ చికిత్సలో సహజ రసాయన మిశ్రమాల ప్రయోజనాలను పూర్తిగా అర్థం చేసుకోవటానికి మరింత పరిశోధనలు చేయాల్సిన అవసరమున్నప్పటికీ ఈ రంగంలో భవిష్యత్ పరిశోధనకు ఈ అధ్యయనం బలమైన పునాది వేసిందని అభిప్రాయపడుతున్నారు.

ఈఆర్ పాజిటివ్ రకమే ఎక్కువ

రొమ్ముక్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 60% నుంచి 70% వరకూ ఈఆర్ పాజిటివ్ రకమే కనిపిస్తుంటుంది. ఇందులో క్యాన్సర్ కణాల్లోని గ్రాహకాలు ఈస్ట్రోజన్ హార్మోన్‌ను సంగ్రహించుకొని, కణితి వృద్ధి చెందేలా చేస్తాయి. ఇలాంటి రకం క్యాన్సర్ గలవారికి కణితి వృద్ధిని అడ్డుకోవటానికి యాంటీ ఈస్ట్రోజన్ చికిత్స సూచిస్తుంటారు. అయితే కొందరిలో ఈ చికిత్స పనిచేయదు. దీనికి లొంగకుండా క్యాన్సర్ మొండిగా తయారవుతుంది. వీరికి కీమోథెరపీ చేయక తప్పదు. దీంతో జుట్టు ఊడటం, నోట్లో పుండ్లు, ఆకలి తగ్గటం, అలసట, ఇన్‌ఫెక్షన్ల వంటి దుష్ప్రభావాలు తలెత్తుతుంటాయి. మనుకా తేనెతో ఇలాంటి ఇబ్బందులు తప్పే అవకాశముంది.

ప్రయోగం ఎలా?

పరిశోధకులు ఈస్ట్రోజన్ రిసెప్టర్ పాజిటివ్, ట్రిపుల్ నెగెటివ్ (ఇందులో కణాలకు ఎలాంటి గ్రాహకాలూ ఉండవు) క్యాన్సర్ కణాలను ప్రయోగశాలలో వృద్ధి చేశారు. కొన్ని కణాలకు మనుకా తేనె, మనుకా తేనె పొడితో చికిత్స చేశారు. మరికొన్నింటికి సంప్రదాయ చికిత్సతో పరిశీలించారు. ట్రిపుల్ నెగెటివ్ క్యాన్సర్ కణాల్లో కణితిని అడ్డుకునే ప్రభావాలు అంతగా కనిపించలేదు. యాంటీ ఈస్ట్రోజన్ చికిత్సలో విరివిగా వాడే టామోక్సిఫెన్ మందును మనుకా తేనెతో కలిపి వాడగా ఈఆర్ పాజిటివ్ రొమ్ముక్యాన్సర్ కణాల వ్యాప్తి గణనీయంగా తగ్గిపోవటం గమనార్హం. మరింత నిశితంగా కణాలను పరిశీలించగా తేనె మూలంగా రక్తంలో ఈస్ట్రోజన్ మోతాదులు, కణాల్లోని గ్రాహకాలు తగ్గినట్టు తేలింది. అంతేకాదు, కణితి కణాలు తమకు తాముగా చనిపోయేలా ప్రేరేపితం కావటం వల్ల క్యాన్సర్ వృద్ధి చెందే ప్రక్రియ కూడా అస్తవ్యస్తమైంది. అనంతరం ఎలుకల మీదా పరిశోధకులు అధ్యయనం చేశారు. మనుషుల ఈఆర్ పాజిటివ్ రొమ్ముకణాలను ఎలుకల్లో ప్రవేశపెట్టి, కణితి వృద్ధి చెందేలా చేశారు. తర్వాత కొన్నింటికి మనుకా తేనె తాగించారు. మామూలు ఎలుకలతో పోలిస్తే తేనె తాగిన వాటిల్లో కణితి వృద్ధి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఆరోగ్య కణాలకు హాని చేయకుండా మానవ రొమ్ముక్యాన్సర్ కణితి వృద్ధి, వ్యాప్తి 84% వరకూ తగ్గినట్టు బయటపడింది.

ఏంటీ ప్రయోజనం?

మనుకా తేనె వంటి సహజ రసాయన మిశ్రమాలకు కణితిని నిలువరించే గుణమున్నట్టు, హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్ రొమ్ముక్యాన్సర్ల విషయంలో మరింత ప్రభావం చూపుతున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. ముమ్మందు అనుబంధ ఔషధం లేదా బలమైన ప్రత్యామ్నాయ చికిత్సగా మనుకా తేనెను అభివృద్ధి చేసే అవకాశముందని భావిస్తున్నారు. క్యాన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలనూ చంపే క్యాన్సర్ మందులకిది ప్రత్యామ్నాయం కాగలదని ఆశిస్తున్నారు.

# మనసా.. తిండి వైపా?

ఆకలి వేసినప్పుడు తినటం మామూలే. కానీ కొందరు ఏమీ తోచనప్పుడు, విసుగు (బోర్) పుట్టినప్పుడూ తింటుంటారు. చిప్స్, జంతికలో.. ఏదో ఒకటి నోట్లో వేసుకొని నములు తుంటారు. విసుగు పుట్టినప్పుడు మెదడు కొంత హుషారును కోరుకుంటుంది. ఇదే చిరుతిండి వైపు దృష్టి మళ్లించేలా చేస్తుంది. ఎప్పుడో అప్పుడంటే ఏమో గానీ తరచూ ఇలా తింటుంటే చిక్కులు తప్పవు. కేలరీలు



తప్ప ఎలాంటి పోషకాలు లేని జంక్‌ఫుడ్‌తో బరువు పెరగటం, మధుమేహం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. కాబట్టి జాగ్రత్త అవసరం. ఏమీ తోచనప్పుడు చిరుతిళ్ల వైపు చూడటం కన్నా ప్రత్యామ్నాయ మార్గాలను పాటించటం మేలు.

నీరు తాగటం: ఆకలి వేస్తున్నట్టు అనిపించినా కొన్నిసార్లు దీనికి దాహం కారణం కావొచ్చు. కాబట్టి వెంటనే చిరుతిండికి బదులు ఓ గ్లాసు నీరు తాగి చూడండి. ఇది చాలాసార్లు ఆకలి తగ్గటానికి తోడ్పడుతుంది.

మనసును మళ్లించటం: విసుగు పుట్టినప్పుడు మనసును దారి మళ్లిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. అటూ ఇటూ నాలుగడుగులు వేయటం, ఇష్టమైనది ఏదైనా చదవటం, స్నేహితులతో మాట్లాడటం మేలు. దీంతో తిండి వైపు యావ తగ్గుతుంది.


ఏదైనా నమలటం: బబుల్‌గమ్, సోంపు వంటివి నోట్లో వేసుకుని నములుతుంటే అనవసరంగా చిరుతిండి తినకుండా చూసుకోవచ్చు. అంతేకాదు, తక్కువ కేలరీలతో కడుపు నిండిన భావనా కలుగుతుంది.

గ్లూకోజు స్థిరంగా: రక్తంలో గ్లూకోజు మోతాదులు తగ్గినప్పుడు చిరుతిండి తినకుండా ఆగటం కష్టం. అందువల్ల పీచు, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన సమతులాహారం తినాలి. దీంతో రక్తంలో గ్లూకోజు మోతాదులు మరీ ఎక్కువ, తక్కువ కాకుండా ఉంటాయి. హఠాత్తుగా చిరుతిండి తినాలనే కోరికా తగ్గుతుంది.

మనసుతో ఆలోచించి: చిరుతిండిని నోట్లో వేసుకోవటానికి ముందు కాసేపు ఆగి నిజంగా ఆకలవుతోందా? ఏమీ తోచక తినాలనిపిస్తోందా? అని ఎవరికివారే ప్రశ్నించుకోవటం మంచిది. ఎందుకు తింటున్నామనే దాన్ని గుర్తించగలిగితే మంచి నిర్ణయాలు తీసుకోవటానికి మార్గం సుగమమవుతుంది.

చిరు వ్యాయామం: చిన్న వ్యాయామమైనా పెద్ద మార్పు తెచ్చిపెడుతుంది. కాసేపు నడిచినా, శరీరాన్ని సాగదీసినా ఉత్సాహం వస్తుంది. మనసుకు సహజంగా ఉల్లాసం చేకూరటం వల్ల తినాలనే యావ తగ్గుతుంది.

# బరువు తగ్గాలా?



బరువు తగ్గించే ఆహార పద్ధతిని మొదలెట్టాలని అనుకుంటున్నారా? అది పనిచేస్తుందో లేదోనని సందేహిస్తున్నారా? అయితే ఆహారంలో కేలరీలు తగ్గించటంతో పాటు ప్రొటీన్, పీచు పదార్థాలు పెంచుకోండి. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ పరిశోధకుల అధ్యయనం ఇదే విషయాన్ని చెబుతోంది. ఆహార పద్ధతి ఆయా వ్యక్తులకు అనుగుణంగా, దీర్ఘకాలం పాటించేలా మార్పులు చేర్పులకు అనుగుణంగానూ ఉండాలని సూచిస్తోంది. ఇందులో ఇండివిజువలైజ్డ్ డైట్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐడిప్) అనే కొత్త బరువు తగ్గించే పద్ధతి ప్రభావాలను పరిశీలించారు. ఆహార పదార్థాల్లోని ప్రతి కేలరీకి ఎంత ప్రొటీన్, పీచు ఉంటుందో, భోజనం చేసేటప్పుడు ప్రతిసారీ ఎంత తినాలో సూచించే ప్రత్యేక టూల్‌ను పరిశోధకులు సృష్టించారు.

దీని ఆధారంగా రోజుకు 1,500 కేలరీల లోపు శక్తినిచ్చే ఆహారం.. ఇందులో 80 గ్రాముల ప్రొటీన్, 20 గ్రాముల పీచు ఉండేలా ఎవరికివారు తమకు నచ్చిన విధంగా ఆహార పద్ధతిని నిర్ణయించుకోవచ్చు. దీన్ని పాటించినవారిలో ఏడాది తర్వాత శరీర బరువులో 12.9% తగ్గటం గమనార్హం. ఎంత ఎక్కువగా ప్రొటీన్, పీచు ఎక్కువగా తీసుకుంటే అంత అధికంగా బరువు తగ్గుతున్నట్టు తేలింది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy